27-7Pg1exHMNWJQE.qxd:27-7Pg1exHMNWJQE.qxd 01/01/01 8:33 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ : fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 176 పేజీలు: 12 వెల: 8.00

యుఎస్ వీసా, పౌరసత్వ పరీక్షలు మరింత కఠినతరం

న్యాయవ్యవస్థకు వికేంద్రీకరణ అవశ్యం 9లో

## అత్యంత విశ్వసనీయ గ్లోబల్ లీడర్‌గా ప్రధాని మోడీ



### మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడి


**న్యూఢిల్లీ,జూలై 26:** ప్రధాని నరేంద్రమోదీ మరో ఘనత సాధించారు. ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ లీడర్ సర్వేలో అత్యంత విశ్వసనీయత కలిగిన నేతగా మోదీ మొదటిస్థానంలో నిలిచారు. ఎన్నో యుద్ధాలు ఆపానంటూ గొప్పలు చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ ఈ సర్వేను జులై 4 నుంచి 10 మధ్య నిర్వహించింది. అందులో ప్రధాని మోదీకి 75 శాతం మంది మద్దతు ప్రకటించారు. ఆ వివరాలను బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్టు చేశారు. భారతీయులతోపాటు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది విశ్వసించే నేతగా ప్రధాని మోజీ అగ్రస్థానంలో నిలిచారని ఆయన కొనియాడారు. భారత్ సురక్షితమైన నాయకుడి చేతుల్లో ఉందని మాలవీయ అన్నారు. 59శాతంతో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జేమ్యుంగ్ రెండో స్థానంలో నిలవగా, 57 శాతంతో అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలి, 56 శాతంతో కెనడా ప్రధాని మార్క్ కార్నీ వరుసగా మూడు, నాలుగు స్థానాలు దక్కించుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 44శాతంతో ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యారు. గ్లోబల్ లీడర్ సర్వే అంతర్జాతీయ వేదికపై మోదీకి కొనసాగుతున్న ప్రజాదరణను చాటిచెప్పింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన నేతగానూ ప్రధాని మోదీ పలు మార్లు తొలిస్థానంలో నిలిచారు. 2021 సెప్టెంబరులో మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన సర్వేలో ప్రధానికి 70 శాతం మద్దతు లభించింది. 2022 ప్రారంభంలో 71శాతంతో అత్యంత ప్రజాదరణ పొందిన నేతగా ప్రపంచంలోనే మొదటిస్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఏప్రిల్, సెప్టెంబర్, డిసెంబర్‌లో నిర్వహించిన సర్వేల్లో 76 శాతం మద్దతు లభించింది. 2024 ఫిబ్రవరిలో 78 శాతంతో మరోసారి ప్రధాని అగ్రస్థానానికి చేరుకొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ మరో రికార్డ్‌ను సృష్టించారు. దేశంలో వరుసగా ప్రధాని పదవి చేపట్టి ఎలాంటి విరామం లేకుండా సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న రెండో నేతగా నిలిచారు. దీంతో ఇప్పటి వరకు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరిట ఉన్న రికార్డును ప్రధాని నరేంద్ర మోదీ అధిగమించారు. 2014 మే 26వ తేదీన తొలిసారి ప్రధాని అయిన మోదీ, 2025 జులై 25తో 4,708 రోజులు పూర్తి చేసుకున్నారు. దివంగత ఇందిరాగాంధీ 24.01.1966 నుంచి 24.3.1977 >>2

# పెట్టుబడులే లక్ష్యం

## నేటి నుంచి ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు సింగపూర్‌లో పర్యటన

### సీఎం వెంట మంత్రులు లోకేష్, టిజి భరత్, నారాయణ

### భారత హైకమిషనర్ సహా సింగపూర్ పారిశ్రామిక ప్రతినిధులతో భేటీ



**విజయవాడ,జూలై 26,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడం, బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ప్రమోషన్ లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్‌లో పర్యటించనున్నారు. శనివారంరాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు ప్రయాణమవుతున్న సీఎం జూలై 27 ఉదయం 6:25కి సింగపూర్ చాంఘీ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుంటారు. ఐదు రోజుల పాటు సింగపూర్‌లో ఆ దేశానికి చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. అలాగే వివిధ ప్రాంతాలను సందర్శించనున్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, నారాయణ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు కూడా సింగపూర్‌లో పర్యటించనున్నారు. 27వ తేదీ ఉదయం 6 గంటలకు సింగపూర్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్న సిఎం చంద్రబాబు బృందం పర్యటనలో తొలి రోజు మధ్యాహ్నం 2:00 గంటలకు ఓవిస్ ఆడిటోరియంలో జరిగే తెలుగు దయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సమావేశానికి సింగపూర్‌తోపాటు మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి తెలుగు పారిశ్రామిక వేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, పెట్టుబడుదారులు, ఉద్యోగులు హాజరవుతారు. ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు దయాస్పోరాకు దాదాపు 1,500 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిరుద్యోగ యువతకు భారత్‌తో పాటు వివిధ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులను ఏపీ అభివృద్ధిలో భాగస్వామ్యం వహించేలా చేయటం , ఏపీ నుంచి ఎగుమతులు పెంచడానికి ఎన్నారైల ద్వారా అవసరమైన ప్రణాళికలు అమలు, నైపుణ్యాభివృద్ధి కల్పన ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన వంటి అంశాలపై తెలుగు దయాస్పోరా సమావేశం దృష్టి సారించనుంది. అలాగే తెలుగు దయాస్పోరా వేదిక నుంచి జీరో పావర్టీ మిషన్‌లో భాగమైన పి4 కార్యక్రమంలో భాగ స్వాములు కావాలని తెలుగు పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలను సీఎం చంద్రబాబు కోరనున్నారు.

సింగపూర్‌కు చేరుకున్న అనంతరం తొలిగంట నుంచే ముఖ్యమంత్రి వివిధ పారిశ్రామిక వేత్తలు, సింగపూర్‌లో భారత హై కమిషనర్‌లతో వరుసగా భేటీ కానున్నారు. విమానాశ్రయం నుంచి బస చేసే హోటల్ కు చేరుకున్న అనంతరం ముఖ్యమంత్రి సింగపూర్ లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో భేటీ కానున్నారు. అనంతరం 11:30 గంటలకు సింగపూర్ లోని ప్రముఖ సంస్థ సుర్బనా జురాంగ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. మద్యాహ్నం 12.30గంటలకు ఎవర్‌సెండాయ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ తన్ శ్రీడాటో ఏ.కె.నాథన్‌తో పెట్టుబడుల అంశంపై చర్చించనున్నారు. సాయంత్రం భారత హైకమిషనర్ నివాసంలో విందు సమావేశానికి ముఖ్యమంత్రి పాల్గొనున్నారు.

**పోర్టులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అధ్యయనం**

పర్యటనలో రెండో రోజు జూలై 28 తేదీన సింగపూర్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో సుస్థిరాభివృద్ధి ప్రణాళికలపై అధ్యయనం కోసం సింగూర్ లోని బిడదారి ఎస్టేట్ ను ముఖ్యమంత్రి బృందం సందర్శించనుంది. సస్టైనలబుల్ అర్బన్ డెవలప్మెంట్ పై నిర్వహించే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులోనూ సీఎం బృందం పాల్గోనుంది. యువతకు క్రీడలపై ఆసక్తి కలిగించేలా సింగపూర్ నిర్మించిన స్పోర్ట్స్ స్కూల్‌ను కూడా ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు సందర్శించనున్నారు. పోర్ట్ ఆధారిత పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పోర్టు ఆధారిత ఎకో సిస్టం తదితర అంశాలను కూడా పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు బృందం టువాస్ పోర్టులో పర్యటించనుంది. పెట్టుబడిదారులతో నెట్‌వర్కింగ్ కోసం ఆంధ్రప్రదేశ్ సింగపూర్ బిజినెస్ ఫోరం నిర్వహించే రోడ్‌షో కార్యక్రమంలోనూ ముమ్యంత్రి పాల్గొంటారు.

**సింగపూర్ బిజినెస్ లీడర్లతో భేటీలు**

ముఖ్యమంత్రి బృందం జూలై 29 తేదీన ఏఐ సింగపూర్, ఎస్ఐఏ ఇంజనీరింగ్, కేప్పెల్ , జీఐసీ లాంటి ప్రముఖ సంస్థలతో వరుసగా భేటీ కానుంది. ఐటీ, ఫిన్ టెక్ బిజినెస్ రౌండ టేబుల్ లో 10కి పైగా అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమై చర్చలు జరుపనున్నారు. అనంతరం సింగపూర్ దేశ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నంతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ కానున్నారు. అలాగే సింగపూర్ మాజీ ప్రధాన మంత్రి >>2

## పలువురు మావోయిస్టుల లొంగుబాటు

### ఉపశమనంగా ఒక్కొక్కరికి రూ.20,000ల చొప్పున చెక్కులు పంపిణి



శనివారం లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** ఇద్దరు మావోయిస్టు అగ్ర దంపతులు,వారితో పాటు పలువురు ఏపీ డీజీపీ ఎదుట శనివారం లొంగిపోయారు. మావోయిస్ట్ పార్టీలో సుమారు 34 సంవత్సరాలకు పైగా పనిచేసిన సీనియర్ మావోయిస్టులు జోరిగె నాగరాజు అలియాస్ కమలేశ్, ఆయన భార్య మేడక జ్యోతీశ్వరి అలియాస్ అరుణ ఏపీ పోలీసుల ఎదుట లొంగిపోయారు. కమలేశ్, ప్రస్తుతం తూర్పు బస్తర్ డివిజనల్ కమిటీకి ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఎస్‌జెడ్‌సీఎం హోదాలో ఉన్నారు. చత్తీస్‌గఢ్‌లో పలు ఆపరేషన్లలో వీరు కీలకంగా వ్యవహారించారు. మావోయిస్టు పార్టీ వైఫ ల్యాలు, కేంద్ర కమిటీ విధానాలపై విసుగు చెంది, ఈ సిద్ధాంతం ఇక చెలామణి అవ్వదని గ్రహించి లొంగిపోయినట్లు మావోయిస్టులు చెప్పారు. కమలేష్‌పై ఆంధ్రప్రదేశ్‌లో రూ.20 లక్షల రివార్డు, అరుణపై రూ.5 లక్షల రివార్డు ఉంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మీడియాతో మాట్లాడారు. లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు తక్షణ ఉపశమనంగా ఒక్కొక్కరికి రూ.20,000 చొప్పున చెక్కులను అందచేశామని తెలిపారు. అల్లురి సీతా రామరాజు జిల్లాలో ఆపరేషన్ బృందాలు మావోయిస్టుల ఆయుధాలు, డంప్ స్వాధీనం చేసుకుందని చెప్పుకొచ్చారు. వీటిలో మొత్తం 18 ఆయుధాలు ఉన్నాయని.1 ఎకె47, 2 బిజిఎల్ 5ఎస్ఎల్ఆర్‌లు., 2 ఐఎన్ఎస్: రైఫిళ్లు, 606 లైవ్ రౌండ్లు, 37 కిలోల కార్డెక్స్ వైర్లు, ఇతర పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. ఖచ్చితమైన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇటీవల ప్రజల్లో బాగా చైతన్యం వచ్చిందని పోలీసు బలగాలు ఎప్పటికప్పుడు జాయింట్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. ఏపీ పోలీసులు ఫీల్డ్ లెవల్లో బాగా పనిచేసి మంచి ఫలితాలు చూపించారని చెప్పుకొచ్చారు. వయలెన్స్ పోతేనే ఎక్కడైనా అభివృద్ధి సాధ్యమవుతుందని అందుకే వీటిపై ప్రధానంగా దృష్టి పెట్టామని ఉద్ఘాటించారు. గతంలో లొంగిపోయిన మావోయిస్టులకి కూడా నేడు రివార్డులు అందజేస్తున్నామని ప్రకటించారు. మావోయిస్టులు పునరాలోచన చేయాలని సూచించారు ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా. హింసాత్మక ఘటనలతో సాధించేదేమీ లేదని స్పష్టం చేశారు. ఏపీ ఇప్పుడు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉద్ఘాటించారు. మావోయిస్టులు మీ కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని సూచించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తే ఉపాధిఅవకాశాలు కల్పిస్తామని తెలిపారు. >>2

## పర్యాటకులకు మాస్టర్ కార్డ్‌లు

**విజయవాడ, జూలై 21,ప్రభాతవార్త ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్‌లో పలు సందర్శనీయ ప్రాంతాలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ ఖాతాదారులను (కార్డ్ హోల్డర్లు) తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాస్టర్ కార్డ్ ప్రతినిధులు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలితో సమావేశమయ్యారు. ఏపీలో ప్రసిద్ధ సందర్శనీయ స్థలాలు, వాటిలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, కొత్తగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతాల గురించి ఎండీ ఆమ్రపాలి మాస్టర్ కార్డ్ ప్రతినిధులకు వివరించారు. ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో సందర్శకులకు అందుబాటులో ఉన్న వసతులపైనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న స్టార్ హోటళ్లు, నిర్మాణంలో ఉన్నవి,నూతనంగా వాటి ఏర్పాటుకు సర్కార్ అందిస్తున్న సహకారం తదితర విషయాలను తెలియజేశారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రిసార్ట్‌లు, హోటళ్లు, సందర్శనీయ ప్రాంతాల గురించి ఆమ్రపాలి వారికి తెలిపారు. వీటిపట్ల మాస్టర్ కార్డ్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు పేర్కొన్నారు. ఖాతాదారులను ఏపీకి తీసుకొచ్చేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేస్తామని వారు వివరించారు. >>2



శనివారం గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అశోక్ గజపతిరాజు

## గోవా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్ గజపతిరాజు

### ప్రమాణ స్వీకారం చేయించిన బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

**విజయవాడ,జూలై 26,ప్రభాతవార్తప్రతినిధి:** గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణం చేశారు. ఏపీకి చెందిన అశోక్ గజపతిరాజును ఇటీవల రాష్ట్రపతి గోవా గవర్నర్ నియమించారు. బోంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే శనివారం ఉదయం అశోక్ గజపతిరాజుతో ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్ బంగ్లా దర్బార్ హాలులో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మంత్రి వర్గ సభ్యులు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపి మంత్రులు నారా లోకేష్,సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు గోవా గవర్నర్ ప్రమాణ స్వీకారానికి హాజరై అశోక్‌గజపతిరాజుకు అభినందనలు తెలిపారు.

గవర్నర్ పదవికి వన్నె తీసుకుని రావాలని ఆకాంక్షించారు. ఎంపీగా,కేంద్రమంత్రిగా అశోక్ గజపతిరాజు గతంలో పనిచేసారు. రాచకుటుంబానికి చెందినప్పటికి ఆయన అత్యంత సాదాసీదాగా ఉండేవారు. ఆయనను టీడీపీ కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్ పదవికి సిఫార్సు చేసింది.

## కర్నూలు సర్వజనాసుపత్రిలో రూ.14 కోట్లతో విశ్రాంతి భవనం

### మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు సర్వజనాసుపత్రిలో(జిజిహెచ్) ప్రతి రోజూ అధిక స్థాయిలో చికిత్సల కోసం ఇన్‌పేషెంట్లుగా చేరే రోగుల సహాయకుల అవసరాల నిమిత్తం రూ.14.15 కోట్ల ఖర్చుతో అన్ని సౌకర్యాలతో కూడిన విశ్రాంతి భవనాన్ని నిర్మించనున్నారు. ఈ వ్యయం మొత్తాన్ని భరించడానికి సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేసే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(పిజిసిఐ) ముందుకొచ్చింది. ఈ మేరకు వచ్చిన ప్రతిపాదనను సమగ్ర పరిశీలనానంతరం వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. విశ్రామ్ సదన్‌ఖీ పేరుతో నిర్మితమయ్యే ఈ భవనంలో రోగుల సహాయకుల కోసం మొత్తం 150 పడకలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఆఫీసు కార్యాలయం, రిక్రియేషన్ వసతులు, పంప్ హౌస్, ఓవర్ హెడ్ నీటి ట్యాంకు, జనరేటర్, సోలార్ రూఫ్‌టాప్‌లు ఉంటాయి. నిర్మాణం పూర్తయిన వెంటనే ఈ విశ్రాంతి భవనాన్ని నిర్వహణ నిమిత్తం పిజిసిఐ కర్నూలు సర్వజనాసుపత్రికి బదలాయిస్తుంది. ఎటువంటి లాభాపేక్ష లేకుండా వినియోగదారుల నుంచి స్వల్ప రుసుం వసూలు చేసి భవనాన్ని నిర్వహించడానికి జిల్లా కలెక్టర్ ఎంపిక చేసిన స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తారు. కర్నూలు సర్వజనాసుపత్రిలో రోగుల సహాయకుల కోసం సరైన వసతుల్లేని మూడు షెడ్లున్నాయి. సరైన భద్రత, పారిశుధ్యం లోపించడంతో పలు ఫిర్యాదులొస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సియస్ ఆర్) కింద ఒక ఎకరం స్థలంలో విశ్రాంతి భవనాన్ని నిర్మించడానికి ముందుకొచ్చిన పిజిసిఐను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ రోగులకు వసతి కేటాయించడానికి తగు ప్రాధాన్యతలు, లాభాపేక్ష >>2



## చౌటుప్పల్‌లో రోడ్డు ప్రమాదం ఇద్దరు డిఎస్పీలు మృతి

### అడిషనల్ ఎస్పీకి గాయాలు

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ఇద్దరు డీస్పీలు దుర్మరణం పాలయ్యారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురంవద్ద స్కార్పియో వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం పక్క రోడ్డుపై పడగా వేగంగా వచ్చి ఓ లారీ స్కార్పియోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు డీఎస్పీలు చక్రధర్‌రావు, శాంతారావు ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్‌కు చెందిన పోలీసులుగా గుర్తించారు. ఈ ఘటనలో ఏఎస్పీ దుర్గాప్రసాద్‌కు గాయాలయ్యాయి. అదేవిధంగా డ్రైవింగ్ చేస్తున్న కానిస్టేబుల్ నర్సింగరావు తీవ్రంగా గాయపడటంతో ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. >>2

## తీరం దాటిన వాయుగుండం

# మరో 4 రోజులు భారీ వర్షాలు

### ఉధృతమవుతున్న గోదావరి, పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



శనివారం ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి



విజయవాడ కెఎస్ రహదారిలో వర్షం దృశ్యం

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. ఇది పశ్చిమ వాయవ్యదిశగా పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు కదులుతున్న నేపథ్యంలో రాష్ట్రంపై దీని ప్రభావం లేనట్లేనని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. వాయుగుండం శనివారం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ గంగా పరీవాహక పశ్చిమబెంగాల్, ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్ వైపు కదలనుంది. శనివారం మధ్యాహ్నం వరకు వాయుగుండం తీవ్రత కొనసాగి, తర్వాత బలహీనపడే అవకాశముంది. రాష్ట్రంలో ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్లు అమరావతివాతావరణ కేంద్రం పేర్కొంది.వచ్చే మంగళవారం వరకు మత్స్య >>2



శనివారం డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు

# పలువురు మావోయిస్టుల లొంగుబాటు

>> ఆంధ్రప్రదేశ్‌లో ఈ మధ్య కాలంలో ఐదుసార్లు ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ఈ ఆపరేషన్లలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందగా, వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు ఉదయ్, ఏపీ మావోయిస్టు కమిటీ సభ్యులు అరుణ, జగన్, డివిజనల్ మావోయిస్టు కమిటీ కార్యదర్శి రమేశ్ ఉన్నారని గుర్తుచేశారు. అలాగే వీరి నుంచి 8 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. యుజికేడర్‌లో ఇప్పటివరకు నలభై ఏడుమంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పుకొచ్చారు. విధుల్లో అద్భుత ఫలితాలు సాధించిన పోలీసు అధికారులకు అభినందనలు తెలిపారు. యుజి కేడర్‌లో పనిచేస్తున్న మావోయిస్టులు అందరూ లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. సరెండర్ పాలసీ ప్రకారం మావోయిస్టుల లొంగుబాటుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సహకరిస్తోందని అన్నారు. మావోయిస్టులపై ఉన్న రివార్డ్‌తో పాటు, ఇంటి స్థలం, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఇరవై మంది ఏపీ వారు ఉన్నారని గుర్తుచేశారు. అందులో అయిదు మంది ఎస్‌జెడ్‌సీఎం హోదాలో ఉన్నట్లు తమకు సమాచారం ఉందని చెప్పారు. మావోయిస్టులు తమకు లొంగిపోకుండా సోషల్ ప్రాబ్లమ్ అని ఇంకా చెప్పడమనేది సరికాదని ఏపీలో ఎక్కడా ఇప్పుడు మావోయిస్టులు లేరని తెలిపారు. ఏపీ అభివృద్ధిలో మావోయిస్టులు భాగస్వామ్యం కావాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా విజ్ఞప్తి చేశారు.

## అత్యంత విశ్వసనీయ గ్లోబల్ లీడర్‌గా ప్రధాని మోడీ

>>వరకు 4,077రోజులు ప్రధానిగా ఉన్నారు. అయితే దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదట ఆ రికార్డు సాధించారు. వరసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీలకు విజయాన్ని అందించిన ఘనత నెహ్రూ, మోదీలకు దక్కుతుంది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దీర్ఘకాలం కొనసాగిన ఖ్యాతి మోదీకే చెందుతుంది.

# మరో 4 రోజులు భారీ వర్షాలు

>>కారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. భారీ వర్షాలు, వరదలు వచ్చే ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని హోం, విపత్తు నిర్వహణశాఖల మంత్రి వంగలపూడి అనిత అధికారులకు సూచించారు. ఉత్తర కోస్తా పరిధిలోని పోర్టులకు మూడో ప్రమాద హెచ్చరిక, దక్షిణ కోస్తా పోర్టులకు ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తీరం వెంట 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని మత్యకారులు ఎవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు. శనివారం ఉత్తరాంధ్రలో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి వానలు పడతాయని వాతావరణ విభాగం అంచనా వేసింది. అల్పపీడనం ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, పల్నాడు, కాకినాడ, కృష్ణా తదితర జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే సూచన ఉంది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ... ఈ వాయుగుండం మరికొద్ది గంటలపాటు ఉత్తర భారతదేశంపై కొనసాగుతూ బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. ఇక, ఈ వాయుగుండం ప్రభావంతో నేడు ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. మరి కొన్ని జిల్లాల్లో ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. అయితే, గంటకు 50 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం కారణంగా పోర్ట్ అధికారులు 3వ నెంబర్ ప్రమాద హెచ్చరికలను కొనసాగిస్తున్నారు. ఉత్తర కోస్తాలోని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. వాయుగుండం ఉత్తర ఒడిశా దిశగా రానున్నందున శుక్రవారం రాత్రి ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాను అనుసరించే శనివారం ఉత్తర కోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుసాయి. ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 4050కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, వాయుగుండం తూర్పు భారతం మీదుగా వాయవ్య భారతం వైపు పయనించి బలహీనపడిన తరువాత వచ్చే వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలడం, వాయుగుండం ప్రభావంతో శుక్రవారం కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అల్లూరి జిల్లా ముంచింగిపట్టులో గరిష్ఠంగా 46 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాల్లో 10 మి.మీ. కన్నా ఎక్కువ వాన పడింది. శ్రీకాకుళం నుంచి పల్నాడు జిల్లా వరకు ముసురు వాతావరణం నెలకొంది. ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 17 జిల్లాల్లో వర్షపాతం మెరుగైంది. రాయలసీమలో మాత్రం వాన లోటు కొనసాగుతోంది. ప్రస్తుత వర్షాలతో కోస్తాంధ్రలో వరి నాట్లు, పత్తి, అపరాల పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వేసిన ఖరీఫ్ పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులు చెబుతున్నారు.

గోదావరి వరద క్రమంగా పెరుగుతుండటంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పరీవాహక గ్రామాల్లో మళ్లీ అలజడి మొదలయింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 10.9 అడుగులు ఉంది. 2,46,347 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచిపెట్టారు. వరద ప్రభావిత ప్రాంతాలైన బొబ్బర్లంక, పిచ్చుకలంక, వాడపల్లి లంకల్లోని నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మండల అధికారులకు ఉన్నతాధికారులు సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పోశమ్మగండి వద్ద నిన్నటి ఉదయం నుంచి సాయంత్రానికి గోదావరిలో రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. దర్శనాలను నిలిపివేశారు. గోదావరిలో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద శుక్రవారం సాయంత్రానికి నీటి మట్టం 28.80 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల ద్వారా 3 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్లింది. గత 46 రోజులుగా గోదావరి నుంచి సముద్రంలోకి 430 టీఎంసీలు వెళ్లినట్లు జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మరో రెండు రోజుల పాటు వరద పెరగడంతో పాటు 4.50 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,18,025 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లును 10 అడుగుల మేర ఎత్తి స్పిల్ వే ద్వారా 53,856 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 66,331 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో ఆ ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడనున్నట్లు హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. ఇకా వర్షాలకు వాగులు,వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇక ఎగువ ప్రాంతాల కురుస్తున్న వర్షాలకు మున్నేరు,పాలేరు,వైరా,కట్టలేరు,కీసర ఏర్లు పొంగుతున్నాయి.ఈ వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతుంది.దాంతో బ్యారేజీ అన్ని గేట్లు కొంత మేరకు పైకి ఎత్తి నీరు వదులుతున్నారు. ఇబ్రహింపట్టణ సంగమ స్థలి వద్దకు ప్రజలను అనుమతించడం లేదు.భవానిపురంకు బోట్ ట్రావెలింగ్ ఆపేసారు.

### అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత

వాయుగుండం, భారీ వర్షాలపై శుక్రవారం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి అనిత వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఫ్లాష్ ఫ్లడ్స్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏపీ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి వాయుగుండం ప్రభావ పరిస్థితిని మంత్రి సమీక్షించారు. సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, అధికారులతో మాట్లాడారు. కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాద హాట్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకుని, చెరువులు, కాలువలు, రోడ్లకు పడిన గండ్లను గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

గోదావరికి వరద పోటు ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాలకు రెండు రోజులుగా గోదావరి నీటిమట్టం మళ్లీ క్రమక్రమంగా పెరగడం ప్రారంభించింది. ఉప నదులు శబరి, సీలేరు, మంజీర, పర్ణ, ఇంద్రావతి, కొండవాగుల జలాలు కలవడంతో శుక్రవారానికి నీటిమట్టం మరింత పెరిగింది. ప్రాజెక్టులోకి వస్తున్న 2,51,411 క్యూసెక్కుల జలాలను జల వనరుల శాఖ అధికారులు స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ఎగువన 28.440 మీటర్లు, దిగువన 18.680 మీటర్లు నమోదైనట్టు తెలిపారు. ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 25.80 అడుగులకు చేరుకోవడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. కాటన్ బ్యారేజ్ ద్వారా 2,46,347 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద సుమారు 4లక్షల క్యూసెక్కుల వరద రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పెట్టుబడులే లక్ష్యం

>> లీ హ్సియన్ లూంగ్‌తో సమావేశం అవుతారు. సింగపూర్ లోని జురాంగ్ పెట్రోకెమికల్ ఐలాండ్ సందర్శించి పారిశ్రామిక అభివృద్ధి మోడల్‌పై అధ్యయనం చేస్తారు. అలాగే సింగపూర్ లోని ప్రముఖ కంపెనీల సీఈఓల రౌండ్ టేబుల్ సమావేశంలో పోర్టులు, మౌలిక సదుపాయాలపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు.

**రాష్ట్రంలో పెట్టుబడుల కోసం చర్చలు, సమావేశాలు:** నాలుగో రోజు పర్యటనలో భాగంగా జూలై 30 తేదీన సీఎం కేపిటా ల్యాండ్, సుమితోమో మిట్సుయి బ్యాంక్, టెమసెక్ సంస్థలతో సీఎం సమావేశం అవుతారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సీఎం భేటీ కానున్నారు. జూలై 31 తేదీ సింగపూర్ హోం మంత్రి కే.షణ్ముగంతో పాటు స్థానిక ప్రతినిధులతో సమావేశం కానున్న సీఎం అదే రోజు రాత్రి హైదరాబాద్ కు తిరుగు ప్రయాణం అవుతారు.

**ఐదు రోజుల పర్యటన...29 కార్యక్రమాలు**

ఐదు రోజుల సింగపూర్ పర్యటనలో సీఎం చంద్రబాబు మొత్తం 29 కార్యక్రమాలకు హాజరు కానున్నారు. అందులో 6 ప్రభుత్వ భేటీలు, 14 వన్‌టువన్ సమావేశాలు. 4 సందర్శనలు, 3 రౌండ్ టేబుల్ సమావేశాలు, 2 డయాస్పోరా, రోడ్‌షో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా ఐటీ, పరిశ్రమలు, అర్బన్ డెవలప్‌మెంట్, క్రీడలు, నౌకాశ్రయాలు, ఫిన్‌టెక్ రంగాల్లో అనేక అంతర్జాతీయ భాగస్వామ్య అవకాశాలపై ముఖ్యమంత్రి చర్చలు జరుపుతారు. ఈ పర్యటన రాష్ట్రానికి అంతర్జాతీయ పెట్టుబడుల రాకకు గేట్‌వేగా నిలవనుంది. క్రీడారంగం అభివృద్ధి, పోర్ట్ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ముందడుగు పడనుంది.

# పర్యాటకులకు మాస్టర్ కార్డులు

>> ముఖ్యమంత్రి చంద్రబాబు గతేడాది దావోస్ పర్యటన సందర్భంగా మాస్టర్ కార్డ్ ప్రతినిధులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్ లోనూ కార్యకలాపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు గత నెల 27న మాస్టర్ కార్డ్ సంస్థ డైరెక్టర్ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఇప్పుడు ఆ సంస్థ ప్రతినిధులను రాష్ట్రానికి పంపారని రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు. రాష్ట్రంలోపర్యాటకం అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది ఇందులో భాగంగా పర్యాటక వనరులైన కొండ ప్రాంతాలు, నదీతీరాలు, సముద్ర తీరాలు, అటవీప్రాంతం, ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, కాలువలు, పురాతనమైన కట్టడాలు, సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి వింతలున్న ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. సందర్శకులను ఆకర్షించడమే లక్ష్యంగా వాటిని తీర్చిదిద్దుతోంది. అదేవిధంగా స్థానికులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతోంది. దీంతో ప్రధాన నగరాల్లో రిసార్ట్‌లు, హోటళ్ల ఏర్పాటుకు పలు ప్రైవేట్ సంస్థలు ముందుకొచ్చాయి. కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించి ఆకర్షణీయమైన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఈ క్రమంలో అనేక సంస్థలు ఏపీకి క్యూ కడుతున్నాయి. అదేవిధంగా తీర ప్రాంతం రాబోయే రోజుల్లో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనుంది. విశాఖనుంచి ఇతర ప్రాంతాలకు పర్యాటక నౌకల ఏర్పాటుకు పలు సంస్థలు ఇప్పటికే అంగీకారం తెలిపాయి. జల క్రీడలు, అడ్వెంచర్ క్రీడలకు సంబంధించి పలువురు పెట్టుబడులు పెట్టనున్నారు. మొదటిసారి కార్వాన్ ప్రవేశపెడుతున్నారు. పర్యాటకులకు వసతితోపాటు పలు సందర్శనీయ ప్రాంతాలకు తీసుకెళ్లేలా కార్వాన్‌లు తీసుకొస్తున్నారు. హోం స్టేకు సంబంధించి సైతం పలు ఒప్పందాలు కుదిరాయి. ఈ క్రమంలోనే తాజాగా ఎలక్ట్రానిక్ చెల్లింపుల్లో పేరొందిన ప్రపంచ టెక్నాలజీ సంస్థ మాస్టర్ కార్డ్ ఏపీలోని పర్యాటక ప్రాంతాలపై ఫోకస్ పెట్టింది. చెల్లింపుల్లో బ్యాంకులు, వ్యాపారులు, ఖాతాదారుల మధ్య ఫెసిలిటేటర్‌గా ఈ సంస్థ వ్యవహరిస్తుంది.

# ఇద్దరు డిఎస్పీలు మృతి

>> ఖైరతాబాద్‌లోని ఇంటెలిజెన్స్ కార్యాలయంలో టెస్ట్‌కు హాజరయ్యేందుకు వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. తర్ఫీదులో భాగంగా తరచూ పర్ఫార్మెన్స్ టెస్టుల్లో డీఎస్పీలు పాల్గొంటున్నారు. వీరి దుర్మరణం తనకు దిగ్భ్రాంతి కలిగించిందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా దుర్ఘటన తనను కలిచి వేసిందన్నారు.వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డిఎస్పీల మృతి భాధాకరమని మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు తమ,తమ ప్రకటనల్లో పేర్కొన్నారు.

# రూ.14 కోట్లతో విశ్రాంతి భవనం

>> లేకుండా రుసుం నిర్ణయం, వసతి కాలపరిమితి, ఈ సౌకర్యాన్ని దుర్వినియోగం కాకుండా నివారించడం, రుసుం వసూలు మరియు జమ చేయడం, నిర్వహణ సంస్థ ఎంపికలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలను రూపొందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. కర్నూలు సర్వజనాసుపత్రిలో ఇన్‌పేషెంట్ల కోసం 1700 పడకలున్నాయి. ఇందులో 150 క్యాన్సర్ పేషెంట్ల కోసం కేటాయించారు. సగటున ప్రతి రోజూ 90 శాతానికి పైగా రోగులతో నిండుతున్నాయని, ఈ నేపథ్యంలో రోగుల సహాయకుల అవసరాల కోసం అన్ని వసతులతో కూడిన విశ్రాంతి భవనం అవసరముందని సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు తాము పంపిన ప్రతిపాదనను శీఘ్రమే ఆమోదించినందుకు మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# అలిపిరి-జూపార్కు బైపాస్ చిరుతల భయం

## వాహనదారులపై దాడి


**తిరుపతి,జూలై 26ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంలో దారితప్పిన చిరుతపులులు తిరుపతి అలిపిరి-ఎస్వీజూపార్కు ప్రధానరహదారిపై మాటువేసి వాహనదారులపై దాడిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మార్గం అటవీప్రాంతానికి ఆనుకునే ఉండటం,చిరుతలకు అనువైన వాతావరణం ఉన్నట్లు అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. దీంతో శేషాచలం అడవినుండి జనావాసంలోకి వస్తున్న చిరుతలకు ఆహారం కూడా లభిస్తుండటంతో కుక్కలు ఆ ప్రాంతంలో ఎక్కువగా ఉండటంతో ఇటుగా వచ్చేస్తున్నట్లు సిసికెమెరాల పరిశీలనలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి అలిపిరి రోడ్డులో వెళుతున్న ఓ ద్విచక్రవాహనదారుడిపై దాడికి ప్రయత్నించింది. ద్విచక్రవాహనం వెనుకనే ఆ సమయంలో వచ్చిన కారు డ్యాష్‌కెమెరాలో ఈ ఘటన రికార్డయింది. అయితే అదృష్టవశాత్తు దేవుని దయతో ద్విచక్రవాహనదారుడు వేగంగా వెళ్ళడంతో తప్పించుకోవడంతో ప్రాణాలు మిగిలాయి. అలిపిరి మార్గంలో గతంలో టిటిడి ఉద్యోగి రవికుమార్ విదులు ముగించుకుని ఇంటికివెళుతున్న సమయంలో చిరుతపులి దాడిచేయడం, తీవ్రంగా గాయాలతో పరుగులుతీయడంతో తప్పించుకున్నాడు. ఇలా అలిపిరి మార్గం చిరుతల సంచారంతో వాహనదారులకు భయం పట్టుకుంది. శుక్రవారం రాత్రి ఘటనతో అటవీశాఖ సిబ్బంది, జూపార్కు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ మార్గంలో సాయంత్రం తరువాత ప్రయాణించే ప్రయాణీకులకు, వాహనదారులకు రక్షణ చర్యలు చేపట్టేందుకు సిద్దమయ్యారు. గతంలో చిరుత సంచరించిన ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎస్వీ జూపార్కు మార్గంలో అరవింద్ కంటి ఆస్పత్రి, సైన్స్ సెంటర్, టాటా క్యాన్సర్ ఆస్పత్రి, హోటళ్ళు ఉండటంతో ఇక్కడకు వచ్చే యాత్రికులు,రోగులు ఆహారం వంటివాటిని పడేస్తుండటంతో చిరుతలు వస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అలిపిరి-జూపార్కు మార్గంలో రాత్రి సమయంలో ద్విచక్రవాహనాలను నిషేధించాలని నిర్ణయించారు. ఇటీవల చిరుతలు తిరుమల ఘాట్‌రోడ్లపై,కాలినడక మార్గాల్లోనూ సంచరించి భక్తులను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

ఇప్పుడు, అప్పుడు కాదు. తరచుగా తిరుమల కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో భక్తులపై చిరుతపులులు దాడులు చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఏడాదికేడాది చిరుతల సంఖ్య పెరుగుతోంది. దీనికితగ్గట్లు ఇటీవల వర్షాలు కూడా కురిశాయి. ఆహారం కోసం అడవిలో దారితప్పి నడకమార్గాల్లో, ఘాట్‌రోడ్లపై ,ఇలా జనవాసాల్లోకి వస్తుంటాయని, ఆ సమయంలో మనుషులు గుంపుగా ఉంటే ప్రమాదం లేదని, అక్కడక్కడా ఇద్దరు ముగ్గురు వస్తుంటే దాడిచేస్తున్నాయనేది అటవీశాఖ వర్గాల సమాచారం. అటవీప్రాంతానికి, నడకమార్గానికి ఆనుకునే ఉండటంతో చిరుతలు సంచారం ఉంది. అలిపిరి నుండి అరవింద్ కంటి ఆస్పత్రి, చెర్లోపల్లి, పేరూరు,పుదిపట్ల,రిక్షాకాలనీ గ్రామాల ప్రజలు తిరుపతి నుండి ఈ మార్గంలోనే సులభంగా వెళుతుంటారు. అంతేగాక సాయంత్రం వేళల్లో యువతీయువకులు కూడా సంచారం ఉంటుంది. ఈ ప్రాంతాల్లో భక్తుల రక్షణకు చర్యలు తీసుకుంటే తప్ప చిరుతల ప్రమాదంనుంచి భద్రత కల్పించలేరనేది ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## దిగజారిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి: మాజీ సిఎం జగన్



**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:**2025-26 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దిగజారిందని గణాంకాలతో సహా వైసిపి అధినేత వైఎస్.జగన్ పేర్కొన్నారు. శనివారం ఎక్స్ వేదికగా జగన్ పోస్టు పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి పాలనలో దిగజారిన ఆర్థిక పరిస్థితిపై జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. కాగ్ విడుదల చేసిన మంత్లీ కీ ఇండికేటర్ ప్రకారం .. రాష్ట్ర ఆర్థిక స్థిరత్వం ప్రమాదంలో ఉందని వైఎస్ జగన్ అభిప్రాయపడ్డారు. ఆ నివేదికలో.. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులు (పన్నులు, పన్నేతర ఆదాయాలు) అత్యంత మందగమనం చూపించాయని అన్నారు. జీఎస్‌టీ, సేల్స్ టాక్స్ ఆదాయాలు గత సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే తక్కువగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర స్వంత ఆదాయ వృద్ధి కేవలం 3.47 శాతం మాత్రమే ఉండగా, మొత్తం ఆదాయ రసీదులు 6.14 శాతం వఅద్ధి చూపించాయి. అదే సమయంలో అప్పుల వృద్ధి మాత్రం 15.61 శాతంగా నమోదైంది. ఇది ఆర్థిక ఒత్తిడికి సంకేతం అని జగన్ అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఖర్చులు, సొంత ఆదాయాలపై కాకుండా అప్పులపై ఆధారపడుతున్నాయని, ఇది ఆర్థిక స్థిరత్వానికి ప్రమాదకరంగా మారిందని జగన్ పేర్కొన్నారు.



గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్. చిత్రంలో గోవా సిఎం ప్రమోద్ సావంత్

# ఎన్ఆర్ఐ భక్తులకు ఇక విఐపి బ్రేక్ దర్శనాలు

## మూడునెలల ముందు ఆన్‌లైన్‌లో స్లాట్స్‌బుకింగ్

**తిరుమల,జూలై 26ప్రభాతవార్తప్రతినిధి:**అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విదేశాల నుండి కూడా భక్తులు రోజువారీగా తిరుమలకు వస్తున్నారు. ప్రస్తుతం ఎన్ఆర్ఐ కోటాక్రింద సుపథం మార్గంలో 300 రూపాయలు ప్రత్యేకప్రవేశ దర్శనాల టిక్కెట్లు నిబంధనల మేరకు టిటిడి జారీచేస్తోంది. ఈ సదుపాయం దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ఎన్ఆర్ఐలు వినియోగించుకునే అవకాశం కల్పించారు.అయితే ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు తెలుగువారు విదేశాల్లో పలు దేశాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఆ దేవదేవుడి దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. రోజుకు 25విఐపి బ్రేక్ టిక్కెట్లు జారీని 50వరకు ఇచ్చేందుకు భక్తుల రద్దీని బట్టి టిటిడికి వెసలూబాటు ఉంది. ఈ బ్రేక్ దర్శనాల టిక్కెట్లు 100కు పెంచాలని టిటిడికి సూచనలు చేశారు. ఎన్ఆర్ఐలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సహించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పలువురు ఎన్ఆర్ఐలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విఐపి బ్రేక్ దర్శనాలను పొందాలనుకునే ఎన్ఆర్ఐలు ముందుగా "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏపిఆర్‌టిఎస్.ఎపి.జిఒవి.ఇన్"వెబ్‌సైట్‌కి వెళ్ళి ఉచితంగా సభ్యత్వం నమోదు చేసుకోవాలి. నమోదు సమయంలో వారు ఉన్న దేశానికి సంబంధించిన వీసా, వర్క్‌పర్మిట్, నివాసధృవపత్రం, డ్రైవింగ్ లైసెన్స్‌వంటి వివరాలు నమోదు చేయాలి. వెబ్‌సైట్‌లో మూడునెలల బ్రేక్ దర్శన స్లాట్స్ కనిపిస్తాయి. ఇందులో ఎన్ఆర్ఐ భక్తులు తమకు కావాల్సిన తేదీలను బుక్‌చేసుకోవచ్చు. టిక్కెట్లు లభించిన భక్తులకు తిరుమలలోని ఏపిఎన్ఆర్‌టిఎస్ పిఆర్ఓ ద్వారా విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తారు.

# 'ఐ లవ్ యు' చెప్పినా లైంగిక నేరం కాదు..

## ఛత్తీస్‌ఘర్ హైకోర్టు సంచలనతీర్పు

**నయారాయ్‌పూర్,జూలై 26:** యువకుడు ఐ లవ్ యూ చెప్పాడని నిరూపించడానికి ప్రాసిక్యూషన్ వద్ద సాక్ష్యాధారాలు లేవని తెలిపింది. కేసుకు సంబంధించిన అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు యువకుడిని నిర్ధోషిగా ప్రకటించింది. ఈ కేసులో రాష్ట్ర హైకోర్టు చేసిన అప్పీల్‌ను తిరస్కరించింది. ఇటీవలే పోక్సో కేసు విషయంలో బాంబే హైకోర్టు ఇలాంటి తీర్పే ఇచ్చింది. తనకు ఐ లవ్ యూ చెప్పి, లైంగికంగా వేధించాడని ఓ మైనర్ 35 ఏళ్ల వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. తనను ఆటపట్టిస్తూ ఐ లవ్ యూ చెప్పాడని ఆరోపణలు చేసింది. ఘటన జరిగినపుడు బాలిక మైనర్ కావడం వల్ల సదరు వ్యక్తిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్నారు. విచారణ అనంతరం జిల్లా సెషన్స్ కోర్టు అతడిని నిందితుడిగా పరిగణిస్తూ మూడేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. దీనిపై నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. సుదీర్ఘ విచారణ తర్వాత బాంబే హైకోర్టు నాగ్‌పుర్ బెంచ్‌కు చెందిన జస్టిస్ ఊర్మిళా జోషి ఫాల్కే అతడిని నిర్ధోషిగా ప్రకటించారు. ఐ లవ్ యూ చెప్పడంలో లైంగికఉద్దేశం ఉన్నట్లు నిరూపితం కాలేదని పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు వ్యక్తి ఆ అమ్మాయిని తాకాలని గానీ, అసభ్యకరమైన సైగలు చేసి ఆమెను అవమానించట్లు నిరూపణ జరగలేదని వెల్లడించారు. తద్వారా పదేళ్ల న్యాయ పోరాటం తర్వాత ఆ వ్యక్తిని నిర్ధోషిగా ప్రకటిస్తూ బాంబేహైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో అతడికి ఉపశమనం లభించినట్లయింది.

# నాప్రాణాలకు ముప్ప పొంచి ఉంది: తనుశ్రీ దత్తా ఆందోళన

**ముంబయి,జూలై 26:** భారతదేశంలో మీటూ ఉద్యమానికి నాంది పలికిన బాలీవుడ్ నటి తనుశ్రీ దత్తా, గత ఆరేళ్లుగా తన సొంత ఇంట్లోనే వేధింపులకు గురవుతున్నానంటూ చేసిన వ్యాఖ్యలు ఇటీవల వైరల్ అయిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె మాట్లాడుతూ తన ఆరోగ్యం బాగోలేకపోయినా కొన్ని రోజుల నుంచి వరుసగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటూనే ఉన్నానని, తాను అందరితోనూ మాట్లాడతానని, కాకపోతే దానికి సమయం పడుతుందని పేర్కొంది. దయచేసి తనను ప్రశాంతంగా ఉండనివ్వాలని ఆమె విజ్ఞప్తి చేసింది. మరో మీడియాతో మాట్లాడుతూ బాలీవుడ్ మాఫియా ముఠా చాలా పెద్దదని, తనకు ముంబయిలో ప్రాణానికి ముప్పు ఉందని సంచలన వ్యాఖ్యలు చేసింది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాదిరిగానే తన ప్రాణానికి కూడా ప్రమాదం ఉందని, అతని మాదిరిగానే తనను కూడా హత్య చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించింది. ప్రస్తుతం తనుశ్రీ దత్తా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తనుశ్రీ దత్తా 2018లో బాలీవుడ్ నటుడు నానా పటేకర్‌పై 'మీటూ' ఆరోపణలు చేసి దేశంలో ఈ ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచింది. 2008లో హార్న్ ఒకే ప్లీజ్ సినిమా షూటింగ్ సమయంలో నానా పటేకర్ తనను అనుచితంగా స్పృశించారని, కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య, డైరెక్టర్ రాకేష్ సారంగ్, ప్రొడ్యూసర్ సమీ సిద్ధిఖీలు ఈ విషయంలో సహకరించారని ఆమె తీవ్ర ఆరోపణలు చేసింది. అయితే, 2019లో ముంబయి పోలీసులు ఈ ఆరోపణలకు ఆధారాలు లేవని తేల్చి, నానా పటేకర్‌కు క్లీన్ చిట్ ఇచ్చారు. 2025 మార్చిలో ముంబై మేజిస్ట్రేట్ కోర్టు తనుశ్రీ ప్రొటెస్ట్ పిటిషన్‌ను కూడా తిరస్కరించింది. ఆరోపణలు 2008 నాటివి కావడంతో చట్టపరమైన గడువు ముగిసిందని పేర్కొంది.

### ఇటలీలో రోడ్డుపై కూలిన చిన్నవిమానం

ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

**రోమ్,జూలై 26:** ఇటలీలో ఘోర విమానం ప్రమాదం చోటుచేసుకుంది. ఒక చిన్న విమానం హైవేపై కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. బ్రెసికా సిటీ సమీపంలో ఈ ఘటన జరిగింది. చిన్న తరహా అల్ట్రాలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉన్నట్టుండి రోడ్డుపై కుప్పకూలింది. దీంతో విమానం కూలిన తర్వాత భారీగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పైలట్ సహా ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. బహుశా విమానం కంట్రోల్ తప్పి ఉంటుందని, ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేద్దామనుకున్న సమయంలో ఆ ఫ్లైట్ నోస్‌డైవ్ చేసి ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### వారం - వర్జ్యం

27-07-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
తదియ రా.10.48
మఘ సా.4.27
వర్జ్యం : రా.12.51-2.32
దు.సా.4.54-5.46
శుభసమయం : సా.7.30-8.30
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం :** సోదరులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. కోర్టుకేసుల నుండి బయటపడతారు. ఆకస్మిక ప్రయాణాలు.

**వృషభం:** కాంట్రాక్టులు దక్కించుకొంటారు. సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మిథునం:** రాజకీయ, కళారంగాల వారికి యోగదాయకం. ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో ఎదురైన చికాకులు కొంతవరకు తొలగుతాయి. ఉద్యోగులు ఉన్నతహోదాలు పొందుతారు.

**సింహం:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు కలిసి వస్తాయి.

**కన్య :** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సేవకార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట చెందుతారు. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**మకరం:** స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కుంభం:** సంఘంలో గౌరవం పొందుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**మీనం :** తండ్రి ద్వారా ఆస్తిలాభం పొందుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. పలుకుబడి పెరుగుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కో/ల్, హైదరాబాద్

## తృప్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్


తృప్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** పేద మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచి, స్వావలంబన సాధించే దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. శనివారం వన్ టౌన్ పంజా సెంటర్ లో తృప్తి క్యాంటీన్ ను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర హెచ్ఎమ్ లతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు తృప్తి క్యాంటీన్లను ప్రారంభించిందన్నారు. మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 750 క్యాంటీన్లను ప్రారంభిం చనున్నామన్నారు. ఇప్పటికే నెల్లూరులో తృప్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే అది దిగ్విజయంగా రోజుకు రూ. 10,000 15,000 వరకు ఆదాయం ద్వాక్రా మహిళలకు వస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 30 వేల మంది మెప్మా మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు మాకు లక్ష్యాన్ని ఇచ్చారని అందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న ద్వాక్రా మహిళలకు తృప్తి క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను అందిస్తున్నామన్నారు. నెల్లూరులో తొలి క్యాంటీన్ ను మంత్రి నారాయణ ప్రారంభించారు. తక్కువ ధరలకే ప్రజలకు భోజనం అందించడంతో పాటు మహిళలకు ఉపాధి కల్పించడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశమన్నారు. పట్టణ ప్రాంతాల్లో 28 లక్షల ద్వాక్రా మహిళా సంఘాలు ఉన్నాయని వారు ఆర్థికంగా బలోపేతం ఆయ్యేవిధంగా చేయూతను అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వాక్రా మహిళల రూ. 10 లక్షలు కంటే ఎక్కువ ఆదాయం వచ్చేలా చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. ఆ లక్ష్యయ సాధన దిశగా కృషి చేస్తూ, ద్వాక్రా మహిళల జీవనోపాధులు పెంచేలా కృషి చేస్తున్నామన్నారు.నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను తక్కువ ధరలకే ప్రజలకు ఆహారం అందించే లక్ష్యంతో తృప్తి క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. నగరంలో మరికొన్ని చోట్ల కూడా అన్న క్యాంటీన్ల మాదిరిగా తృప్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసి ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. జీఎస్టీ తో కలుపుకుని ప్రాజెక్ట్ వ్యయం రూ. 14,51,400 అవుతుందన్నారు. ఇందులో 75 ద్వాక్రా మహిళలు, 25 సారాస్ ఏజెన్సీ లోన్ ద్వారా సమకూర్చుతారన్నారు. ఆదాయం కూడా అదేవిధంగా పొందుతారన్నారు. నలుగురు మహిళా సభ్యులు ఒక యూనిట్ గా ఏర్పాటు చేసి క్యాంటీన్లను అప్పగిస్తున్నారు. క్యాంటీన్ నిర్వహణ కోసం కంటెయినర్ ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. పరోక్షంగా మరికొందరికి కూడా ఉపాధి లభిస్తుందన్నారు.

## రాష్ట్రంలో వారంలో డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్ ను వారంలోపు విడుదల చేస్తామని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య అసోసియేషన్ నాయకులతో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అసోసియేషన్ నాయకులతో రాష్ట్రసచివాలయంలో గురువారం ఆయన పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశ నిర్ణయాలను అసోసియేషన్ నాయకులు మీడియాకు తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ లో ఎంచుకొన్న కోర్సులకు వెంటనే ఉత్తర్వులు ఇచ్చి అడ్మిషన్ ప్రక్రియ విధానాలలో అఫిలియేషన్ ప్రక్రియ ముగిస్తామన్నారు. జీవో 36 మార్గదర్శకాలు సమీక్ష చేసి రూల్స్ సడలింపు చేస్తామని తెలిపారు. 30 ఏళ్ల రిజిస్టర్ లీజు సబ్మిట్ చేసిన వారికి ఐదేళ్ల గుర్తింపు అమలు చేస్తామని పేర్కొన్నారు. ఫీజులపై సమీక్ష చేస్తామని తెలిపారు. 30శాతం మేనేజ్మెంట్ కోటా విధానంపై విద్యాశాఖ మంత్రి తుదినిర్ణయం తీసుకోవాల్సివుందన్నారు. ఆర్టిఎఫ్ పెండింగ్ ఫీజులను వచ్చే నెల నుంచి విడతల వారీగా ఇస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వి చిరంజీవిరావు, రామ్‌గోపాల్ రెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు విజరుభాస్కర్ రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణజీ, రాజకుమార్ చౌదరి, ఫైనాన్స్ సెక్రటరీ రాజశేఖర్ పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## అలిపిరిలో హోమం టిక్కెట్లు ఇక ఆన్‌లైన్‌లో!

### - ఆగస్ట్ 1 నుండి జారీకి ఏర్పాట్లు



**తిరుమల,జూలై 26ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం సామాన్యభక్తులకు తిరుపతి అలిపిరిలోని సప్తగోప్రదక్షిణ మందిరంలో రోజువారీగా చేపట్టే శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం టిక్కెట్లను ఆఫ్‌లైన్‌లో జారీచేసే ప్రక్రియను ఆన్‌లైన్‌లోకి టిటిడి మార్పుచేసింది. ఈ టిక్కెట్లను రోజుకు 50 ఆఫ్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ ద్వారా ఉదయం 5గంటలకు జారీచేస్తారు. ఇందుకోసం పెద్దసంఖ్యలో భక్తులు వేకువజామున 1గంట నుండి అలిపిరిలో బారులుతీరి నిలబడి నిరీక్షిస్తారు. 1,600 రూపాయలు చెల్లించి ఇద్దరు గృహస్థ భక్తులు ఈహోమంలో పాల్గొంటే వారికి అదేరోజు తిరుమలలో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం క్యూలైన్‌లో స్వామివారి దర్శనం కూడా కల్పిస్తారు. ఈ సౌలభ్యంతో ఈ హోమం టిక్కెట్లు పొందేందుకు సామాన్యభక్తులు సుముఖత చూపుతుంటారు. గత టిటిడి పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఈ విధానం అమలుచేయించారు. దీనికి భక్తుల నుండి విశేషస్పందన ఉంది. రోజువారీగా 200 టిక్కెట్లు జారీచేసి హోమంలో భక్తులకు అవకాశం కల్పిస్తారు. ఈ హోమం టిక్కెట్లకు భక్తుల నుండి పెద్దగా డిమాండ్ రావడంతో 150 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో, 50 టిక్కెట్లుమాత్రం ఆఫ్‌లైన్‌లో జారీచేసేలా చూశారు. ఇప్పుడు అలిపిరి వద్ద ఆఫ్‌లైన్‌లో హోమం టిక్కెట్లకు భక్తులు ఇబ్బందులు పడుతుండటంతో వాటిని కూడా ఆన్‌లైన్‌లోనే జారీచేసేలా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిర్ణయించారు. ఆఫ్‌లైన్ విధానం రద్దుచేసి వాటిని ఆన్‌లైన్‌లో జారీచేస్తారు. ఆగస్ట్ 1వతేదీ నుండి భక్తులకు ఈ హోమం టిక్కెట్లు 200 మొత్తం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జారీచేస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం టిక్కెట్లను ఆగస్ట్ 1నుండి ఆన్‌లైన్‌లో పొందాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉండగా గతంలో శ్రీవారి భక్తుల కోరిక మేరకు అలిపిరి శ్రీవారి పాదాల వద్ద శుభకార్యాలు, విశేషమైన రోజుల్లో స్వామివారి అనుగ్రహం పొందడానికి సంకల్పం చెప్పుకుని యజ్ఞంలో పాల్గొని హోమం నిర్వహించుకునేలా టిటిడి ఏర్పాట్లు చేసింది. ఈ విశేష హోమంలో గృహస్థభక్తులు 1,600 రూపాయలు చెల్లించి పాల్గొన్నవారికి తిరుమలలో 300రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తున్నారు.

## పవన్‌పై కేసు వాపస్ ఆర్డర్ ఇవ్వండి - హైకోర్టు

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై రాష్ట్ర ప్రభుత్వం వేసిన పరువు నష్టం కేసు ఉపసంహరణకు గుంటూరు కోర్టు అనుమతినిస్తూ ఇచ్చిన ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీని సమర్పించాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఆదేశించారు. విచారణను 2 వారాలకు వాయిదా వేశారు. వలంటీర్ల వల్లే ఆడ పిల్లలు మాయమవు తున్నారని పవన్ కల్యాణ్ 2023లో ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో అన్నారని, ఈ వ్యాఖ్యలు ప్రభుత్వ పరువు, ప్రతిష్టకు భంగం చేకూరేలా ఉన్నాయంటూ గతంలోని వైసిపి ప్రభుత్వం క్రిమినల్ కేసు దాఖలు చేయాలని గుంటూరు కోర్టు పిపిని ఆదేశిస్తూ జిఓ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పవన్‌పై ప్రాసిక్యూషన్‌ను ఉప సంహరించుకుంది. ఈ మేరకు పిపి అభ్యర్థనకు గుంటూరు కోర్టు అనుమతినిచ్చింది. ఈ మేరకు నవంబరు 18న వెలువడిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ వలంటీర్ కె సరళ హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.

## మద్యం కుంభకోణంలో సూత్రధారికీ శిక్ష తప్పదు

### మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జులై 26, ప్రభాత వార్త ప్రతినిధి:** వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్ర ధారికీ శిక్ష తప్పదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో శుక్రవారం మీడి యాతో మాట్లాడారు. వైకాపా నాయకులు ప్రజాధనాన్ని దోచుకొని ప్రజారోగ్యంతో ఆటలాడారు.ప్రపంచ చరిత్రలో ఇలాంటి మద్యం కుంభకోణం ఎవ్వరూ చూడలేదు. నాసిరకం మద్యం వల్ల 2020 తర్వాత దీర్ఘకాల కిడ్నీ కేసుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కొత్తగా 91 వేల కేసులు వచ్చాయి. కాలేయం దెబ్బతిన్న కేసులు 14వేల నుంచి 29 వేలకు పెరిగాయి. బ్రెయిన్ స్ట్రోక్ కేసులు 2020లో 380 మాత్రమే ఉంటే...2024 నాటికి ' 7,680కి పెరిగాయి. ఈ పరిస్థితికి మద్యమే ప్రధాన కారణం. గత ప్రభుత్వం తెచ్చిన ఎక్సైజ్ పాలసీలోకి గోవిందప్ప ఎందుకు వచ్చారో... ముడుపులు తీసుకుని ప్యాలెస్‌లో ఎవరికి ఇచ్చారో తేలాలి' అని మంత్రి వ్యాఖ్యానించారు. 'అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ కాదు...ఆక్వా వ్యాలీ' అంటూ వైకాపా నాయకుడు కేతిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందిస్తూ 'గతంలో కేతిరెడ్డి ఉదయాన్నే వెళ్ళి ఖాళీ స్థలాలు చూసి కబ్జాలు చేసుకునేవారు. ఇప్పుడు ఓడిపోయి... పనీ పాటా లేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు.

ప్రపంచంలో మారు తున్న సాంకే తికను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిపుచ్చు కుంటు న్నాయి. రాష్ట్రానికి రూ.కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. రాజకీయాల కోసం రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసే ప్రయత్నం చేయొద్దు' అని మంత్రి విమర్శించారు. ఆయుష్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం విస్తరించనుంది. ఆ విభాగం బలోపేతానికి వైద్యులతో పాటు వివిధ కేటగిరీల్లో 358 మందిని నియమించాలని నిర్ణయించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు 71 మంది వైద్యులు,ముగ్గురు మానసిక వైద్యులు,26 మంది జిల్లా ప్రోగ్రాం మేనేజర్లు,90 మంది పంచకర్మ థెరపిస్టులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు సహాయకుల పోస్టుల భర్తీకి రాష్ట్ర వైద్య సేవలు-నియామకాల మండలి ద్వారా ఒప్పంద,పొరుగు సేవల పద్ధతిలో వీరిని నియమిస్తారు. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ళలో ఆయుష్ సేవలకు

రూ.37 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఆ రంగాన్ని నిర్లక్ష్యం చేసింది. 2024-25లో రాష్ట్రానికి కేంద్రం రూ.83 కోట్లు మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వ చొరవతో రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలుకు పలు కార్యక్రమాలు చేపట్టారు.

## ఎపి మద్యం కేసులో హైదరాబాద్‌లో సిట్ సోదాలు

**హైదరాబాద్, జూలై 26, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఆ రాష్ట్ర సిట్ పోలీసులు శనివారం నా డు హైదరాబాద్‌లోని పలు చోట్ల సోదాలు చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డికి సంబంధించి నానాక్‌రాంగూడలో గల కార్యాలయం లో సిట్ అధికారులు నాలుగు గంటల పాటు సోదాలు చేసి, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు గచ్చిబౌలి, బంజారాహిల్స్‌లో గల భారతీ సిమెంట్స్ కార్యాలయం, బాలాజి గోవిందప్ప కార్యాలయంలోనూ సోదాలు జరిగాయి. నానక్‌రాంగూడలోని చాణక్యకు చెందిన టిగ్రిల్ రె స్టారెంట్‌లోనూ సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. మద్యం కేసులో సిండికేట్ గా వున్న నిందితులు హైదరాబాద్‌లో గతంలో సమావేశాలు ని ర్వహించినట్లు తేలడం తో వీరు ఎక్కడ భేటీ అయ్యారనే దానిపై సిట్ అధికారులు ఆరా తీశారు ఏడు అధికారు ల బృందంతో వచ్చిన సిట్ బృందం రాత్రి ఎనిమిది గంటల వరకు సోదాలు నిర్వహించింది. సోదాల సమయంలో అక్కడ వున్న సిబ్బందిని ఎక్కడికి వెళ్లకుండా, ఎవరికి ఫోన్లు చేయకుం డా సిట్ అధికారులు కట్టడి చేశారు. సిట్ అధికారుల తనిఖీ సమయంలో స్థానిక పోలీసులు వారికి సహకరించారు.

## రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని వేడుకున్నా :హోంమంత్రి అనిత



**తిరుమల,జూలై 26ప్రభాతవార్తప్రతి నిధి:** రాష్ట్రంలో పేదరికం పోవాలని, ప్రతి ఒక్క కుటుంబం సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేస్తున్న కృషికి దేవదేవుడు ఆశీస్సులు కలగాలని వేడుకున్నట్లు రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పి4 విధానం అమలుచేయడంతో ఎన్నో పేదకుటుంబాలు బంగారు కుటుం బాలుగా మారుతాయని చెప్పారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలు ఆనందంగా ఉండాలని, అందరికీ మంచిజరగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. శనివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆమె విఐపి బ్రేక్‌లో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులువేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కార్గిల్ విజయ్ దివస్ రోజు సైనికుల ధైర్యాన్ని గుర్తు చేసుకుందాం : సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిధి:** కార్గిల్ విజయ్ దివస్ రోజు మన సైనికుల ధైర్యాన్ని గుర్తు చేసుకుందామని ముఖ్యమంత్రి చంద్ర బాబు అన్నారు. గడ్డకట్టే శిఖరాలపై వారి విజ యం ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తుం దన్నా రు. సైనికుల ధైర్యానికి వందనం చేస్తూ వారస త్వాన్ని గౌరవిస్తున్నానని ముఖ్యమంత్రి చంద్ర బాబు ట్వీట్ చేశారు.భూభాగాన్ని ఆక్రమించు కోవాలని కుట్రపన్నిన పాకిస్థాన్‌కు మన దేశ ఆర్మీ పరాక్రమాన్ని రుచి చూపింది. 'ఆపరేషన్ విజయ్' పేరిట కార్గిల్ నుంచి యుద్ధ భేరి మోగించి శత్రుసేనలను తరిమి కొట్టింది. ఇది జరిగి నేటికి సరిగ్గా 26 ఏళ్ళు పూర్తయ్యింది.

## నేటి నుంచి సారథ్యం పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటన :

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

విజయవాడ. జూలై26,ప్రభాతవార్తప్రతినిధి: "సారథ్యం" పేరుతో ఈ నెల 27 నుంచి రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుడుతున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. వికసిత్ భారత్ కోసం కార్యకర్తలను సారథులుగా తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో ఈ పర్యటన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన 'సారథ్యం' లోగోను విజయవాడ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు.అనంతరం ఆయన విలేకర్లతో మాట్లడుతూ తొలి దశ పర్యటన ఈ నెల 27 నుంచి వైఎస్సార్ కడప,28న నంద్యాల 29న కర్నూలు,30న అనంతపురం,31న శ్రీ సత్యసాయి జిల్లాల్లో సాగుతుందన్నారు. రెండో విడత ఊపర్యటన ఆగస్టు 4న పల్నాడు,5న గుంటూరు,6న బాపట్ల,7న ప్రకాశం జిల్లాల్లో....మూడో విడతలో ఆగస్టు 10న అన్నమయ్య,11న చిత్తూరు,12న తిరుపతి,13న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో సాగుతుందని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడంతో పాటు వివిధ రంగాల పెద్దలతో భేటీ కానున్నట్లు వెల్లడించారు.

## రైతుల బాధలు పట్టని మోడీ, బాబు ప్రభుత్వాలు

### కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

**తిరుపతి హెల్త్, జూలై 26 ప్రభాతవార్త :** కేంద్రంలో మోదీ , రాష్ట్రంలో బాబు ప్రభుత్వాలు రైతులు బాధలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మిర్చి, పొగాకు, మామిడి, చీనీ, పసుపు పండించే రైతులు గిట్టుబాటు ధరలు లేక నానా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పండించిన పంటలను కొనేవాడే లేడని ఎద్దేవ చేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఏ సబ్సిడీ రైతులకు అందడం లేదని బాధపడ్డారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ ఫ్లాప్ అయిందని, వైసీపీకి పట్టిన గతే కూటమికి పడుతుందని జోస్యం చెప్పారు.

## అందరికీ శుభాలు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,జూలై 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం సినీనటి నిరోషా, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయ్‌జాకీ, ప్రభుత్వ విప్ శ్రీధర్‌వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అటవీ భూముల్లో రహదారుల నిర్మాణానికి పర్యావరణ అనుమతులు తప్పనిసరి

### - కేంద్ర సాధికార కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ గోయల్


అటవీ అనుమతులపై రాష్ట్ర చీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీధర్‌తో కలిసి కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్ సమావేశం

**చిత్తూరు, జులై 26 ప్రభాతవార్త:** ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం అటవీ భూముల ద్వారా వెళితే అటవీ శాఖ నిబంధనల ప్రకారం పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం పలమనేరు రిజర్వ్ ఫారెస్ట్, టేకుమంద ఎక్స్‌టెన్షన్‌లో నిర్మిస్తున్న నాలుగు లైన్ల బెంగళూరు-చెన్నై గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే 2వ విడత పనులపై రాష్ట్ర చీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీధర్‌తో కలిసి కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, అనంతపురం, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదభాయ్ సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, ఎన్‌హెచ్ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కేంద్ర సాధికార కమిటీ సభ్యులు చంద్రప్రకాష్ గోయల్ మాట్లాడుతూ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టాండింగ్ కమిటీ సూచనలు అనుసరిస్తూ చిత్తూరు అటవీ డివిజన్ పరిధిలోని 7.1 కిమీ రహదారి, రాయల ఎలిఫెంట్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో రహదారి రోడ్డు నిర్మాణం చేపట్టడంలో భాగంగా వన్యప్రాణులు రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రహదారులను నిర్మించాలన్నారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఆదేశాల మేరకు రహదారి వెంబడి అనుకూలించిన ప్రదేశాల్లో చిన్న ప్రాణులు స్వేచ్ఛగా వెళ్ళడానికి అండర్ పాసులు నిర్మిం చాలన్నారు. అలాగే ప్రతి పాదిత ఎక్స్‌ప్రెస్ హైవేను వన్య ప్రాణులు అడ్డంగా దాట కుండా ఉండేలా నిర్మాణాలు చేప ట్టాలన్నారు. ప్రత్యేకించి ఏనుగుల కోసం కర్ణాటక అర్టీసీ శాఖ బందీపూర్, నాగర్హహోల్ నేషనల్ పార్కుల్లో అమలు చేసిన యాంత్రిక రైల్వే అడ్డంకి రూపకల్పన విధానం జిల్లాలో అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

అలాగే రహదారికి కిందివైపుగా చైన్ లింక్ ఫెన్స్ ఏర్పాటు చేయడం ద్వారా చిరుతలు, బ్లాక్ బీర్స్ వంటి వన్యప్రాణులకు అనుకూలంగా వుంటుందన్నారు.

వన్యప్రాణుల కదలిక అధ్యాయనంపై ఎన్‌హెచ్ఎఐ నుండి నిధులు సమకూర్చి జిపిఎస్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వినియోగించి ప్రాంతీయ సంస్థలు,

పరిశోధనలు వన్యప్రాణుల సంరక్షణ అధికారి, జిల్లా అటవీ అధికారి ఫీల్డ్ సిబ్బందిని కలుపుకుని ఒక పరిశోధన ప్రాజెక్టును అమలు చేయాలన్నారు.

అలాగే జీవవైవిధ్యంను పరిరక్షించుకోవడానికి ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో 10 కిమీలోపు వన్యప్రాణుల సంరక్షణకు తక్షణ స్పందన బృందంను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు.

అలాగే రహదారి నిర్మాణంలో భాగంగా అడవులు తరుగుతున్న నేపథ్యంలో అందుకు సమాన స్థలంలో పునఃఅటవీకరణ బాధ్యతలు పక్కాగా చేపట్టాలన్నారు. అలాగే ప్రభావిత గ్రామాల నివాస్తులకు పునరావాస సౌకర్యాలు కల్పించాలన్నారు.

## స్వామిపుష్కరిణి మరమ్మతులు ఆరంభం

**తిరుమల,జూలై 26ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో వేలకోట్లతీర్థాలు కలిసే స్వామివారి పుష్కరిణిలో మరమ్మతులు చేపట్టే పనులు మొదలయ్యాయి, ఈ పనులు టిటిడి ఇంజనీరింగ్ విభాగం, వాటర్‌వర్క్స్ విభాగం సంయుక్తంగా చేపడుతాయి.తిరుమలేశుని ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న పవిత్రపుష్కరిణి మరమ్మతులు, శుద్ధి పనులు చేపట్టడంలో భాగంగా ఇప్పటికే స్వామిపుష్కరిణిని తిరుమల తిరుపతి దేవస్థానం మూసివేసింది. ఆగస్ట్ 19వతేదీ వరకు ఈ పనులు సాగుతాయి. సాధారణంగా ప్రతి ఏడాది ఏడుకొండల స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు నెలరోజులు పాటు పుష్కరిణి మూసివేసి నీటిని పూర్తిగా తొలగిస్తారు. పుష్కరిణిలోపల ఉన్న పైపులైన్ల మరమ్మతులు, పుష్కరిణి సివిల్ పనులు చేపడతారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. అంతకంటే ముందే పుష్కరిణి మరమ్మతులు, శుద్ధి చేసే పనులు చేపట్టేలా టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగం అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఈనెల 20వతేదీ నుండి ఆగస్ట్ 19వరకు నెలరోజుల పాటుపూర్తిగా స్వామివారి పుష్కరిణి మూసివేస్తారు. నెలరోజులు పుష్కరిణి హారతి ఉండదు. భక్తులను కూడా అనుమతించరు. భక్తులకు స్నానాలకోసం వరాహస్వామి ఆలయం సమీపంలోనే స్నానఘట్టాలు,నీటికొళాయిలు ఏర్పాటు చేశారు. కొన్నివేల పుణ్యతీర్థాలు కలిసే గోవిందుని పుష్కరిణిలో సాదారణంగా నీరు నిల్వవుండే అవకాశం లేదు. పుష్కరిణిలో నీటిని ప్రతిరోజూ నిరంతరాయంగా శుద్ధిచేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులో ఉంది. నిరంతరాయంగా కొంత శాతం నీటిని శుద్ధిచేసి తిరిగి వినియోగిస్తారు. నెలరోజులు పుష్కరిణిలో నీటిని తొలగించి చిన్నచిన్న మరమ్మతులను పూర్తిచేస్తారు. పుష్కరిణి మరమ్మతుల్లో భాగంగా మొదటి పదిరోజులు నీటిని తొలగిస్తారు. ఆ తరువాత పదిరోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే చేపడతారు. చివరి పదిరోజులు పుష్కరిణిలో నీటిని నింపిపూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలో నీటి పిహెచ్ విలువ 7 ఉండేలా చూస్తారు.

## రైల్వేలో ఘనంగా కార్గిల్ విజయోత్సవ ర్యాలీ


రైల్వే గ్రౌండ్ నుంచి ప్రారంభమైన కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

**గుంతకల్లు రైల్వే, జూలై 26,ప్రభాతవార్త** భారత సరిహద్దుల వద్ద వాస్తవ ధీనా రేఖా దాటి మన దేశంలో అక్రమంగా ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని, భారత సైనికులు సమర్థవంతంగా పోరాడి తిప్పికొట్టిన "ఆపరేషన్ విజయ్" సందర్భంగా స్థానిక లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రైల్వే పెవిలియన్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన కార్గిల్ దినోత్సవ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ 1999లో 80రోజుల పాటు జరిగిన ఈ యుద్ధంలో దాదాపుగా 527మంది వీర సైనికులు ప్రాణాలు అర్పించారన్నారు. రైల్వే గ్రౌండ్, రైల్వే స్టేషన్ రోడ్‌ల మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు దాదాపు 1000మంది విద్యార్థులతో కార్గిల్ విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు.

యుద్ధంలో పాల్గొన్న వీరసైనికులకు పోలీసు వారి సహకారంతో గుంతకల్లు లయన్స్‌క్లబ్ వారు 500మీటర్ల జాతీయ జెండాతో ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వన్ టౌన్ సిఐ మనోహర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గుంతకల్లు లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు రైల్వే ఖాజాగరీబ్ నవాబ్,సెక్రటరీ యాంకర్ మహేష్ రాజు, కోశాధికారి అనపా బాలాజీ, డిస్టిక్ గవర్నర్ ఇల్లూరు గోపాలకృష్ణ,లయన్‌మెంబర్స్ వేల్పుల రాము, రంగస్వామి,జగన్నాథ్,దినేష్,విజయ్ భాస్కర్,వేల్పూరి రవి లైన్స్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

## తిరుమలలో ఇద్దరు భక్తులు అదృశ్యం

**తిరుమల,జూలై 26ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఇద్దరు వృద్ధులు తప్పిపోయారు. శనివారం తిరుమల 1టౌన్ పోలీసుకుల ఆయా కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కృష్ణాజిల్లా అగిరిపల్లిమండలం తోటపల్లికి చెందిన దాసరి వెంకయ్య(74), కంకిపాడు మండలం మద్దూరుకు చెందిన వీరంకి వెంకటస్వామి(49) కుటుంబసభ్యులతో తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం ఈనెల 18వతేదీ సాయంత్రం లడ్డూకౌంటర్ వద్ద దాసరి వెంకయ్య తప్పిపోయాడు. అతనికోసం వెదుకుతున్నసమయంలో వెంకటస్వామి అఖిలాండం వద్ద నుండి పిఎసి 4 సమీపం లోకి వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో శనివారం వారి కుటుంబసభ్యులు తిరుమలకు వచ్చి 1టౌన్ పోలీ సులకు పిర్యాదు చేశారు. 1టౌన్ సిఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 0877-2289027,9440796769,9440796771నంబర్లకు తెలియజేయాలని కోరారు.

## తక్షణమే రోడ్డు నిర్మించక పోతే ఆదివాసి దినోత్సవంరోజు పెద్ద ఎత్తున డోలీ యాత్ర చేస్తాం:గిరిజనులు హెచ్చరిక

**పాడేరు,జూలై26,ప్రభాతవార్త:**సాక్షాత్తూ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ శంఖు స్థాపన చేసిన రహదారి పనులు ఏడు నెలలు కావస్తున్నా రోడ్డు పను ప్రారంభం కాకపోవడంతో ఆయా గ్రామాల గిరిజనులు గుర్రాలతో సుమారు మూడు కిలోమీటర్లు వినూత్నంగా పాదయాత్ర చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు.అంతే కాకుండా రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించకపోతే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజు పెద్ద ఎత్తున డోలీలతో నిరసన తెలియజేస్తామని గిరిజనులు హెచ్చరించారు.దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.అల్లూరిసీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పిన్నకోట. పెద్దకోట. జీనపాడు పంచాయతీ పరిధిలో 11 గ్రామాల్లో గిరిజనులు 2,500 మంది జీవనం సాగిస్తూ ఉన్నారు.ఈ గ్రామాలకు రహదారి సౌకర్యాలు లేవు. అంతే కాకుండా గత ఏడాది డిసెంబర్ 25న బలగరువు నుండి వాజంగి మధ్య ఉప ముఖ్యమంత్రి కొణిదెపవన్ కళ్యాణ్ స్వయంగా కొన్ని కిలోమీటర్లు నడిచి వెళ్లారు.


రాష్ట్రంలో బిసి రిజర్వే షన్ల పెంపు ఆర్డినెన్స్ ముసాయిదాపై గవర్నర్ కేంద్ర హోం శాఖను న్యాయసలహా కోరడంతో రిజర్వేషన్ల ఖరారు కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం లోపు రిజర్వేషన్లపై తుదినిర్ణయం చెప్పాలనిప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టును మరి కొంత గడువు కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై హైకోర్టు ఎలా స్పందిస్తుందో అని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా ఉన్న తలనొప్పులు చాలవన్నట్లుగామహారాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 14 కరమెరి మండలంలోని ముకద్దంగూడ, కోట, అంతాపూర్, పరందోలి, గౌరీ, బోలాపటార్, లెండి గూడ, ఏసాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, పాల్స గూడ, నారాయణగూడ, మహారాజ్ గూడ, శంకర్‌లోధి అనే 14గ్రామాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవి. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ కిందకు వచ్చాయి. వాటిని మా రాష్ట్రంలో చేసుకుంటామని ప్రకటిచండంతో ఆయా గ్రామాల్లో స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అనే సందిగ్ధంనెలకొంది. స్థానిక ఎన్నికలు నిర్వహణ, బిసిబిల్లు తదితర అంశాలపై 25న జరిగే క్యాబినెట్ మీటింగ్‌లోచర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయంతీసుకుంది. అనూహ్యంగా ఈక్యాబినెట్ మీటింగ్ 28కివాయిదా పడటంతో మీటింగ్ అనంతరం స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టతవచ్చేఅవకాశంఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్థానిక ఎన్నికల అంశంలో బిసిరిజర్వేషన్ అంశంపై ఇటు గవర్నర్ ఆమోదం కాని, అటు కేంద్రప్రభుత్వ అనుమతి కాని వచ్చేవరకు అప్పటివరకు స్థానిక ఎన్నికల నిర్వహణపైస్పష్టత కనిపించే అవకాశం లేదు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై హై కోర్టును మరింత గడువు కోరడం తప్ప మరో గత్యంతరం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

# స్థానిక ఎన్నికలు సందిగ్ధమేనా?

**అమరవాది సంపత్‌కుమార్**

స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి ప్రభుత్వానికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఒక వైపు పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే స్థానిక ఎన్నికలకు సహకరిస్తాం లేకపోతే అడ్డుకుంటామన్న మాజీ సర్పంచ్‌ల హెచ్చరికలు, మరో వైపు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పించాలనే డిమాండ్ వస్తుండగా అక్టోబర్ 30లో స్థానిక ఎన్నికల నిర్వహించాలని వీటికి సంబంధించి ఏర్పాట్లకు నెలరోజులు సమయం ఇస్తున్నామన్న గడువు కూడా తీరడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. వీటిని పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌పై ఇప్పటికే అడ్వకేట్ జనరల్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులతో గవర్నర్ చర్చించారు. అనంతరం ఈ బిల్లును కేంద్రానికి ఆయన పంపారు. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్ ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే 285 క్లాజ్ ఎ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా అమలవుతాయని ఉంది. అందులో 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ముసాయిదాపై న్యాయ సలహా కోసం తాజా గవర్నర్ కేంద్రానికి పంపించారు. అయితే గతంలో సుప్రీంకోర్టు సైతం 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదంటూ ఇచ్చిన తీర్పును ఈ ఆర్డినెన్స్ ఉల్లంఘించినట్లు అవుతుందా? లేదా? అంటూ గవర్నర్ అనుమానం వ్యక్తం చేశారు. అందులో భాగంగా న్యాయ సలహా కోసం కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు ఈ ఆర్డినెన్స్ పంపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మొదటి నెల రోజుల్లో రిజర్వేషన్లనుఖరారు చేయాలని, ఆ తర్వాతి 2 నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రిజర్వేషన్లు నెల రోజుల్లో ఖరారు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది.

అంటే శుక్రవారం(జులై 25)లోగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉన్నది. కానీ ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 10న జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీనికి చట్టబద్ధత కల్పనకు పంచాయతీరాజ్ చట్టానికి సవరణలతో ఆర్డినెన్స్ తీసుకువచ్చి గవర్నర్‌కు పంపించగా, తాజాగా గవర్నర్‌ను




ఆర్డినెన్స్ ముసాయిదాపై న్యాయ సలహా కోసం కేంద్రానికి పంపించారు. అయితే ఆర్డినెన్స్ ఇప్పటివరకు గవర్నర్ ఆమోదం కానీ, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కానీ లభించలేదు. ఈ అంశం అంత త్వరగా తేలేది కాకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయవర్గాలలో ఉత్కంఠ నెలకొంది. ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్న అధికార యంత్రాంగం రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే సంకేతాలు ఉండటంతో అధికార యంత్రాంగం ముందస్తుగా అన్ని ఏర్పాట్లకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాను గ్రామాలు, వార్డుల వారీగా సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బంది డాటాను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల కలెక్టర్లను ఆదేశించింది. జిల్లా, రెవిన్యూ డివిజన్, మండలం, పంచాయతీ, వార్డుల సంఖ్య ఆధారంగా వివరాలు ఉండాలని తెలపడంతో అందుకు సంబంధించిన వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 566 ఎంపిపిలు, జడ్పీటీసీలు, 5773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని, వాటికి ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. గతంలో కంటే ఈసారి ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. రాష్ట్రంలో 71 గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీ, నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో కలవడంతో ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. గత లెక్కల ప్రకారం ప్రస్తుతం 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 570 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల డైరెక్టర్ సృజన ఈ నెల 7న ఎంపీటీసీ డీలిమిటేషన్ షెడ్యూల్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలు, వార్డుల సంఖ్యను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 12,778, వార్డులసంఖ్య 1,12,694గా లెక్క తేల్చింది. గత ఎన్నికల నాటికి గ్రామపంచాయతీలు 12,848 ఉన్నాయి. కొన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు పురపాలక, నగర పాలక సంస్థల్లో విలీనం కావడం వల్ల పంచాయతీల సంఖ్య తగ్గిందని అధికారులు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే పంచాయతీ ఎన్నికలు 2019లో జరిగాయి. గత ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. మళ్లీ జూన్‌లో పంచాయితీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటే కులగణన చేస్తున్న నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యమయ్యాయి. అయితే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్దంగా ఉండేలా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటోంది. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్ ముసాయిదాపై గవర్నర్ కేంద్ర హోం శాఖను న్యాయ సలహా కోరడంతో రిజర్వేషన్ల ఖరారు కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం లోపు రిజర్వేషన్లపై తుది నిర్ణయం చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టును మరికొంత గడువు కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై హైకోర్టు ఎలా స్పందిస్తుందో అని రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా ఉన్న తలనొప్పులు చాలవన్నట్లుగా మహారాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 14 కరమెరి మండలంలోని ముకద్దంగూడ, కోట, అంతాపూర్, పరందోలి, గౌరీ, బోలాపటార్, లెండి గూడ, ఏసాపూర్, ఇంద్రానగర్, పద్మావతి, పాల్స గూడ, నారాయణగూడ, మహారాజ్ గూడ, శంకర్‌లోధి అనే 14గ్రామాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవి. తెలంగాణఆవిర్భావం అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ కిందకు వచ్చాయి. వాటిని మా రాష్ట్రంలో చేసుకుంటామని ప్రకటిచండంతో ఆయా గ్రామాల్లో స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అనే సందిగ్ధంనెలకొంది. స్థానిక ఎన్నికల విషయంలో ఒక అడుగు ముందుకు, మూడు అడుగులు వెనక్కి అనేచందంగా మారిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్థానిక ఎన్నికలు నిర్వహణ, బిసి బిల్లు తదితర అంశాలపై 25న జరిగే క్యాబినెట్ మీటింగ్‌లోచర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. అనూహ్యంగా ఈ క్యాబినెట్ మీటింగ్ 28కి వాయిదా పడటంతో మీటింగ్ అనంతరం స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్థానిక ఎన్నికల అంశంలో బిసి రిజర్వేషన్ అంశంపై ఇటు గవర్నర్ ఆమోదం కాని, అటు కేంద్ర ప్రభుత్వ అనుమతి కాని వచ్చేవరకు అప్పటి వరకు స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత కనిపించే అవకాశం లేదు. ఇదే సమయంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై హై కోర్టును మరింత గడువు కోరడం తప్ప మరో గత్యంతరం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ●

# మమత కొత్త బాణం !

పశ్చిమ బెంగాల్

**ఎ.వి.వి ప్రసాద్**

తమిళనాడు, మహారాష్ట్రలో ఊపందుకొంటున్న హిందీ వ్యతిరేక ఉద్యమం ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లో కూడా ఉధృతమవుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'హిందీ వ్యతిరేక కారు' ఉపయోగిస్తూ ఎన్నికలకు వెళ్లే వ్యూహం రూపొందిస్తున్నట్లుగా కనిపిస్తోంది. వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికలకు ఇప్పటి నుంచే ఓటర్లను సిద్ధంచేసే పనిలో ఆమె నిమగ్నమయ్యారనీ, అందుకు ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొన్నారనీ, దానిలో భాగంగానే భాషా ఆందోళన ప్రకటించారనీ అంటున్నారు. గత సోమవారం 'తృణమూల్ కాంగ్రెస్ అమర వీరుల సంస్మరణ' సందర్భంగా ఆమె ఓ కొత్త నినాదం తెరపైకి తేవడం గమనించవలసిన అంశం. బెంగాలీ మాట్లాడే ప్రజలు బిజెపి పాలిత రాష్ట్రాల్లో చాలా వేధింపులకు గరవుతున్నారనీ, దానికి వ్యతిరేకంగా బెంగాలీలందరూ' నా నేల నా భాష' ఉద్యమంలో భాగం కావాలనీ ఆమె పిలుపు నిచ్చారు. 'మీ భాషను వ్యతిరేకించే వారిని ఎదుర్కోండి' అంటూ ఆమె ఇచ్చిన పిలుపు బెంగాల్‌లోనే కాక ఇతర రాష్ట్రాల్లో కూడా సంచలనం సృష్టిస్తోంది. భాషను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం కొత్తకాకపోయినా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రకటనలు చేయడం ఇటీవల ఎక్కువవుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన త్రిభాషా విధానాన్ని వ్యతిరేకించడంలో ముందున్న ముఖ్యమంత్రులు స్టాలిన్, పినరై విజయన్ కొత్త కొత్త ఆందోళనలు రూపొందిస్తుండడంతో మమతా బెనర్జీ కూడా అటువంటి విధానమే అనుసరిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో బెంగాలీ కేవలం సంభాషణ భాష మాత్రమే కాదనీ, ఒక గొప్పసంస్కృతికి చిహ్నమనీ మమత చేస్తున్న వాదనలో వాస్తవం ఉన్నాఎన్నికల ఓట్ల కోసం ఆమె భాషా ఆందోళన జరపడమేమిటనే విమర్శలు వినిపిస్తున్నాయి. రవీంద్రనాథ్ టాగోర్, నజ్రుల్ ఇస్లాం వంటి మహాకవులు ఉద్భవించిన నేల అయినా గతంలో ఎటువంటి వివాదం తలెత్తకుండానే రాజకీయాలు నడిచాయి. జ్యోతిబసు సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా ఉన్నా భాషాపరమైన ఆందోళనలు తలెత్తకుండానే పాలనచేశారు. బెంగాల్‌తో పాటు ఇతర ఏ భాషనైనా సమానంగా గౌరవించే సంస్కృతి మొదటి నుంచి అక్కడ విలసిల్లుతోంది. హిందీతో పాటు ఉర్దూ, పార్సీ, బిహారీ, ఒడిశా, తమిళం, తెలుగు వంటి భాషల ప్రభావం బెంగాల్‌లో ఎక్కువే ఉంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలలో వలస ప్రజలు అధికం కనుక ఎన్నో దశాబ్దాలుగా అక్కడ మిశ్రమ సంస్కృతి కొనసాగుతోంది. ఎన్నిభాషలు ఎంతగా వ్యాప్తి చెందినా'వంగ సంస్కృతికి ఎలాంటిలోటు రాకుండా అంతా కలిసిమెలిసి జీవనం సాగిస్తున్నారు. అయితే టిఎంసి అధికారంలోకి వచ్చిన తర్వాత భాషా పరమైన వాదనలు పెరగడం, హిందీ వ్యతిరేకతను ఒక ఉద్యమంగా మార్చడంతో ప్రజలు కూడా ఆ బాటే పడుతున్నారు.' బెంగాలీకి తగినంత గుర్తింపు' లభించేదాకా ఈ భాషా ఆందోళన కొనసాగుతుందని మమత అంటున్నారు.



మమతా బెనర్జీ

రాజకీయ లక్ష్యాలను భాష చుట్టూ తిప్పడమే ఇక్కడ ఆశ్చర్యం కలిగించే విషయం. ఈ విషయంలో తమిళనాట పరిస్థితి వేరు, బెంగాల్‌లో పరిస్థితి వేరనే చెప్పాలి. బెంగాలీ భాషకు సవాల్ విసురుతున్నది ఇంగ్లీషే గాని హిందీ కాదన్నది చాలా మంది అభిప్రాయం. రాష్ట్రంలో త్రిభాషా విధానం అవలంభిస్తున్నారు. బంగ్లా మీడియం పాఠశాలలకు మొదటి భాషగా బెంగాలీ, ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు ఇంగ్లీషు, నేపాల్ మీడియం పాఠశాలలకు నేపాలీ, హిందీ మీడియం పాఠశాలలకు హిందీ మొదటి భాషగా, రెండో భాషగా ఇంగ్లీష్ లేదా హిందీ, మూడో భాషగా ఆ రెండూ కానిభాషలు ఉండాలనే నియమం పాటిస్తున్నారు. ఇంగ్లీష్, బంగ్లాతోపాటు రాష్ట్ర అధికార భాషలలో హిందీ, ఉర్దూ, ఓల్ చికీ, కుర్మాలీ, ఒడియా, తెలుగు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో 202 మాతృభాషలు ఉన్నా, 5 శాతం కంటే ఎక్కువ ప్రజలు మాట్లాడే భాష బంగ్లా కనుక దానికి ఎక్కువ ప్రాధాన్యం లభించవలసిన అవసరం ఉంది. కానీ అది మాత్రమే మాట్లాడాలనడం ఒక విధంగా నిరంకుశత్వమే అవుతుంది. భాషా వాదం దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్నంతగా ఉత్తరాదిలో ఎప్పుడూ ఉధృతం కాలేదు. ఇప్పుడు ఎవరైనా ఆరంభిస్తే దానిలో రాజకీయమే గాని భాషాభిమానం కనిపించదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పశ్చిమ బెంగాల్ విద్యావిధానం, జాతీయ విధానం మధ్య వైరుధ్యాలు ఎక్కువ లేకపోవడంతో భాషాపరమైన ఆందోళనలు లేకుండానే ఇంతకాలం సాగింది. బెంగాల్ లోని రాజకీయ పార్టీలు భాషాపరమైన 'వార్'కు విముఖత చూపడానికి హిందీ, ఇంగ్లీష్ పట్ల వారికి గల అభిమానమే. మమత ప్రభుత్వం గతంలో ఒకటి నుంచి టెన్త్‌వరకు బెంగాలీని తప్పని సరి చేసే నిబంధన తేవడంతో అది డార్జిలింగ్ కొండల్లో నిప్పు రాజేసింది. అక్కడి ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ 104 రోజులు సమ్మె చేశారు కూడా. కాగా ప్రభుత్వ వ్యూహం బెడిసికొట్టింది. ఆమె తాజాగా అనుసరిస్తున్న బంగ్లా విధానంలో కొంత కఠినత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా కనిపిస్తోంది. 'మీరు బెంగాల్‌కు వస్తున్నట్లయితే బెంగాలీలోనే మాట్లాడాలి. బయటినుంచి వచ్చిన వారు బెంగాలీ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తే సహించం' అంటూ ఆమె చేసిన ప్రకటన ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో? అనే సందేహం వ్యక్తమవుతోంది. రానున్న వారాలు, నెలల్లో కొత్తబ్రాండ్ సాంస్కృతిక రాజకీయాలు బెంగాలీ తెరపైప్రత్యక్షం కావొచ్చు. అనేక వివాదాలతో సతమతమవుతున్న మమత వాటినుంచి బయటపడడానికి భాషా వాదాన్ని ప్రయోగిస్తున్నట్లుగా కనిపిస్తోంది. మమత వదులుతున్న కొత్త బాణం ఎన్నికల గురిని ఎంతవరకు ఛేదించగలుగుతుందో చూడాలి. లేక బూమెరాంగ్ అయితే అధికారంపై ఆశలు వదులుకోవలసివస్తుంది. బిజెపిని వెనక్కి నెట్టడానికి మమత బెంగాలీ సాంస్కృతిక 'అస్మిత'ను ప్రేరేపిస్తే జాతీయస్థాయిలో ఆమెకు వ్యతిరేకతను పెంచదా? చూడాలి. ●

# మధ్యప్రాచ్యం యుద్ధవిరమణకు 'శాంతికిరణం'

ఫ్రాన్స్

**గన్ని మోహన్**

మూడేళ్లుగా ఇజ్రాయెల్‌తో పోరాడుతూ ఆకలి కేకలతో చిన్నారుల నుంచి పెద్దలవరకూ అల్లాడిపోతున్న పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్లు ప్రకటించి యూరోప్‌లోని అతిపెద్ద దేశంఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సంచలనం కలిగించారు. మధ్యప్రాచ్యంలో శాంతిస్థాపనకు ఇది అత్యవసరమని, ఫ్రాన్స్‌ప్రజల మనోభీష్టానికి అనుగుణంగానే ఈనిర్ణయం తీసుకున్నామని మేక్రాన్ ప్రకటించారు. తక్షణమే కాల్పుల విరమణ, బందీల విడుదల, మానవతాసాయం రెట్టింపు చేయడం వంటి చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. అక్కడ శాంతి నెలకొల్పేందుకు మరో ప్రత్యామ్నాయం కనిపించడంలేదని, ప్రత్యేక దేశంగా గుర్తించడం ప్రపంచదేశాల ముందున్న తక్షణ కర్తవ్యమని చేసిన ప్రకటన సహజంగానే అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు ఆగ్రహం కలిగించింది. అయినా కూడా పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాల్సిందేనని, అందుకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో తామే స్వయంగా ప్రతిపాదన తెచ్చి ప్రత్యేక దేశంగా గుర్తించాలని నొక్కిచెపుతామని, అందుకు శాయశక్తులా కృషిచేస్తామని ప్రకటించి మేక్రాన్ అగ్రరాజ్యానికి మరింత ఆగ్రహం తెప్పించారు. ఇజ్రాయెల్‌పై ఆకస్మికదాడి చేసి యుద్ధాన్ని కొనితెచ్చుకున్న హమాస్ అధీనంలో ఉన్నపాలస్తీనా ఎప్పటికైనా మాదేనని, ఇక మేమే పాలిస్తామని చెపుతూ వచ్చిన ఇజ్రాయెల్, ఆదేశానికి మద్దతిస్తున్న అమెరికాకు సుతరాము ఇష్టంలేకపోయినా ఫ్రాన్స్ మాత్రం యూరోప్ దేశాల్లో ముందడుగువేసింది. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభలోనేఫ్రాన్స్ పాలస్తీనాకు గుర్తింపునిస్తున్నట్లు స్వయంగా ప్రకటిస్తామని మేక్రాన్‌వెల్లడించారు. గాజాలో యుద్ధం నిలిచిపోయి, అక్కడి జనాభాను ఆకలి నుంచి రక్షించడం ప్రస్తుత అత్యవసర కర్తవ్యమని, ప్రతి ఒక్కదేశం బాధ్యత అని చెపుతున్న మేక్రాన్‌కు తోడుగా మరికొన్ని యూరోప్, యూరోపేతర దేశాలు కూడా నిలిచాయి. పశ్చిమాసియాలో చిన్న అరబ్బుదేశంగా ఉన్న పాలస్తీనాను ఇప్పటికేకొన్ని ముస్లింలీగ్ దేశాలు గుర్తించాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడి ప్రకటనపై పాలస్తీనాతోపాటు కొన్నిప్రపంచ దేశాలు కూడా స్వాగతించాయి. సమితిపరిధిలోని 140కిపైగా దేశాలు ఇప్పటికే పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఒత్తిడిపెంచాయి. యూరోప్‌లోని ఐర్లాండ్, స్పెయిన్, నార్వేదేశాలు కూడా ఫ్రాన్స్‌తోపాటే నడిచాయి. రెండేళ్లక్రితం అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ నిర్వహించిన ఆకస్మిక దాడి అనంతరం ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధంఒక్కసారిగా పాలస్తీనాను అతలాకుతలం చేసింది. ఓపక్క హమాస్‌ను అంతం చేయాల్సిందేనని, ఇక ఆ సంస్థ మనుగడలో ఉండకూడదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేస్తూఇజ్రాయెల్‌ను మరింతగా దాడులకు ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఉగ్రవాదంపై కట్టుదిట్టమైన పోరును కొనసాగించడం స్వాగతించదగినదే అయితే సామాన్య పౌరులు లక్షల్లో పిట్టల్లా నేలరాలిపోతుంటే



ఇమ్మాన్యుయేల్ మేక్రాన్

సామాజిక బాధ్యతను కూడా గుర్తెరగాలని యూరోప్ దేశాలు భావిస్తున్నాయి. పాలస్తీనాలో శాంతి నెలకొనాలని పోప్‌ఫ్రాన్సిస్ నుంచి అగ్రనేతలు అందరూకూడా విశేష కృషిచేసినా దాడులు ఆగలేదు. గాజా వెస్ట్‌బ్యాంక్, రమల్లా వంటి నగరాలు మొత్తం స్మశానవాటికల్లా మారిపోయాయి. 55వేలమందికిపైగా చనిపోయినట్లు సమితి మానవహక్కుల విభాగం ప్రకటించింది కూడా. అలాగే అంతర్జాతీయ న్యాయస్థానం ఇప్పటికే ఇజ్రాయెల్‌కు సమన్లు జారీచేసింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నదని హెచ్చరించింది కూడా. అయినా కూడా ఇజ్రాయెల్ పాలకులు ఎక్కడా తగ్గిందిలేదు. సరికదా మానవతా సాయంపైనా దాడులుచేసి వారికి ఆహారం కూడా అందకుండాచేస్తున్నారు. ఇదే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పాలస్తీనాను గుర్తిస్తున్నట్ల ప్రకటించడానికి కారణమైంది. ఇప్పుడు ఫ్రాన్స్‌దారిలో ప్రపంచ దేశాలు మొత్తం ఒక్కటిగా మారే అవకాశం ఉంది. ఈముప్పును ముందే ఊహించినఅమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహులు ఇప్పుడు మేక్రాన్‌పై మండిపడుతున్నారు. మధ్యప్రాచ్యంలో శాంతిస్థాపనకుమేక్రాన్ చర్యలు విఘాతం కలిగిస్తున్నాయంటూ ఎదురుదాడికి దిగారు. ఫ్రాన్స్ జి7దేశాలు, జి20 దేశాలతోపాటు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సభ్యదేశం. అందువల్లనే ధైర్యంగా ముందడుగు వేసి పాలస్తీనాలో శాంతిస్థాపనకు ఉపక్రమించాల్సిందేనన్న సందేశంఇచ్చింది. వాస్తవానికి ముందు ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులుచేసిన సందర్భంలో ఇజ్రాయెల్‌కు సంపూర్ణమద్దతును మేక్రాన్ ప్రకటించారు. తదనంతర పరిణామాల్లో పాలస్తీ, వెస్ట్‌బ్యాంగ్, గాజా స్ట్రిప్, రమల్లా వంటి ప్రాంతాల్లో అమెరికా మద్దతుతో జరిపిన దాడులపట్ల ఫ్రాన్స్ అధ్యక్షుడు తీవ్ర నిరాశను వ్యక్తంచేసారు. ప్రస్తుతం పాలస్తీనా వాసులు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులకు వెన్నంటి ఉండాల్సిందేనని మేక్రాన్ భావించారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌మాత్రం గాజాలోయుద్ధం ఉధృతంచేయాలని ఇజ్రాయెల్‌కు పిలుపునిచ్చారు. గాజాలో కాల్పుల విరమణ చర్చలు వైఫల్యానికి కారణం హమాస్ అని ఆ సంస్థకు కొనసాగే హక్కులేదని, ఇజ్రాయెల్ సైనిక చర్య సబబేనని సమర్థించారు. హమాస్‌కు శాంతిఒప్పందంపైఆసక్తి లేదని, చావుకోరుకుంటున్నదని చేసిన వ్యాఖ్యలు పాలస్తీనా వాసుల్లోభయాందోళనలురేకెత్తించాయి. గాజాకు తాము సెతం 60మిలియన్ డాలర్ల మానవతాసాయం అందించామన్నారు. కానీ హమాస్‌వల్లనే పాలస్తీ నావాసులకు జీవించడమే ముప్పుగా మారిందని ఆగ్రహావేశాలు వ్యక్తంచేసారు. ఇలాంటితరుణంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు చేసిన ప్రకటన అటుపాలస్తీనా వాసులేకాదు ప్రపంచ దేశాల్లో సింహభాగం స్వాగతించాయి. కారణం ప్రస్తుతం పాలస్తీనాలోనెలకొన్న పరిస్థితులేనని చెప్పక తప్పదు. మొత్తంమీద నరమేధం, మారణ హోమం, మానవప్రేరేపిత విలయంతో అట్టుడికి పోతున్న పాలస్తీనాకు మేక్రాన్‌చేసిన ప్రకటన శాంతిస్థాపనకు ఆశాకిరణంగా కనిపించింది. ●

# స్మార్ట్‌ఫోన్ వాడేవారికి శాపంగా రీల్స్,షార్ట్ వీడియోలు?



డాక్టర్ నీలం సంపత్

కృత్రిమ మేధస్సుతో మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్న వేళ ఆ ఆర్టిఫీషియల్ ఇంటలీజెన్స్ సృష్టించిన విషవలయంలో పడుతున్న మనిషి వర్తమాన స్థితి భారతీయ పురాణాల్లో ఒకటైన , మోహినీ భస్మాసుర ఉదంతాన్ని గుర్తు చేస్తోంది. కరోనా కల్లోలంతో బలవంతపు ఒంటరితనానికి బానిసగా మారిన మనిషి తన దైనందిన జీవనంలో వివిధ పాత్రల నూతన జీవన యానాన్ని కొనసాగించడానికి అనివార్యంగా మొబైల్ ఫోన్‌తో సహజీవనాన్ని ప్రారంభించడం ఆ మనిషిని ఊహించని రీతిలో ప్రమాదాల సుడిగుండంలోకి నెట్టి వేస్తోంది. కరోనా కథ ముగిసిన తర్వాత అందరు చుట్టూ వుంటున్నా మనిషి స్వయం కల్పితఒంటరితనంలో జీవితాన్ని కొనసాగిస్తూ స్మార్ట్‌ఫోన్ సహాయంతో కాసింత కాలక్షేపం కోసమో, కావలసిన వినోదం కోసమో చూడడం, చేయడం ప్రారంభించిన రీల్స్, షార్ట్ వీడియోస్ వలలోపడి అందులో నుండి బయటకు రాలేక విలవిల్లాడుతున్న వైనం నిస్సందేహంగా ఆందోళన కలిగిస్తోందని చెప్పక తప్పదు. ఈ ప్రపంచంలో అన్నింటికన్నా విలువైనది కాలమేననే సత్యం లోక విదితమే. ఐతే ఆధునిక సాంకేతికత విషపుత్రికగా పురుడు పోసుకున్న రీల్స్, షార్ట్ వీడియోల వ్యాపకం వయస్సుతో సంబంధం లేకుండా రెండు మూడేళ్ల వయస్సు పిల్లల నుండి పండు ముదుసలి వరకు అన్ని వయస్సుల ప్రజలు ప్రతి రోజూ చేతిలో స్మార్ట్ ఫోన్‌తో తమకు అందుబాటులో వున్న ఇరవై నాలుగు గంటల్లో సింహభాగం రీల్స్, షార్ట్ వీడియోస్ చూడడానికే కాదు చేయడానికి ఉపయోగిస్తున్న నేపథ్యంలో మద్యం, మత్తు పదార్థాల కన్నా అత్యంత భయంకరమైన దుర్వ్యసనంగా మారడం దురదృష్టకరం. ఇంట్లో, వసారాలో, రోడ్లపై, ద్విచక్ర వాహనాలపై, బస్సుల్లో, రైళ్లలో, కార్యాలయాల్లో, కార్ఖానాల్లో, పార్కుల్లో అన్ని పబ్లిక్ ప్లేసుల్లో ఎక్కడ చూసినా వయస్సుతో సంబంధం లేకుండా చేతుల్లో స్మార్ట్ ఫోన్లతో రీల్స్ చూసే వారు, రీల్స్ చేసేవారు వాస్తవిక ప్రపంచంలో కాకుండా ఏదో ఊహాలోకంలో విహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒకటీ రెండు నిమిషాల నిడివి గల ఓ వీడియో ద్వారా తమ జీవితంలో ఓ అలౌకికమైన ఆనందాన్ని పొందాలని తపన పడుతున్న మనిషి సదరు షార్ట్ వీడియోల ద్వారా తన కోరికను తీర్చుకోగలుగుతున్నాడా? అని పరిశీలించినప్పుడు ఆక్షణాల్లో మానవాళి పొందే ఆనందం కన్నా వాటి ద్వారా తమ జీవితాలను విధ్వంసం చేసుకోవడానికి తానే కారణంగా మారుతున్న వైనం నిస్సందేహంగా ఆందోళన కలిగిస్తోంది. కుటుంబంతో పాటు సంఘ జీవనానికి దూరమోతూ ఓవైపు సామాజిక అల్లికను ఛిద్రం చేయడంతో పాటు దైనందిన జీవనంలో అపరిమితంగా స్క్రీన్‌ను చూస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిళ్లతో పాటు కంటి చూపు పాడవడం, విద్యా పరమైన, ఉద్యోగ పరమైన, వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహించడంలో వైఫల్యం చెందుతున్న వైనం దురదృష్టకరంగా పరిణమిస్తోంది. రీల్స్‌తో కొంత మంది భార్యాభర్తల కాపురాల్లో చిచ్చు రగులుతోందనే ఆరోపణలువినపడుతున్నాయి. మరోవైపు రీల్స్ చేయడం ద్వారా వాటిని వైరల్ చేయడం ద్వారా గణనీయమైన సంఖ్యలో వ్యూస్‌నూ, లైక్స్‌నీ సంపాదించుకునే క్రమంలో అనతికాలంలోనే సోషల్ ఇన్ ఫ్లూయన్సర్లుగా మారి లక్షల రూపాయల సంపాదనతో సెలబ్రిటీలుగా జీవితాలను కొనసాగించవచ్చనే ఆశ కూడా ఈ దుర్వ్యసనాన్ని మరింత బలంగా మారుస్తుందేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. లక్షల సంఖ్యలో వ్యూస్ నీ, లైక్స్‌నీ, షేర్స్‌ని సంపాదించడానికి సామాజిక జీవనాన్ని విధ్వంసం చేసే రీల్స్‌నీ, షార్ట్ వీడియోలను తయారు చేసి తమ విలువైన సమయాన్ని కోల్పోవడంతో పాటు లక్షలూ, కోట్ల సంఖ్యలో ఇంటర్ నెట్ వినియోగదారులను ఆకర్షిస్తూవారిని శారీరక, మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. ఐతే ఈజూదంలో గెలిచేది లక్షలో ఒకరి కన్నా తక్కువే కావడం మిగతా వారంతా బాధితులుగా మారుతుండడం ఓ విషాదంగా భావించక తప్పదు. గతేడాది కర్ణాటక



రాష్ట్రంలో ఓ టూరిస్ట్ స్పాట్‌లో కొండ అంచుపై నిలబడి రీల్స్ చేసే క్రమంలో ప్రముఖ సోషల్ మీడియా ఇన్ ఫ్లూయన్సర్ అన్వీ కామత్ లోయలో పడి మరణించడాన్ని మరిచిపోక ముందే కొండ అంచుపై కారుని నడిపిస్తూ ఓ రీల్ చేయాలని భావించిన యువతి బ్రేక్‌ను నొక్క బోయి ఎక్స్‌లేటర్‌ని నొక్కి లోయలో పడి దుర్మరణం చెందింది. మరో దురదృష్టకర సంఘటనలో పరుగెత్తుతున్న రైలు నుండి దూకుతూ వీడియో చేసే క్రమంలో మరో యువతి ఘోర ప్రమాదానికి గురై చావు బతుకులతో పోరాడుతున్న వైనం బాధాకరం. నిన్న గాక మొన్న బీహార్ రాష్ట్రంలో ఓ పన్నెండేళ్ల బాలుడు రైలు క్రింద పడుకొని రీల్ చేసిన వైనం ఒళ్లు గగుర్పొడిచేలా చేసింది. రాజస్థాన్‌లోని ఓ జలాశయంపై ఇనుప గ్రిల్‌పై తన కూతురిని నిలిపి రీల్ చేయడానికి ప్రయత్నించిన తల్లిదండ్రుల చర్య గుండెల్ని జలదరింపజేసింది. అత్యంత దురదృష్టకరమైన మరో సంఘటనలో విషపూరితమైన నాగుపామును ముద్దాడుతూ ఓ స్నేక్ క్యాచర్ చేసిన రీల్ పర్యవసానంగా ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. వేలం వెర్రిగా మరో ఘటనలో ప్రయాణికులూ, పాదచారులూ, వేగంగా పరుగులు తీస్తున్న వాహనాల కూడలిలో కరెన్సీ నోట్ల కట్టలను వెదజల్లి షార్ట్ వీడియోని చిత్రీకరించిన ఉదంతం పబ్లిక్ న్యూసెన్స్‌తో పాటు ప్రమాదాలకు కారణంగా మారిన వైనం ఆందోళన కలిగించింది. గతంలో నోయిడా ఢిల్లీలో, నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నగరంలో అర్ధరాత్రి ఓ యువజంట మోటర్ సైకిల్ పై చేసిన రొమాన్స్ తాలూకు షార్ట్ వీడియో అశ్లీలతకు నిలువెత్తు నిదర్శనంగా సోషల్ మీడియాలో వైరలైంది. ఇన్‌స్టా రీళ్లలో అధికశాతం మంది ఎంటర్ టైన్‌మెంట్, సమాచారాత్మక, ప్రేరణాత్మక, ట్రెండింగ్, వ్యక్తిగత అనుభవాలను పంచుకునే వీలున్న వ్లాగ్ రీల్స్, ఫ్యాషన్ రిటైల్ రీల్స్, డ్యాన్స్, కామెడీ, సమస్య పరిష్కారాత్మక, రొమాంటిక్ రీల్స్‌నే చూస్తుండడం, చేస్తుండడం బహిరంగ రహస్యమే. తుఫాన్‌లా కొనసాగుతున్న ఈ రీల్స్ ఒరవడి మానవాళి దైనందిన జీవనంలో అత్యంత విలువైన కాలాన్ని గ్రహణంలా మింగేస్తున్నవైనం ఆందోళన కలిగిస్తోంది. మనిషి ప్రతిరోజూ తన ఆరోగ్య రక్షణ కోసం అనివార్యంగా నిద్రించాల్సిన ఏడెనిమిది గంటల సమయం కూడా నిద్రపోలేకపోవడం బాధాకరం. ప్రతి రోజూ సింహభాగం రీల్స్ చూడడంలో, చేయడంలో గడుపుతున్న ఫలితంగా ఇంటా, బయటా, వృత్తిలో చివరికి ఉద్యోగ జీవనంలో సైతంవారిలోని సృజనాత్మక నశించిపోతుంది. రీల్స్‌కు బానిసగా మారి యాంత్రిక జీవనంలో కొట్టుమిట్టాడుతున్నాడు. కాలం విలువను మరిచి పోతున్నాడు. కుటుంబంలో, సమాజంలో తన చుట్టూ పదులూ, వందల సంఖ్యలో మనుషులు తిరుగుతున్నా వారెవ్వరితో సంబంధం లేని ఒంటరి జీవితాన్ని గడపాల్సి వస్తోంది. ఫలితంగా హైపర్ టెన్షన్, బి.పిలతో తీవ్రమైన మానసిక ఒత్తిళ్లూ, పరిణామంగా గుండె జబ్బు లాంటి రోగాల కుంపటిగా మారుతున్నాడు. రీల్స్ రూపంలో పదేపదే చెత్తను చూస్తున్న ఫలితంగా మనిషిలో నేర ప్రవృత్తి సైతం పెరిగిపోయే ప్రమాదముందని మనో వైజ్ఞానిక వేత్తలనుకుంటున్నారు. డెబ్భై కోట్లపై చిలుకు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులున్న మన దేశంలో మెజారిటీ సభ్యులురీల్స్ ఊబిలో పీకలలోతుకు చిక్కుకుపోయిన వైనంతో వ్యక్తిగతంగా, వృత్తి పరంగా, సంఘ జీవనంలోను విజయాన్ని సొంతం చేసుకోవడానికి అవసరమైన అంకిత భావాన్ని, దృఢ దీక్షను ప్రదర్శించడంలో మనస్సును లగ్నం చేయలేక పరాజితులుగా మారిపోతుండడం అత్యంత దురదృష్టకరంగా అభివర్ణించక తప్పదు. నేటి సమాజంలో ఓ మహమ్మారి రూపాన్ని సంతరించుకుని కోట్లాది ప్రజలను తమ సుడిగుండంలో బంధించి వేధిస్తున్న రీల్స్ బారి నుండి కాపాడే చట్టపరమైన యంత్రాంగమేదీ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేవలం స్వయం నియంత్రణ ద్వారానే రీల్స్ ముప్పునుండి ప్రజలు తమను తాము కాపాడుకోవడం సాధ్యమంటూ వివిధ అధ్యయనాలు అందిస్తున్న నివేదికల ప్రకారం మార్పుముందుగా వ్యక్తినుండి తర్వాత ప్రతి కుటుంబంలో నుండి రావాలి. టైమ్ లిమిట్ పెట్టుకో వడం, ఎంత కష్టమైనా ఈ అలవాటు స్థానంలో, ఆ సమయంలో ఆటలాడడం, పాటలు వినడం, డ్రాయింగ్, మొబైల్‌కు దూరంగా వుంటూ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో బిజీగాఆనందంగా గడపడం లాంటి సూచనల్లో కొన్నింటినైనా పాటిస్తే రీల్స్ జాఢ్యం విషవలయం నుండి విముక్తి లభిస్తుంది. ●

# పంజా సెంటర్‌లో తృప్తి క్యాంటీన్ ప్రారంభం

**-తృప్తి క్యాంటీన్‌లలో డ్వాక్రా మహిళలచే రుచికరమైన ఆహారం**
**-డ్వాక్రా మహిళను ఎంటర్ ప్రెన్యూర్‌గా చేయడమే ప్రభుత్వ లక్ష్యం**
**-పి4లో భాగంగా మహిళలచే తృప్తి క్యాంటీన్ల నిర్వహణ**
**పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్**

**విజయవాడ కార్పొరేషన్,జులై 26,ప్రభాతవార్త:** రాష్ట్రం లోని పేద మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చి,స్వావలంభన సాధించే దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం,ఒన్‌టౌన్,పంజా సెంటర్‌లో తృప్తి క్యాంటీన్‌ను ఆయన,మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్,విజయవాడ మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్రలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు 'తృప్తి' క్యాంటీన్‌లను ప్రారంభించిందన్నారు. మెప్మా అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 750 క్యాంటీన్‌లు ప్రారంభించనున్నామన్నారు. ఇటికే నెల్లూరులో తృప్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే అది ద్విగ్విజయంగా రోజుకు రూ.10వేలు నుండి 15 వేల వరకు ఆదాయం డ్వాక్రా మహిళలకు వస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 30 వేల మంది మెప్మా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మాకు లక్ష్యాన్ని ఇచ్చారని,అందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా మహిళలకు తృప్తి క్యాంటీన్ల నిర్వహణ భాధ్యతను అందిస్తున్నామన్నారు. నెల్లూరులో తొలి క్యాంటీన్‌ను మంత్రి నారాయణ ప్రారంభించారు.తక్కువ ధరలకే ప్రజలకు భోజనం అందించడంతో పాటు మహిళలకు ఉపాధి కల్పించడమే ఈ క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పట్టణ ప్రాంతాల్లో 28 లక్షల డ్వాక్రా మహిళా సంఘాలు ఉన్నాయని వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చేయూతను అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళల రూ.10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం వచ్చేలా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా కృషి చేస్తూ డ్వాక్రా మహిళల జీవనోపాధులు పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. నాణ్యతతో కూడిన ఆహార పదార్ధాలను తక్కువ ధరలకే ప్రజలకు ఆహారం అందించే లక్ష్యంతో తృప్తి క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. నగరంలో మరికొన్ని చోట్ల కూడ అన్న క్యాంటీన్ల మాదిరిగా తృప్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. జీఎస్టీతో కలుపుకొని ప్రాజెక్ట్ వ్యయం రూ.14,51,400 అవుతుందన్నారు. ఇందులో 75% డ్వాక్రా మహిళలు,25% సారాస్ ఏజెన్సీ లోన్ ద్వారా సమకూర్చుతారన్నారు. ఆదాయం కూడ అదే విధంగా పొందుతారన్నారు. నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసి క్యాంటీన్లను అప్పగిస్తారన్నారు. క్యాంటీన్ నిర్వహణ కోసం కంటైనర్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. పరోక్షంగా మరికొందరికి కూడ ఉపాధి లభిస్తుందన్నారు. వంట చేయడం,నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ అందిస్తామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆహారాన్ని తనిఖీ చేసి సూచనలు ఇస్తారన్నారు. వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకొని క్యాంటీన్లను సమర్ధవంతంగా నడిపిస్తారన్నారు. కష్టమర్లకు సంతృప్తి కలిగేలా ఆహారాన్ని అందిస్తారన్నారు. ఈ క్యాంటీన్లను ముఖ్యమైన కూడళ్లలో హైవేలకు దగ్గరగా ఉన్న ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తారన్నారు. సారా ప్రాజెక్ట్స్ మేనేజింగ్ పార్టనర్ జె.సాయినాథ్ వీటి నిర్వహణా భాధ్యతలు చూస్తారన్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఒక వ్యాపారవేత్త,ఒక ఉద్యోగి ఉండాలనే ముఖ్యమంత్రి కార్యాచరణకు అనుగుణంగా తృప్తి క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. 20వేల మంది డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా ఎదిగేలా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఫుడ్ సెక్టార్‌లో మహిళలకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. తృప్తి క్యాంటీన్ల ప్రారంభంతో డ్వాక్రా మహిళలు,కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్నా రని, వారు మంచి వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరంలో 11 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయని, వీటికి అనుగుణంగా డ్వాక్రా మహిళలతో నేడు తృప్తి క్యాంటీన్లు ప్రారంభించామన్నారు. ఈ క్యాంటీన్లలో రకరకాల ఫుడ్ ఐటెమ్స్, అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెపిపన విధంగా డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీటిని తీసుకొస్తున్నామన్నారు. నగరంలో ఇంకా రెండు తృప్తి క్యాంటీన్లు రాబోతున్నాయన్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అందించి రూ.10,88,550 లోన్ చెక్‌ను డ్వాక్రా మహిళలకు అందించారు. కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు రీజినల్ మేనేజర్ హర్జిత్ సింగ్,డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అభివృద్ధిను గడప గడపకూ తెలియజేయాలి

**పెనమలూరు జూలై26,ప్రభాతవార్త :** తొలిఅడుగులో డోర్‌టూడోర్ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ వారి నుండి సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గం దిశగా పనిచేయడమే సుపరిపాలనలో భాగమని పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ అన్నారు. శనివారం ఆయన పెదపులిపాకగ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో గ్రామంలో సుమారు రూ.2కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు మాదువూడిఅనకబేత్సవరావు,కోయా ఆనంద ప్రసాద్,దాసరి హరినీడు, మునుసూరి శ్రీధర్, సంఘపు రంగారావు, తుమ్మల రాంకుమార్, అబ్బుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.



# రామచంద్రాపురం ఎన్‌హెచ్-30పై ప్రయాణం నరకం

**ఎ కొండూరు, జూలై 26, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మైలవరం ఎ కొండూరు తిరువూరు జగదల్‌పూర్ జాతీయ రహదారి-30పై ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద 1కి.మీ ఎన్‌హెచ్ ఈ తుఫాన్ భారీ వర్షాలకు పెద్ద పెద్ద గుంతల్లో మోకాలి లోతు నీరు నిల్వ వుండటం 500 మీటర్ల వరకు చెరువును తలపిస్తూ వాహనదారులకు దడపుట్టిస్తూ ద్విచక్రవాహన దారులు ప్రమాదాలకు గురై, వాహనాలు పాడవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జాతీయ రహదారిపై మైలవరం మండలం బాడవ ఎన్‌హెచ్-30 టోల్ ప్లాజా అధికారులు మాత్రం ఈ జాతీయ రహదారి ప్రమాదాల గురించి తనకేమీ పట్టనట్లుగా నిర్లక్ష వైఖరితో ఉండటం పట్ల రహదారిపై ప్రయాణించే జుగుప్సాకరంగా ఉందని వాహనదారులు అధికారులతో వాగ్వాదానికి దిగడం గమనార్హం అవుతోంది. ఇటీవల జెసి ఇలక్కియ, ఆర్డీవో ఎన్‌హెచ్-30 అధికారులు, కూటమి నేతలు కలిసి అధ్వాన్న గుంటల రోడ్డును పరిశీలించి త్వరలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు విస్తరణ పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా పనులు ప్రారంభించకపోవడం అధికారుల మీనమేషాల వైఖరిని ఈ ప్రాంత ప్రజలు విమర్శించారు. ఇకనైనా ఈ జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే పూర్తి చేసి సర్వీస్ రోడ్డు నుండి కాపాడి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



## ఫైన్‌ఆర్ట్స్ విభాగానికి డ్రాయింగ్ బోర్డుల అందజేత

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై26, ప్రభాతవార్త:** వర్సిటీ సిఎస్ఆర్ సహకారంతో అబ్బూరి నారాయణరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఫైన్‌ఆర్ట్స్ విభాగానికి డ్రాయింగ్ బోర్డులను బహుకరించారు. రూ.11వేల విలువగల 15 బోర్డులను శనివారం తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహచలం సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ అబ్బూరి నారాయణ రావుకు రిజిస్ట్రార్ ధన్యవాదాలు తెలిపారు. లలితకళల ప్రాముఖ్యతను గుర్తించి ఫైన్ ఆర్ట్స్ విభాగానికి డ్రాయింగ్ బోర్డులు అందించారు. ఈ సందర్భంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం.సురేష్ కుమార్, సిఎస్ఆర్ తాత్కాలిక డైరెక్టర్ డాక్టర్ బబిత, సిఎస్ఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యం.వెంకట రమణ, ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ పి.దేవకాంత్, అధ్యాపకులు బి.జానీభాషాబాబు, విద్యార్థులు యుగంధర్, నరేష్, వరప్రసాద్, హెలెనా, సునీత, లిజిత సత్యశ్రీ పాల్గొన్నారు.

# విజయవాడ వార్త

## ఇద్దరు విద్యార్థుల బాధ్యత తీసుకున్న రాంప్రదీప్

**తిరువూరు, జులై 26, ప్రభాతవార్త :** తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ బాధితుల కోసం తొలిసారి ప్రత్యక్షంగా స్పందించిన వ్యక్తిగా మరియు ప్రస్తుత జన విజ్ఞాన వేదిక ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రాంప్రదీప్ కరోనా సమయంలో ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ సహకారంతో పదిమంది చిన్నారులకు సుమారు రూ.50లక్షలతో ముంబైలో అత్యంత ఖరీదైన గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు చేయించారు. ఏపి రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు కోడూరు గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కాకాటి మీనాక్షి, 3వ తరగతి చదువుతున్న మోదుగు వైష్ణవ నందన్'లను చదువులో ముందుకు సాగేందుకు తన వంతు కృషి చేస్తానని, ఆ ఇద్దరు విద్యార్థుల విద్యాబాధ్యత తాను తీసుకున్నట్లు శనివారం ఆయన తెలిపారు.



# గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే విజయవాడ ప్రజలకు ఇబ్బందులు

**-విజయవాడలో డ్రైన్ల ఆక్రమణలు తొలగించాలి**
**-తొలగింపుతో ఎవరైనా ఇళ్ళు కోల్పోతుంటే వారికి టిడ్కో ఇళ్ళు కేటాయిస్తాం**
**-ప్రజలను ఇబ్బంది పెట్టాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం కాదు**
**-వచ్చే వర్షాకాలం నాటికి విజయవాడ ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం**
**విజయవాడలో సుడిగాలి పర్యటన తర్వాత మంత్రి నారాయణ**

**విజయవాడ కార్పొరేషన్,జులై 26,ప్రభాతవార్త :** గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వద్ద విజయవాడ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి నారాయణ అన్నారు. నగరంలో డ్రైన్ల నిర్మాణాన్ని వైసిపి ప్రభుత్వం మధ్యలో నిలిపివేయడంతో వర్షపు నీరు బయటకు వెళ్ళకుండా అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. విజయవాడ నగరంలో అవుట్‌పాల్ డ్రైన్ల నిర్మాణంలో ప్రజలు ఇబ్బందులు తొలగిస్తామని మంత్ర పొంగూరు నారాయణ అన్నారు.



అవుట్‌పాల్ డ్రైన్ల్ ఆక్రమణలో ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. డ్రెయిన్లను ఆక్రమించడంలో వర్షపు నీరు నిల్వ ఉండిపోయి సమస్యలు వస్తున్నాయని అన్నారు. డ్రైన్ల ఆక్రమణలను వెంటనే మార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజయవాడ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడలో మ ంత్రి నారాయణ సుడిగాలి పర్యటన చేశారు. శనివారం ఉదయం నుంచి నగరం లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. గుణదల పుల్లేటికట్ట,దర్శిపేట,ఫకీరుగూడెంలో అవుట్‌ఫాల్ డ్రైన్లు,బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ దిగువన వర్షం నీరు నిల్వ ఉండే ప్రాంతాలతో పాటు ఆటోనగర్ లోని విఎంసి శాటిలైట్ స్టేషన్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. కొన్ని చోట్ల డ్రైన్లు వెడల్పుగా ఉండగా,మరి కొన్ని చోట్ల ఇరుకుగా ఉండటంపై అధికారులను ఆయన వివరణ అడిగారు. మరికొన్ని ప్రాంతాల్లో ఇళ్ళ నిర్మాణాలతో పాటు ప్రహరీగోడలకు అవుట్ పాల్ డ్రైన్లను ఆక్రమించి నిర్మించడాన్ని గుర్తించారు. అవుట్ ఫాల్ డ్రైన్లు ప్రవాహానికి ఇబ్బందిగా మారిన అక్రమ కట్టడాలు తొలగించాలని విఎంసి కమీషనర్ ధ్యానచంద్రను ఆదేశించారు. విజయవాడ సిటీలో వర్షపు నీరు బయటకు వెళ్ళేలా డ్రైనేజీల నిర్మాణానికి 2014-19 మధ్య కాలంలో 500 కోట్లతో పనులు ప్రారంభించిన 55 శాతం పూర్తి చేసామన్నారు. అయితే గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రారంభించాం.ఆ పనులను నిలిపివేసింది...దీంతో వర్షపు నీరు సిటీలో నుంచి బయటకు వెళ్ళలేని పరిస్థితి ఎదురవుతుంది. మరోవైపు చాలా చోట్ల డ్రైన్లు ఆక్రమణకు గురయ్యాయి. 10 అడుగటులు ఉండాల్సిన చోట డ్రైన్లు 2 అడుగులు మాత్రమే ఉన్నాయి. ఇలాగైతే నీరు బయటకు ఎలా వెళ్తుందని మంత్రి నారాయణ ప్రశ్నించారు. అందుకే ఆక్రమణలను మార్కింగ్ చేసి డ్రైన్లు వెడల్పు చేయాలని కమీషనర్‌ను ఆదేశించారు. ఆక్రమణలు ఉన్న చోట స్థానిక ప్రజాప్రతినిధులు వారితో మాట్లాడతారు. ఎవరైనా ఇళ్ళు కోల్పోతుంటే వారికి టిడ్కో ఇళ్ళు కేటాయిస్తాం.పేదలను ఇబ్బంది పెట్టాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని,..కాని ప్రజల ఇబ్బందులు తొలగించాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విఎంసీ,సీఆర్డీయే నిధులతో విజయవాడలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు చేస్తామన్నారు. సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేసి వచ్చే వర్షాకాలం నాటికి విజయవాడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

**బుడమేరు ఆక్రమణలపై త్వరలో నిర్ణయం**

బుడమేరు ఆక్రమణలపై ఇరిగేషన్ సాంకేతిక కమిటీని నియమించిందని, ఆ కమిటీ త్వరలో నివేదిక ఇస్తుందన్నారు. అయితే బుడమేరును వెడల్పు చేయడమా...లేక గట్టు ఎత్తు పెంచడమా అనే దానిపై కూడ టెక్నికల్ కమిటీ పరిశీలిస్తుందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. మంత్రి నారాయణ విజయవాడ పర్యటనలో ప్రజారోగ్య విభాగం ఇంజనీర్ ఇన్ ఛీఫ్ ప్రభాకర్,విజయవాడ నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర,విఎంసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్‌రెడ్డి,ఇతర ఇంజనీర్లు,స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ములగపాటి బాబు మృతి తెదేపాకు తీరని లోటు

## ఎంపి కేశినేని చిన్ని,ఎమ్మెల్యే కె శ్రీనివాస్

**ఎ కొండూరు, జులై 26, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో ములగపాటి బాబు-32 అనే యువకుడు జ్వరంతో శనివారం ఉదయం మృతి చెందాడు. బాబు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పార్థివ దేహంపై పార్టీ జెండా కప్పి ఘన నివాళులర్పించారు. బాబు టిడిపికి చేసిన సేవలు మరువలేమని ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం సానుభూతి తెలిపారు. బాబు కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు గడ్డి కృష్ణారెడ్డి, అలవాల రమేష్‌రెడ్డి, మోర్ల తిరుపతిరావు, బెజవాడ శంకర్, కొండెపాటి సుబ్బారావు, జంగా స్టాలిన్, మేకల జాన్, షేక్ కరీముల్లా, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



**ఎంపి, ఎమ్మెల్యే నివాళి :**

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం సాయంత్రం బాబా మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళాశాల ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ సూర్యతేజ

**ఎ కొండూరు, జులై 26, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కలిశెట్టి సూర్యతేజ ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల / కళాశాలను శనివారం ఆకస్మిక విజిట్ చేశారు. ఈ ఆకస్మిక సందర్శన సందర్భంగా పాఠశాల / కళాశాల పరిసరాలను విద్యార్థుల డార్మిటరీలను భోజనశాలను బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. కళాశాల పరిసరాల పరిశుభ్రత విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించి ప్రిన్సిపాల్ సిద్ధయ్య, సిబ్బందికి విద్యార్థులకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సూర్యతేజ కొన్ని సూచనలు చేసి పారిశుధ్య కార్మికుల పనితీరును ప్రిన్సిపాల్ సిబ్బంది పనితీరు బేషుగ్గా ఉందని ప్రిన్సిపాల్ కె.సిద్ధయ్యను సిబ్బందిని అభినందించారు.



# ప్రపంచంలో మొదటి ఇంటర్‌కాంటినెంటల్ కార్డియాక్ రోబోటిక్ సర్జరి విజయవంతం

**విజయవాడ, జూలై 26, ప్రభాతవార్త :** ప్రపంచ వైద్య రంగంలో ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్ చారిత్రాత్మకమైన స్వదేశీగా అభివృద్ధి చేసిన ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టం ద్వారా రెండు క్లిష్టమైన ఇంటర్‌కాంటినెంటల్ రోబోటిక్ టెలీ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామని ఎస్ఎస్ ఇన్నోవేషన్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌లో జరిగిన సొసైటీ ఆఫ్ రోబోటిక్ సర్జరీ వార్షిక సమావేశంలో రెండు దేశాల వైద్య బృందాలను అనుసంధానిస్తూ ఫ్రాన్స్‌లోని స్ట్రాస్‌బర్గ్‌లో వున్న ఐఆర్‌సిఏడి ప్రధానకేంద్రం నుండి భారత్‌లోని ఇండోర్లో వున్న శ్రీ అరబిందో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ , ఐఆర్‌సిఏడి నేషనల్ సెంటర్‌కు నిర్వహించిన ఈ ఇంటర్‌కాంటినెంటల్ టెలీ సర్జరీలు ఎస్ఎస్ఐ మంత్ర వ్యవస్థ ఖచ్చితమైన శస్త్రచికిత్సను ఖండాంతరాల్లో అందించే శక్తిని నిరూపించిందన్నారు.

# విజయవంతంగా ఎసిటాబులం కోర్స్

**విజయవాడ, జూలై 26, ప్రభాతవార్త :** యువ సర్జన్ల నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన ఎసిటాబులం కోర్స్ విజయవంతంగా జరిగింది. విజయవాడ ఆర్థోపెడిక్ సొసైటీ సౌజన్యంతో జరిగిన ఈ జాతీయస్థాయి వైద్య సదస్సులు పలు రాష్ట్రాలకు చెందిన 200 మంది యువ వైద్యులు, పిజి వైద్య విద్యార్థులు పాల్గొని పలు అంశాలపై వర్క్‌షాప్‌లు, లైవ్ ప్రజంటేషన్లు సమర్పించారు. ఈ సందర్భంగా తుంటికీలు శస్త్రచికిత్సకు, అత్యాధునికవైద్య విధానాలపై పలువురు వైద్య నిపుణులు ప్రసంగించారు. సదస్సులో పాల్గొన్న వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఎసిటాబులం కోర్సు ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా బెజవాడ అప్పారావు మాట్లాడుతూ ఆధునిక శస్త్రచికిత్స నైపుణ్య సాధనకు యువవైద్యులకు ఇది మహత్తర అవకాశమన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్థోపెడిక్ సొసైటీ ప్రెసిడెంట్ డా ఎంజె నాయుడు, సెక్రటరీ డా కర్లపూడి వాసు, డా హరిశర్మ, డా కాషా శ్రీనివాస్, డా అతుల్‌పాటిల్, డా సునీల్‌గవాస్కర్ వంటి పలు రాష్ట్రాల్లోని ప్రముఖ డాక్టర్లు పాల్గొన్నారు.




# పియాజియో నుండి అపె ఎలక్ట్రిక్ వాహనాలు

**విజయవాడ, జూలై 26, ప్రభాతవార్త :** అపె ఎలక్ట్రిక్ ఈవి శ్రేణి వాహనాలు అపె ఇసిటి అల్ట్రా, అప ఇ సిటీ ఎఫ్ఎక్స్ మాక్స్ అనే రెండు త్రీవీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్లో ఆవిష్కరించినట్లు పియాజియో వెహికల్స్ ప్రై లి. ఛైర్మన్ అండ్ ఎండి డియెగో గ్రాఫీ వెల్లడించారు. అత్యుత్తమ పనితీరుతో పూర్తి మెటల్‌బాడీ, అధునాతన 10.2కె డబ్ల్యుహెచ్ఎల్ఐపి బ్యాటరీ, తెలివైన టెలిమ్యాటిక్స్‌తో అందిస్తున్నామన్నారు. తక్కువ బ్యాటరీ క్షీణత, బలమైన పనితీరు, కనీస నిర్వహణ ఖర్చులు అపె వాహనాల ప్రత్యేకత అన్నారు.

# నగరంలో డీ సిల్టింగ్ పనులు నిరంతరాయంగా చేస్తుండాలి : కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,జులై 26,ప్రభాతవార్త:** నగరంలో డీ సిల్టింగ్ పనులను నిరంతరాయంగా చేస్తుండాలని నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. శనివారం పర్యటనలో భాగంగా బందరురోడ్డు,నిర్మల కాన్వెంట్ రోడ్,పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు,ఎన్టీఆర్ సర్కిల్,ఏలూరు రోడ్,ఒన్‌టౌన్ లో బ్రిడ్జి,బిఆర్పీ నెహ్రూ రోడ్,పంజా సెంటర్,కృష్ణవేణి క్లాత్ మార్కెట్ ప్రాంతాలన్నీ పర్యటించి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా ఉండేందుకు నగరంలో మాన్సూన్ రెస్పాన్స్ టీం ఏర్పాటు చేసినప్పటికీ,డీ సిల్టింగ్ పనులు నగరంలో నిరంతరాయంగా జరుగుతుండాలని కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద జరుగుతున్న డీ సిల్టింగ్ పనులను ఆయన పరిశీలించారు. డివి మేనర్ రోడ్ వద్ద ప్యాచ్ వర్క్ పూర్తి చేయాలని గుంతలను త్వరగా పూడ్చాలన్నారు. నగరంలో వీధి వ్యాపారులు జోనింగ్ పూర్తి స్థాయిలో చేసే వారికి జోన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పాడైపోయిన ఫుట్‌పాత్‌లను త్వరగా మరమ్మత్తులు చేయాలని,జమ్మి చెట్టులో వర్షపు నీరును బందరు రోడ్డు వైపు మళ్ళించేందుకు చర్యలు తీసుకునేటట్లు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సైనేజ్ బోర్డులను ప్రతి చోట అమలుపర్చాలని, ప్రతి జంక్షన్ సంపూర్ణంగా కనిపడేటట్లు సైనేజ్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయమని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. లో బ్రిడ్జి వద్ద గల బ్రిడ్జి పాడైపోవడం గమనించి ఇంజనీరింగ్ అధికారులు త్వరగా మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ వారితో సమన్వయం చేసుకొని త్వరగా ఆ పనిని పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి కృష్ణలంక,సాయిబాబా గుడి వద్ద గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో ఎటువంటి మరమ్మత్తుల్లేకుండా చూసుకోవలని అన్న క్యాంటీన్‌లో పారిశుద్ధ నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, వ్యర్థ నిర్వహణ సక్రమంగా జరగాలని, ప్రతి అన్న క్యాంటీన్‌లో మూడు రంగుల చెత్త బుట్టలను పెట్టాలని అధికారులను ఆదేశించారు.



# ప్రారంభమైన అష్టబంధన జీర్ణోద్ధారణ మహా సంప్రోక్షణ

**విజయవాడ,జులై 26,ప్రభాతవార్త:** టిటిడికి అనుబంధంగా ఉన్న విజయవాడ,పున్నమితోట లోని టిటిడి,వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం నుండి అష్టబంధన జీర్ణోద్ధారణ మహా సంప్రోక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి అష్టబంధన మహా సంప్రోక్షణ చేపట్టడం ఆచారంగా వస్తోంది. ఉదయం 8.30 గంటల నుండి 10.30 వరకు ఆచార్యవరణం, వాస్తు శాంతి,అకల్మష హోమంను వేదపండితులు నిర్వహించారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 వరకు మృత్సంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావు,లలిత,తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు,ప్రధాన అర్చకులు మురళీకృష్ణ,శశికిరణ్,భక్తులు,న్యాయవాదులువిజయ్‌కుమార్,పడవల ఏడుకొండలు,ప్రసాద్,వేణు, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి,చిన్నాదేవి,శివశ్రీ,శాంతిశ్రీ, తులసి,కిట్టు, రాజేశ్వరి,పూజారి ఆనంద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# బాలుడికి పునర్జీవితాన్నిచ్చిన రియాఆర్థో ఆసుపత్రి వైద్యులు

**పెనమలూరు జూలై26,ప్రభాతవార్త :** ఆస్ట్రోజెనెసిస్ ఇంపెర్ఫెక్టా అనే అరుదైన ఎముకల వ్యాధితో బాధపడుతున్న ప్రదీప్(14) బాలుడికి ఐదుసంవత్సరాల తర్వాత నడిచే అదృష్టం కలిగించడంతో ఆకుటుంబంలో వెలుగులు నింపారు రియాఆర్థోపెడిక్ హాస్పిటల్ వైద్యులు.ఈ సందర్భంగా శనివారం వైద్యులు డాక్టర్ కాట్రగడ్డ సాయికృష్ణ మాట్లాడుతూ ఇది చిన్నపిల్లల్లో వచ్చే అరుదైన వ్యాధిఅని దీనిద్వారా చిన్నారుల ఎముకలు తెలుపుగా మారి విరిగిపోతూ ఉంటాయని అలాగే మరల అతుక్కుంటూ ఉంటాయని ఈ క్రమంలో కాళ్ళువంగి పోవడం జరుగుతుందని తద్వారా వారు నడకకు కూడా దూరం అవుతారని తెలిపారు. పేదవాడైన ప్రదీప్‌కు రియాఆర్థోపెడిక్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కాట్రగడ్డ సాయికృష్ణ మూడుసంవత్సరాలుగా ఆపరేషన్‌లు నిర్వహిస్తూ నిర్విరామకృషితో ప్రదీప్‌కు పునర్జీవితం ప్రసాదించారని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# విజయవాడలో ఇకోలక్స్ డైమండ్స్ షోరూం ప్రారంభం

**విజయవాడ, జూలై 26, ప్రభాతవార్త :** ప్రముఖ డైమండ్ వ్యాపార సంస్థ ఇకోలక్స్ తమ మొదటి ఫ్లాగ్‌షిప్ లాబ్ గ్రౌన్ డైమండ్ జ్యూయలరీ స్టోర్‌ను విజయవాడలో శనివారం ప్రముఖ నటి తేజస్వి మామిడాడ ప్రారంభించారు. ఈ సందర్భంగ షోరూం స్థాపకులు సిద్దాంత్ సంఘ్వీ, ప్రతిక్ కొఠారిలు మాట్లాడుతూ అన్ని వయస్సులవారికి గ్లామర్, సంప్రదాయాల మేళవింపుతో కూడిన కలెక్షన్స్ అందిస్తామన్నారు. తమ స్వంత మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లో నిపుణులతో రూపొందించిన డైమండ్ జ్యూవలరి అందిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 10 రిటైల్‌స్టోర్లు ప్రారంభిస్తామన్నారు. విజయవాడ షోరూం ప్రారంభం సందర్భంగా జూలై 31వరకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో గోల్డ్‌మెడల్ డైరెక్టర్ అంజుదేవి, లక్ష్మిపాఇ, లలితాపాఠి, దారా కరుణశ్రీ వంటి ప్రముఖులు పాల్గొన్నారు.

# సంపన్నులు మానవతా ధృక్పధంతో పి4లో భాగస్వాములు కావాలి

## సుపరిపాలన కార్యక్రమంలో పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై26, ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి మానసపుత్రిక పి4 పథకం, పేదలను ఆర్థికంగా స్థితిమంతులను చేయాలన్న ధృడచిత్తంతోనే ఆయన మార్గదర్శుల సేవలను





కోరుతున్నారని, సంపన్నులు మానవతా ధృక్పధంతో పేదల సేవలో భాగస్వాములు కావాలని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని 25,26,27,28,29 వార్డులలో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రత్తిపాటి ఈ సందర్భంగా తెలిపారు. గత పాలకుల విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని, చంద్రబాబు ఏడాదిలో గాడిలో పెట్టారు, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో పరుగులు పెట్టిస్తున్నారు గత పాలకుల విధ్వంసంతో కోలుకోలేని విధంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఏడాదిలో చంద్రబాబు గట్టెక్కించారని, ఇంకా అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించే దిశలో పాలన కొనసాగిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. త్వరలోనే ప్రభుత్వం కొత్త ఫించన్లు మంజూరు చేయనున్నదని ప్రత్తిపాటి వివరించారు. భర్తలను పోగొట్టుకున్న ప్రతి వితంతువుకి ఫించన్ అందుతుందని అన్నారు. ఆగస్టు 15నుంచి ప్రారంభమయ్యే ఉచిత బస్ ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. యువతకు ఉపాదే లక్ష్యంగా పలు కంపెనీలతో ఒప్పందాలు, పెట్టుబడుల సాధన దిశగా ప్రభుత్వం కీలకనిర్ణయాలు తీసుకుంటుందని ప్రత్తిపాటి చెప్పారు. త్వరలోనే నిరుద్యోగ యువతకు నెలవారీ భృతి అందించనున్నదని అన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఎస్‌సి,ఎస్‌టి యువతకు ఇప్పటికే ప్రభుత్వం ఉచిత శిక్షణను అందిస్తుందని అన్నారు. సుపరిపాలన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించిన ప్రత్తిపాటి అక్కడే అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు, రోగాలు ప్రబలకుండా వార్డులలో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. మురుగునీరు,వర్షపునీరు రోడ్లపైకి చేరకుండా ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా,టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు,యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు,మున్సిపల్ కమీషనర్ పతి శ్రీహరిబాబు,టిడిపి నాయకులు ఇనంటి జగదీష్‌బాబు పఠాన్ సమద్‌ఖాన్, జవ్వాజి మదన్‌మోహన్, మద్దుమాల రవి, కందుల రమణ, మద్దిబోయన శివ, బేరింగ్ మౌలాలి, మురకొండ మల్లిబాబు, కొత్త కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగు మహిళా నాయకులు అమరా రమాదేవి, పోపూరి లక్ష్మీ, అద్దంకి అనితాబాయి, ఆయా వార్డులకు చెందిన పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

## రోటరి ప్రజా వైద్యశాలకు లక్ష రూపాయిలు విలువచేసే మందులను అందచేసిన రోటరి డైరక్టర్ ముత్తినేని

**చిలకలూరిపేట, జులై26, ప్రభాతవార్త:** రోటరి కమ్యూనిటి హాల్‌లో నిర్వహిస్తున్న రోటరి ప్రజా వైద్యశాలకు రోటరి క్లబ్ మాజీ అధ్యక్షుడు, జిల్లా ఇంటర్‌క్లబ్ రిలేషన్ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు శనివారం లక్ష రూపాయిలు విలువచేసే మందులను అందచేశారు. ఈ రోటరి ప్రజా వైద్యశాల ద్వారా ప్రతి రోజు పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలను డాక్టర్



కందుల రంగారావు నిర్వహించి ఉచితంగా మందులను నిర్విరామంగా అందచేస్తున్నారు. ఈ మందులను కేవలం రోటరి క్లబ్‌లో సభ్యులుగా ఉన్న వారి సహాయ సహకారాలతో నడుపుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రోటరి డైరక్టర్ ముత్తినేని వెంకటేశ్వర్లు లక్షరూపాయిలు విలువచేసే మందులను క్లబ్ అధ్యక్షులు ఉప్పుటూరి ప్రసాద్, కార్యదర్శి బోడి రామసుబ్బారావులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో రోటరి డైరక్టర్లు దండా లక్ష్మీనారాయణ, గళ్లా సాంబశివరావు, గోగినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్తినేనిని క్లబ్ డైరక్టర్లు అభినందించారు.

## మాజీమంత్రి విడదల రజినిను మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా వైకాపా ఎస్సీసెల్ విభాగ నాయకులు

**చిలకలూరిపేట, జులై26, ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా వైఎస్ఆర్‌సిపి ఎస్‌సి సెల్ విభాగ అధ్యక్షుడు కొమ్మూరి



చంద్రశేఖర్, ఆ విభాగానికి చెందిన సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా పట్టణంలోని మాజీమంత్రి విడదల రజిని నివాసంలో ఆమెను కలుసుకొని శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె ఎస్‌సి సెల్ విభాగానికి సంబందించి ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ పార్టీ నిర్వహించనున్న అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని కోరారు.

# దొంగల ముఠా అరెస్టు

## రూ.10,00,000 విలువ గల బంగారు, వెండి ఆభరణాలు, నగదు సీజ్

**కర్లపాలెం, జులై26, ప్రభాతవార్త:** అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామంలోని పిట్ల పెద వెంకట రెడ్డి ఇంటిలో రూ.10లక్షల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు,



వస్తువులు, నగదును ముద్దాయిలు దొంగిలించారు. దొంగతనాలకు పాల్పడిన ముఠాను శుక్రవారం సాయంత్రం బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.హరి కృష్ణ అరెస్ట్ చేసినారు. శనివారం కర్లపాలెం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాపట్ల డిఎస్పీ జి.రామాంజనేయులు ముద్దాయిల అరెస్ట్ కు సంబందించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన పిట్ల పెద వెంకట రెడ్డి ఖాజీపాలెం నందు ఆర్.ఎమ్.పి డాక్టర్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జూలై 17 న రాత్రి 6 గంటలకు భార్యాభర్తలు ఇరువురు ఇంటికి తాళం వేసి పాండిచ్చేరిలోని తన కూతురు వద్దకు వెల్లారన్నారు. జూలై 21 ఉదయం 7 గంటల సమయంలో ఫిర్యాది ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన అతడి తమ్ముడు సమాచారం ఇవ్వడంతో, మరుసటి రోజు ఫిర్యాది వచ్చి ఇంటి తలుపులు తెరచి చూడగా ఇంటి వెనుక తలుపు తాలాలు తీసి ఉండటాన్ని గమనించారు. అంతేకాక బెడ్ రూమ్ ఉన్న ఇనుప బీరువా లాకర్ బ్రేక్ చేసి ఉన్నట్లు చూసి, వారు లాకర్ లో పెట్టిన బంగారం, వెండి వస్తువులు మరియు 5 వేల రూపాయలు నగదు మొత్తం రూ.10,00,000/ విలువ గల సొత్తును గుర్తు తెలియని వ్యక్తులు అపరహరణకు గురైనట్లు గమనించి కర్లపాలెం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇచ్చినారు. పిర్యాదు ఇచ్చిన రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు, బాపట్ల డిఎస్పీ సూచనల మేరకు బాపట్ల రూరల్ సిఐ హరి కృష్ణ కేసు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని కర్లపాలెం ఎస్.ఐ రవీంద్ర వారి సిబ్బంది సహకారంతో నేరానికి పాల్పడిన ముద్దాయిల ముఠాను జూలై 25న శుక్రవారం సాయంత్రం 5.15 గంటల సమయంలో బాపట్ల పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద అరెస్ట్ చేశారన్నారు. జన దివ్య శేఖర్ (40), మరుప్రోలు నాగేంద్రరెడ్డి (27), లంక హర్షవర్ధన్ (40) లను సంబంధిత న్యాస్థానం లో హాజరు పరిచారు. ప్రధాన నిందితుడు పులి సురేష్ పరారీలో ఉన్నాడన్నారు. అతడి ఆచూకీ కోసం పోలీస్ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

ముద్దాయిలందరూ రాజమండ్రి సెంటర్ జైలులో పరిచయం ఏర్పడి స్నేహితులుగా మారారన్నారురు. వారు జల్సాలకు అలవాటుపడి డబ్బులకోసం దొంగతనాలకు పాల్పడుతూ ఉంటారు. వీరు రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని, రాత్రి వేళల్లో తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడతారు. జూలై 17 న ఫిర్యాది ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన ముద్దాయిలు పథకం ప్రకారం ఇంటి వెనుక వైపు తాళాన్ని పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువా లాకర్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును దొంగిలించుకొని వెళ్ళి పోయినారు. ప్రధాన ముద్దాయి పులి సురేష్, జన దివ్య శేఖర్, మరుప్రోలు నాగేంద్రరెడ్డి లకు రాజమండ్రి సెంట్రల్ జైలు లో పరిచయం ఏర్పడి వీరు ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. జన దివ్య శేఖర్ పై రాజానగరం పోలీస్ స్టేషన్ లోని 4 కేసులలో ముద్దాయిగా ఉన్నాడు. మరుప్రోలు నాగేంద్రరెడ్డి చీరాల 2టౌన్, కోటనందూరు పోలీస్ స్టేషన్ లలో గంజాయి సంబంధిత కేసులలో ముద్దాయిగా ఉన్నాడు. ముద్దాయిల నుంచి 117 గ్రాముల బంగారు ఆభరణాలు , 550 గ్రాముల వెండి ఆభరణాలు, వస్తువులు . రూ.5,000/ నగదు స్వాదినం చేసుకున్న చోరీ సొత్తు మొత్తం విలువ రూ.10,00,000 స్వాదీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరిచిన బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరి కృష్ణ, కర్లపాలెం ఎస్.ఐ రవీంద్ర, స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఐపీఎస్ ప్రత్యేకంగా అభినదించారు.

# శ్రీమేధలో ఉల్లాసభరితంగా ప్రెషర్స్ డే వేడుకలు


గుంటూరు విద్య, జూలై 26, ప్రభాతవార్త : అవగాహనతో కూడిన అభ్యసనం ద్వారా విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత శిఖరాలు



అధిరోహించడానికి సాధ్యమవుతుందని శ్రీమేధ విద్యసంస్థల డైరెక్టర్ అన్నా నందకిషోర్ అన్నారు.స్థానిక కొత్తపేటలోని పచి ్చపులును కళ్యాణ మండపంలో శ్రీమేధ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను ఉల్లాసంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమేధ విద్యాసంస్థలు స్థాపించి ఇప్పటికి 20సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు.20ఏళ్ళ క్రితం సిఏ,సిఎంఏ లు చదవడానికి అప్పటి మద్రాస్ వెళ్ళి అభ్యసించాల్సి వచ్చేదని,స్వానుభవంతో ఈ కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి శ్రీమేధ విద్యాసంస్థలు స్థాపించామన్నారు.ఈ 20ఏళ్ళ ప్రస్థానంలో తాము సాధించిన విజయాలకు సహకరించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యఅతిధిగా విచ్చేసిన సిఏ హరనాధ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆటవిడుపు కోసం నిర్వహించే ఫ్రెషర్ ్స డే కార్యక్రమాల వల్ల వారికి ఉల్లాసాన్ని ఇవ్వడంతోపాటు సీనియర్ జూనియర్ విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.ఆటల పోటీల్లో విజేతలకు పతకాలు,ఇంటర్ స్టేట్ టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ వేడుకల్లో విద్యాసంస్థల డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మీతోపాటు బోదన,బోధనేతర సిబ ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్టిఫికెట్‌ల పరిశీలన

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై26, ప్రభాతవార్త: వర్సిటీలోని డాక్టర్ వై.యస్.ఆర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బి.టెక్ ప్రవేశాల్లో భాగంగా సీట్లు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్‌ల పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. శనివారం తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ చంద్రమౌళిలు కౌన్సెలింగ్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడి ప్రవేశాలు పొందిన విద్యార్థులతో, వారి తలిదండ్రులతో ముచ్చటించారు. వర్సిటీని ఎంపికచేసుకోవడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేసి న్యాయమైన విద్యను ఇక్కడ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు



అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కౌన్సెలింగ్‌కు వచ్చే వారికి సివిల్ అండ్ మెకానికల్ బ్లాక్‌లో ఏర్పాట్లు చేశారు.

## అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలిచిన విన్నకోట సురేష్

**కర్లపాలెం, జులై25, ప్రభాతవార్త:** మండల పరిదిలోని గణపవరం పంచాయతీ పరిధిలోని ఉర్లమ్మ ఎస్టీ కాలనీలో ఇటీవల అగ్నిప్రమాదానికి గురై పూరి గుడిసెను కోల్పోయిన నిరుపేద గిరిజన దంపతులు నక్కా కోటయ్య, ఉర్లమ్మలకు, జనసేన పార్టీ అండగా నిలిచింది. జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గం నాయకులు విన్నకోట సురేష్ శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి, పార్టీ తరపున ఆర్థిక, వస్తు రూపంలో సహాయం అందజేశారు.



ప్రమాదవశాత్తు దగ్ధమైన గృహాన్ని పరిశీలించిన విన్నకోట సురేష్, బాధితులకు రూ. 16,000 నగదుతో పాటు, మినీ గ్యాస్ సిలిండర్‌తో కూడిన స్టవ్, వంటపాత్రలు, బియ్యం, నిత్యవసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నక్కా కోటయ్య, ఉర్లమ్మ, దంపతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, అలాగే స్వచ్ఛంద సంస్థలు కూడా వారికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కర్లపాలెం మండలం అధ్యక్షుడు, మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్ర, జనసేన నాయకులు తిరుమలశెట్టి దయాసాగర్, కారుమూరి ఆంజనేష్, గరిగంటి శ్రీనివాస్ రావు, రాంబాబు, సురినేని రాజేష్, గురాల రామారావు, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షురాలు ఇనగంటి సునీత, జనసేన, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖాధికారిగా వి.శివబాబు బాధ్యతలు

**పిట్టలవానిపాలెం. జులై26, ప్రభాతవార్త:** పిట్టల వాని పాలెం మండల విద్యాశాఖ అధికారిగా ఎస్ వి శివ బాబు బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్‌వి. శివ బాబును



రీజనల్ జాయింట్ డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు పిట్టల వాని పాలెం మండల విద్యాశాఖ అధికారి ఇన్చార్జి గా బాధ్యతలను శనివారం నాడు చేపట్టారు.

## సంగుపాలెం కోడూరు గ్రామంలో పల్లెనిద్ర

**పిట్టలవానిపాలెం, జులై26, ప్రభాతవార్త:** అసాంఘిక కార్యక్రమాలు చేపట్టిన, చట్టవ్యతిరేఖ కార్యక్రమాలు చేసిన చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకొంటామని చందోలు ఎస్ ఐ ఎం వెంకట శివకుమార్ అన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని సంగుపాలెంకోడూరు గ్రామంనందు పల్లె నిద్ర కార్యక్రమాన్ని



నిర్వహించారు.. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొందన్నారు. గ్రామ సమస్యలు ఏమైనావుంటే పరిష్కరించగలమని హామీ ఇచ్చారు.గ్రామాలలో రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని, గ్రామస్తులు అందరు సహృదయంతో కలసిమెలసి జీవించాలన్నారు.. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు, గ్రామనాయకులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆదర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత మెగా "ఐ" క్యాంప్

**గుంటూరు విద్య, జూలై 26, ప్రభాతవార్త :** సృష్టించి వీక్షించే నేత్రాల రక్షణకై శ్రద్ధ వహించాలని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు



ఆదర్శ్ అధ్యక్షురాలు మన్నె అనురాధ పేర్కొన్నారు.స్థానిక ఎస్.వి.ఎన్.కాలనీ వద్ద గల చిన్మయ విద్యాలయ ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్ ్స ఆధ్వర్యంలో,గుంటూరు సుదర్శిని కంటి ఆస్పత్రి సహాకారంతో విద్యార్థులకు ఉచిత మెగా ఐ క్యాంపు నిర్వహించారు.క్యాంపులో పాల్గొన్న పరిసర ప్రాంత పాఠశాలల విద్యార్థులకు ఆధునిక కంటి వైద్య పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహించారు.గుంటూరు జిల్లా రోటరీ క్లబ్ ఆదర్శ్ కార్యదర్శి నందిపాటి వాణీకుమారి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్లు,కంప్యూటర్లు ఉపయోగించడం ద్వారా కంటి సమస్యలు పెరుగుతున్నాయని, పిడిఎఫ్‌ల రూపంలో ఉన్న పాఠ్యాంశాలను సెల్‌ఫోన్‌లలో చదవడం పూర్తిగా నిషేదించాలని ఆమె పేర్కొన్నారు.పేద విద్యార్థుల నేత్ర లోపాలను నివారించేందుకు రోటరీ క్లబ్ ఆదర్స్ ద్వారా ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసేందుకు తాము సిద్దంగా ఉన్నామని సుదర్శిని కంటి ఆస్పత్రి డైరెక్టర్,రోటేరియన్ డాక్టర్ దుర్గా చైతన్య పేర్కొన్నారు.కార్యక్రమంలో రోటేరియన్ అశోక,సదర్శిని కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి కబరస్తాన్ కమిటీ ఆర్ధిక సహాయం

**రొంపిచర్ల, జూలై 26 ప్రభాతవార్త :** పేద కుటుంబానికి కబరస్తాన్ కమిటీ ఆర్థిక సహాయం శనివారం ఆర్థిక సహాయం అందజేసింది. వివరాలను కమిటీ అధ్యక్షులు షేక్ మీరావలి తెలియజేశారు. షేక్ మస్తాన్‌షరీఫ్ తీవ్ర అనారోగ్యంతో మరణించారని తెలిపారు. పేద కుటుంబం కావడంతో పాటు బంధువుల సహకారం లేకపోవడంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సమాచారం తెలుసుకొని వారికి సహాయం అందించాలని కబరస్తాన్ కమిటీకి సూచించారు. మట్టి ఖర్చుల నిమిత్తం కమిటీ సభ్యులు ఆర్థికసహాయం చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ గఫూర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

**యడ్లపాడు, జులై 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలోని సంగం డైరీ పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో 2024,25ఆర్థిక సంవత్సరంలో బోనస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రూపాయల విలువ కలిగిన పాలకు 8రూపాయల బోనస్ మొత్తం



3,22,875రూపాయలను ఉత్పత్తిదారులకు పంపిణీ చేశారు. సంగం డైయిరీ నుండి 74597రూపాయలు, సొసైటీ నుండి 248278రూపాయలు కలిపి ఇవ్వటం జరిగిందన్నారు. ఈ బోనస్ పాల ఉత్పత్తిదారులకు ఆర్థికంగా ఊతమిచ్చినట్లు అవుతుందని ముఖ్యఅతిధిగా విచ్చేసిన తిమ్మాపురం సొసైటీ అధ్యక్షులు, సంగం డైయిరీ డైరెక్టర్ పావులూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా జోనల్ మేనేజర్ కె సురేష్ బాబు పాల్గొని ప్రసంగించారు. పాల ఉత్పత్తిదారుల శ్రమను గౌరవించడమే ఈ బోనస్ ఉద్దేశ్యమని, సంగం డైయిరీ పాలకవర్గం సాయంతో పాల ఉత్పత్తిదారుల అనేక సంక్షేమ కార్యక్రమాలు, వెటర్నరీ సర్వీసెస్ కూడా విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రొంపిచర్ల ఇంచార్జీ ఎన్‌వి కిరణ్, సూపర్ వైజర్ పి కార్తీక్‌బాబు, సెక్రటరీ కె రంగారావు, పాలు ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమీషనర్ ఆదేశాలతో ప్లాసిక్ నిరోధానికి పట్టణంలో విస్తృత తనిఖీలు చేసిన అధికారులు

చిలకలూరిపేట, జులై26, ప్రభాతవార్త: ప్లాస్టిక్ నిరోధించటానికి మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు ఆదేశాలమేరకు శనివారం పట్టణంలోని



1వ డివిజన్‌లో పారిశుధ్య అధికారి సిహెచ్ రమణ రావు ఆధ్వర్యంలో సిబ్బంది విస్రత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దుకాణాలలో ప్లాసిక్ వస్తువులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, బాక్స్‌లు, గ్లాసులు స్వాధినం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు వ్యాపారులకు ప్లాస్టిక్ నిషేదంపై పలుమార్లు అవగాహన కల్పించినా నియమాలు పాటించకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు షాపుల యజమానులకు అపరాధ రుసుం విధించారు. మరోసారి నిషేదిత ప్లాస్టిక్‌తో పట్టుబడిగే వ్యాపార అనుమతుల కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిషేదిత ప్లాస్టిక్ నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అనుసారం పలు మార్లు ప్లాస్టిక్ క్రయవిక్రయాలు జరిపేవారు ప్లాస్టిక్ నిరోదకానికి సహకరించాలని కోరారు. కొనుగోలు దారులు కూడా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరుతూ అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృతంగా పురపాలక సిబ్బంది తెలియచేస్తున్నారు. ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ చిలకలూరిపేటగా తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామని పారిశుధ్య అధికారి సిహెచ్ రమణరావు ఈ సందర్భంగా తెలిపారు.

## ఎన్‌సిసికి గణపవరం హైస్కూల్‌కు చెందిన 51మంది విద్యార్థిని, విద్యార్థులు ఎంపిక

**నాదెండ్ల, జులై26, ప్రభాతవార్త:** గణపవరం గ్రామంలోని కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్‌సిసిలో చేర్చుకునేందుకు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులలో 51మందిని ఎంపిక చేశారు. వీరిలో 30మంది బాలురుకాగా 21మంది బాలికలను



ఎన్‌సిసి క్యాడెట్లుగా ఎంపిక చేశారు. ఈ ఎంపిక కార్యక్రమాన్ని ఎన్‌సిసి అధికారి మహ్మద్ రసూల్ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణానాయక్ అభినందించారు. అదేవిధంగా ఈ ఎంపిక ప్రక్రియలో 25 ఆంధ్రా బెటాలియన్ గుంటూరు నుంచి సుబేదార్ టి జయరాముడు, హవల్దార్ యం మోహన్‌లు పాల్గొన్నారు. నూతనంగా ఎన్‌సిసికి ఎంపికైన క్యాడెట్లను కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఛరణ్‌సింగ్ సిద్దు, ఎఒ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌శర్మ అభినందనలు తెలియచేశారు.

## యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటిని అభినందించిన 11వ వార్డు తెదేపా నాయకులు

**చిలకలూరిపేటటౌన్, జులై26, ప్రభాతవార్త:** మార్కెట్ యార్డ్ కమిటి చైర్మన్‌గా నూతనంగా నియమించ



బడిన షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావులను శనివారం పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 11వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు షేక్ గన్‌సైదా, మహ్మద్ ఆలీ, పట్టణ కార్యదర్శి మద్దుమాల రవి, అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు, ఆ వార్డుకు చెందిన పార్టీ నాయకులు పాల్గొని అభినందనలు తెలియచేశారు.

## పండరీపురం రోటరిక్లబ్ ఆధ్వర్యంలో గణపవరం ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో బాలింతలకు పౌష్టికాహారం పింపిణీ

**నాదెండ్ల, జులై26, ప్రభాతవార్త:** పండరీపురం రోటరిక్లబ్ ఆధ్వర్యంలో శనివారం గణపవరం గ్రామంలో ఉన్న ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న



బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డాక్టర్ కవితా అనసూయ పాల్గొని బాలింతలకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బోనం వెంకటేశ్వరరావు, కార్యదర్శి దోరడ్ల మనోజ్‌కుమార్, కోశాధికారి శ్రీనివాసరావు, రోటరి డైరక్టర్లు లంకా రఘురామిరెడ్డి, అనిల్‌కుమార్, తులసీ వసంతరావు, అలంగార్ మోహన్, బి చెంచుపున్నయ్య, ఎ దాసునాయన, లంకా ఆదిరెడ్డి, కాకుమాను సింగారావు,దడబడ పుల్లయ్య, అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి రాఘవయ్య పాల్గొన్నారు.

## ఎండుగుంపాలెం హైస్కూల్‌నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనసత్కారం

**నాదెండ్ల, జులై26, ప్రభాతవార్త:** మండలంలోని ఎండుగుంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇప్పటివరకు పనిచేసి బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు ఎస్‌కె అబ్దుల్ మునాఫ్, నల్లమోతు రత్నబాబు, వై కరుణామణులను శనివారం పాఠశాలలో



ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి రామలక్ష్మణరావు, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని, ఉపాద్యాయులు, విద్యార్దిని, విద్యార్దులు పాల్గొన్నారు.

# సుమేధలో అబ్దుల్ కలాం వర్ధంతి

**గుంటూరు విద్య, జూలై 26, ప్రభాతవార్త :** స్థా ్ధనిక ఎన్జీజీవో కాలనీ సుమేధా హైస్కూల్లో మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో కలాం యువ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,సిఈఓ పిడికిటి భూపాల్




పాల్గొని విద్యార్థులను ఉద్దే ్దశించి మాట్లాడుతూ కలాం ఏ విధంగా పేదరికం నుండి గొప్ప వ్యక్తిగా, శాస్ర ్తవేత్తగా, రాష్ట్రపతిగా ఎదిగారో విద్యార్థులకు వివరించారు.మరో ముఖ్యఅతిధి డాక్టర్ కల్ల శ్రీకాంత్(ఛైల్డ్ సైకాలజిస్ట్) మాట్లాడుతూ విద్యార్థులందరూ కలాం బాటలో దేశాభివృద్ధిలో భాగం కావాలని ఆకాంక్షించారు.స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని దేశ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా ఎదగాలని సందేశాన్నిచ్చారు.కార్యక్రమంలో 200 ఔషధ మొక్కలను విద్యార్థులకు పంచి వాటిని ఇండ్ల దగ్గర నాటి వాటిని కాపాడాలని తెలియజేశారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.రాంబాబు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు

ఫిరంగిపురం, జులై 26 ప్రభాతవార్త : నరసరావుపేట నియోజకవర్గంలో నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మ ండలంలోని



జొన్నలగడ్డ గ్రామంలోనూ, 9వ వార్డులోనూ ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడారు. ప్రతి గడపలోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం కనిపిస్తుందన్నారు. సంచలనాత్మకమైన సంక్షేమ పథకాలను అందించడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధితో పాటు ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. చేసిన మంచిని తెలియజేసేందుకు, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఇంటింటికి కర పత్రాలను పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు. అదే విధంగా స్థానిక ప్రజలు తమకు అడుగడుగునా ఘన స్వాగతం పలుకుతూ ఎదురొస్తున్నారని, ఆప్యాయంగా తమను వార్డుల్లోకి తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియ జేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసిరెడ్డి రవి, అల్లంశెట్టి మోహన్‌రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఏఎంరెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డికి జాతీయ అవార్డు

నరసరావుపేట, జులై 26 ప్రభాతవార్త : ఏఎంరెడ్డి విద్యాసంస్థల సెక్రటరీ అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డికి రవీంద్రనాధ్ ఠాగూర్ జాతీయ అవార్డు లభించింది. శనివారం కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు,



కళాశాల సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. ఏఎంరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా గత 20 సంవత్సరాలుగా ఫార్మసీ, ఇంజనీరింగ్, బిఈడి, ఉన్నత విద్య కోర్సులను వారు అందిస్తున్నారు. జాతీయస్థాయిలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన అవార్డు విద్యారంగంలో చేస్తున్న కృషికి లభించింది. ఎడ్యుటెక్ ఎక్స్‌పో -2025 ను హైదరాబాద్ వేదికగా స్కిల్ ఇండియా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్, ఈకే ఉపదేష్ మీడియా సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ఈ అవార్డును స్వీకరించనున్నారు. జాతీయ మంత్రిత్వశాఖ విభాగంలోని వారు ఈ అవార్డుకు వారిని ఎంపిక చేశారు. అవార్డు గ్రహీత అట్లూరి శాంతి - శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పల్నాడు విద్యా రంగానికి ఈ అవార్డు లభించినట్లు తెలియజేశారు.

# రాష్ట్రంలో కొనసాగుతున్న చంద్రబాబు సంక్షేమాభివృద్ధి పాలన

## మంత్రులు సవిత,గొట్టిపాటి,చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, జులై26,ప్రభాతవార్త: గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఐదేళ్లు విధ్వంసమే నెలకొందని,కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమ పరుగులు తీస్తోందని రాష్ట్ర మంత్రులు సవిత,గొట్టిపాటి రవి కుమార్,ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో



మంత్రులు శనివారం పాల్గొన్నారు. నరగాయపాలెం నుంచి వెంకుపాలెం వరకు రూ.4కోట్లతో నిర్మించిన పంచాయతీరాజ్ తారు రోడ్డు, తిమ్మాయిపాలెం నుంచి దొండపాడు వరకు రూ. 6కోట్లతో నిర్మించిన పంచాయతీరాజ్ తారు రోడ్డును మంత్రులు,చీఫ్‌విఫ్ జీ.వీ.,డీసీసీబీ ఛైర్మన్ మక్కెనతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత,గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల సురక్షిత ప్రయాణానికి పక్కటి రోడ్లు వేసామన్నారు. ఇది మంచి ప్రభుత్వమని చెప్పడానికి జరిగిన అభివృద్ధే నిదర్శనమన్నారు. వైకాపా హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఒక్క తట్ట మట్టి కూడా పోయలేదని విమర్శించారు. జీ.వీ ఆంజనేయులు వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని మంచి ప్రభుత్వాన్నికి ప్రజలందరూ అండగా ఉండాలని చెప్పారు. అనంతరం జీ.వీ పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. వినుకొండలో బీసీ బాలికల గురుకుల పాఠశాల మంజూరు చేయాలని,నూజెండ్లలో బీసీలకు మంచి భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీసీ బాలుర వసతి గృహాలకు నిధులు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రులు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిద్దలూరు,కనిగిరి ఎమ్మెల్యేలు అశోక్‌రెడ్డి,ముక్కు ఉగ్రనరసింహారెడ్డి,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విచారణకు హాజరైన అంబటి మురళీకృష్ణ

### -స్టేషన్ వద్దకు వచ్చిన వైకాపా నాయకులు, కార్యకర్తలు -అంబటికి అర్బన్ సిఐ పలు ప్రశ్నల సంధింపు

పొన్నూరు, జులై 26,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శనివారం రాత్రి ఓ కేసులో అర్బన్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. మండల పరిధిలోని మన్నవ



గ్రామానికి చెందిన సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావుపై జరిగిన దాడి సందర్భంగా అంబటి మురళీకృష్ణ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మినీ మహానాడులో ప్రత్యర్థులను మట్టుబెట్టాలని ఆదేశించారని, అందుకు ప్రతిగానే బొనిగల నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిందని అంబటి మురళీకృష్ణ పలుమార్లు విలేకర్ల సమావేశాలు నిర్వహించి చెప్పారు. అంతేకాకుండా బొనిగల నాగమల్లేశ్వరరావుపై జరిగిన దాడి కేసులో ధూళిపాళ్ళ నరేంద్ర ప్రమేయం ఉందని కూడా పలుమార్లు విలేకర్ల సమావేశాల్లో చెప్పారు. అయితే ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అనే మాటలను, వీడియోలను మార్ఫింగ్ చేసి అంబటి మురళీకృష్ణ ధూళిపాళ్ళపై అసత్యప్రచారం చేశారంటూ టీడీపీ పట్టణాధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్ ఇటీవల అర్బన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ అంబటి మురళీకృష్ణపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అందులో భాగంగా మురళీకృష్ణను స్టేషన్‌కు పిలిపించి సుమారు రెండు గంటల పాటు విచారణ చేశారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడిన మాటలు, విలేకర్ల సమావేశాల్లో చూపించిన పలు వీడియో క్లిప్పింగ్‌లు తదితరాలపై సిఐ వీరానాయక్ అంబటి వద్ద ఉన్న ఆధారాలు ఏమిటని వివరాలను అడిగి తెలుసుకొన్నారు. అంబటి విచారణ నిమిత్తం స్టేషన్‌కు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొన్న ఆయన అభిమానులు పెద్ద ఎత్తున స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అయితే స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించమని, అంబటిని విచారించి పంపిస్తామని, ఎవరూ లోపలకు రావద్దని రూరల్ పోలీస్‌స్టేషన్ గేటు వద్ద పోలీసులు నాయకులను,కార్యకర్తలను నిలిపివేశారు. తదుపరి మళ్ళీ విచారణకు రావాల్సి ఉంటుందని, తాము ఎప్పుడు కబురు పంపితే అప్పుడురావాలని సిఐ అంబటికి సూచించినట్లు తెలిసింది.

## సందు శ్రీనివాసరావుకు నివాళులర్పించిన డాక్టర్ గజ్జల

రాజుపాలెం, జులై 26 ప్రభాతవార్త : మండలంలోని అంచులవారిపాలెం గ్రామానికి చెందిన సందు శ్రీనివాసరావు గుండెపోటుతో శనివారం మృతిచెందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి గ్రామానికి వెళ్ళి శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీనివాసరావు మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ వార్డు అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



## మధ్యాహ్న భోజనం విషయంలో ఆ జాగ్రత్త వహిస్తే తగిన చర్యలు : ఎంఈవో

కొల్లిపర, జులై 26 (ప్రభాతవార్త) : మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఆ జాగ్రత్త వహిస్తే తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు.



శనివారం మండలంలోని తూములూరు, కొల్లిపర ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఆహార పదార్థాలు పిల్లలకు ఇవ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కూడా మధ్యాహ్న భోజనం పథకం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

## ఆగస్టు 7,8 తేదీలలో జిల్లా సిపిఐ మహాసభలు

అమరావతి, జులై 26 ప్రభాతవార్త : బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సాగిన సమరంలో కమ్యూనిస్ట్ పార్టీ ఎన్నో పోరాటాలు చేసి నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని బలహీన వర్గాల భుజాన నిలిచిన ఎర్రజెండా భారత కమ్యూనిస్ట్ పార్టీ అని సిపిఐ కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలోని సిపిఐ



కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ వ్యక్తులకు దోచి పెడుతూ ప్రజలను, బడుగు బలహీన వర్గాలను మరింత పేదవారీగా తీర్చిదిద్దే విధంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాన్ని సభ్య సమాజం వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పరితపిస్తూ పేద ప్రజల హృదయాలలో స్థిరత్వాన్ని పదులుపరచుకున్న సిపిఐ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఆగస్టు 7, 8 తేదీలలో వినుకొండలో జిల్లా సిపిఐ మహాసభలు నిర్వహించుకోవడం ఆనందదాయక మన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోడు శ్రీనివాసరావు మాట్లాడుతూ వినుకొండలో సిపిఐ జిల్లా మహాసభ సందర్భంగా జరిగే బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్, మారుతీవరప్రసాద్‌లు పాల్గొంటారన్నారు. సభలను జయప్రదం చేయాలని మునగోడు శ్రీనివాసరావు కోరారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

## మేలుజాతి పశువుల ద్వారా ఆర్థికాభివృద్ధి

### -డెయిరీ మేనేజర్ ఆదినారాయణ

కొల్లిపర, జులై 26 (ప్రభాతవార్త) : రైతులు మేలుజాతి పశువులను పెంచుకోవడం వలన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవచ్చునని సంగం డెయిరీ మేనేజర్ ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని



హనుమాన్‌పాలెం పాలకేంద్రంలో పాలు పోసిన రైతులకు లక్షా 98వేల రూపాయలను సంగం డెయిరీ అధికారులు బోనస్‌గా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆదినారాయణ మాట్లాడుతూ సంగం డెయిరీ పాల కేంద్రాల్లో పాలు పోసిన రైతులకు అనేక రాయితీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సంగం డెయిరీల ద్వారా సబ్సిడీపై దాణాను ఇస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా పాలుపోసిన రైతులకు భీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలియజేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ శాఖమూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో పశు సంపద రాను, రాను తగ్గిపోతుందన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పశువుల పెంపకంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం అత్తోట పాల కేంద్రంలో పాలు పోసిన రైతులకు లక్షా 39వేల రూపాయలను బోనస్‌గా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాల కేంద్రం అధ్యక్షులు పాలడుగు శ్రీనివాసరావు, వెలివెల శివరామయ్య, కార్యదర్శులు జాన్‌బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ సేవలు పలువురికి ఆదర్శం

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

పొన్నూరు, జులై 26,ప్రభాతవార్త: రోటరీక్లబ్ చేస్తున్న సేవలు పలువురికి ఆదర్శంగా నిలవాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబు అన్నారు. నిడుబ్రోలు గోతాలస్వామి ఆశ్రమంలో తల్లిపిల్ల మాసోత్సవం సందర్భంగా సామూహిక శ్రీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా



మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా పేదలను ఆదుకొనేందుకు ముందుకు వచ్చి సేవలు అందించడం సుభపరిణామమన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్నట్లుగా పేద ప్రజలకు సేవలు అందిస్తే సాక్షాత్తు ఆ భగవంతుడికి సేవ చేసినట్లేనన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సామూహి శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ ఎన్.హిమబిందు మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, బాలింతలు వైద్యుల సలహా మేరకు మందులను వాడడం, వైద్యుల సూచనలు పాటించడం వంటి చేస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. గర్భిణీస్త్రీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వారు తీసుకోవాల్సిన ఆహార అలవాట్ల గురించి వివరించారు. ఆపరేషన్ లేకుండా నార్మల్‌గా డెలివరీ అయ్యేందుకు పలు సలహాలను, సూచనలను, మెలకువలను తెలిపారు. అనంతరం శ్రీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు జిఎంఎస్ గుప్త మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపాదించిన సొమ్ములో కొంతసేవా కార్యక్రమాలకు వినియోగించే విధంగా ఆలోచన చేయాలన్నారు. రోటరీక్లబ్ తరపున సేవా కార్యక్రమాలు చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సొంత లాభాన్ని మానుకొని పొరుగువారికి తోడుపడవోయ్ అన్నట్లుగా రోటరీక్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం, అందుకు క్లబ్ సభ్యులంతా సహకరించడం ఆనందంగా ఉందన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి యాసం వీరయ్య(రెటీనావీరయ్య) మాట్లాడుతూ తమపై నమ్మకంతో రోటరీక్లబ్ సభ్యులంతా మమ్ములను అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవా కార్యక్రమాలను విరివిగా నిర్వహించి పదిమందికి ఆదర్శంగా నిలుస్తామన్నారు. సామూహిక శ్రీమంతాల కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్, మాజీ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసరావు, కొత్తమాసు రామకృష్ణ, బివి చౌదరి, నన్నపనేని బాలకృష్ణ, కొల్లిపర ఆంజనేయులు, తోట భానుప్రసాద్, ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ఉద్యమ సూర్యుడు ప్రగడ కోటయ్య

### -మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత

పొన్నూరు, జులై 26,ప్రభాతవార్త: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి, చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు కంకణం కట్టుకొని ఉద్యమించిన చేనేత ఉద్యమ సూర్యుడు ప్రగడ కోటయ్య అని మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత అన్నారు. స్థానిక వీవర్స్ కాలనీలోని ప్రగడ కోటయ్య 110వ జయంతిని పురస్కరించుకొని ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి



ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ దేశంలో చాలా మంది వ్యక్తిగత స్వార్థం కోసం, అక్రమార్జన కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలను వాడుకొంటే ప్రగడ కోటయ్య మాత్రం నిస్వార్థంగా రాజకీయాలను నిడిపారన్నారు. చేనేత కుటుంబంలో పుట్టిన ప్రగడ కోటయ్య భారతీయ చేనేత పరిశ్రమపై పరిశోధనలు జరిపారన్నారు. ఆచార్య ఎన్జీ రంగా సలహా మేరకు మద్రాసులోని టెక్స్‌టైల్ ఇన్స్టిట్యూట్‌లో చదవి అక్కడ సూపర్‌వైజర్‌గా పనిచేశాడన్నారు. అక్కడి అనుభవంతోనే 1935లో ఏర్పడిన మద్రాసు రాష్ట్ర చేనేత పారిశ్రామిక సహకార సంఘంలో ప్రొడక్షన్ ఇన్‌చార్జిగా ఉద్యోగంలో చేరి, స్వయంగా కార్మికుల కష్టాలను తెలుసుకొని కార్మికుల సమస్యల పరిష్కారానికి విశేషమైన కృషి చేశారన్నారు. చేనేత కార్మికుల కోసం సత్యాగ్రహం చేపట్టి జైలు శిక్ష కూడా అనుభవించాడన్నారు. సుమారు రెండు దశాబ్దాల పాటు చేనేత రంగంతోపాటు వివిధ రంగాల శ్రామికుల కోసం పనిచేశారన్నారు. 1952నుండి 1962వరకు రెండు పర్యాయాలు, 1957నుండి 972వరకు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేసి ఎన్నో సేవలు అందించారన్నారు. అలాంటి ప్రగడ కోటయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చేనేత కార్మికులు ప్రగడ కోటయ్య చేసిన సేవలను ఎన్నటికీ మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరె వెంకట్రావు, ప్రగడ బాలాజి, అనివెట్టి వీరబాబు, తదితరులున్నారు.

## సుపరిపాలనకు తొలి అడుగు

సత్తెనపల్లి (టౌన్ జులై 26ప్రభాతవార్త): సత్తెనపల్లి పట్టణంలోని సుపరిపాలనకు తొలి అడుగులో బాగంలో సత్తెనపల్లి నియోజక వర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అదేశాల మెరకు శనివారం సత్తెనపల్లి



పట్టణం 29 వ వార్డ్ 74 బూత్ దోరు టు డోర్ తిరిగి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమమే గురించి వివరించదమైన . ఈ కార్యక్రమంలో షేక్. చిన్న అబ్దుల్లా, సుభాని మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

## అబ్దుల్ కలామ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

### -ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు

కొల్లిపర, జులై 26 (ప్రభాతవార్త) : విద్యార్థులు అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు టి.మల్లేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని అన్నవరం లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ వర్ధంతి 27వ తేది కావడంతో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ భారతజాతి గర్వించతగిన వ్యక్తి అబ్దుల్‌కలామ్ అన్నారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అబ్దుల్‌కలామ్ విశిష్ట సేవలు అందించినట్లు తెలియ జేశారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు జాగృతి భారత ట్రస్టు అధ్యక్షుడు పసుపులేటి గణేష్ అందజేసిన బహుమతులను ఉపాధ్యాయులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ గురువిందపల్లి శేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాణ స్వీకారానికి సభా వేదిక పరిశీలన

ప్రత్తిపాడు జులై 26 (ప్రభాతవార్త): ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పదవుల నగారా మోగిన విషయం పాఠకులకు విధితమే.అందులో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీనీ ప్రకటించడం జరిగినది.వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులుగా స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, చైర్మన్ గా బొందలపాటి అమరేశ్వరి,వైస్ చైర్మన్ గా నార్నే వీర శివ



వరప్రసాద్ (బాబు)లతో పాటు19 మంది కమిటీ సభ్యులుగా ఈనెల 30 వ తారీఖున జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటును రాష్ట్ర రైతు విభాగం మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహణ కమిటీ సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కాకాని సురేష్,జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మెరికినపల్లి సాంబశివరావు,కమిటీ మెంబర్ పమిడి శ్రీనివాసరావు,కాట్రా బాపయ్య చౌదరి, సదాశివరావు లతోపాటు,వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లగడపాడులో ప్రగడ కోటయ్య 111వ జయంతి వేడుకలు

పెదకూరపాడు, జులై 26 ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోధులు, చేనేత ఉద్యమ సూరీడు, మాజీ రాజ్యసభసభ్యులు,



కీర్తి శేషులు ప్రగడ కోటయ్య 111వ జయంతిని లగడపాడు గ్రామంలో భావన ఋషి దేవాలయం వద్ద చేనేతలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిల్లపల్లి సత్యం పాల్గొని ప్రగడ కోటయ్య ఆశయాలు, వారి సేవలను కొనియాడారు. పెదకూరపాడు నియోజకవర్గ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి బాజీ, పెదకూరపాడు నియోజకవర్గం జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం అధ్యక్షుడు గోలి యల్లమందయ్య, పిడిఎఫ్ కన్వీనర్, ప్రజా కవి దర్శి శేషారావులు పాల్గొని ప్రసంగించారు. చేనేత బిడ్డగా తన తుదిశ్వాస వరకు దేశంలోని చేనేత ప్రజల సంక్షేమం కోసం చేనేత కార్మికులు, చేనేత పరిశ్రమ కోసం నిరంతరం తపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అనుముల వెంకట్రావు, బండారు వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం, రామారావు, సంగెపు శ్రీను, పద్మశాలి ప్రముఖులు పాల్గొన్నారు.

## వైకాపా కారంపూడి మండల బీసీ సెల్ అధ్యక్షునిగా లింగయ్య

కారంపూడి, జులై 26 ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కారంపూడి మండల బీసీ సెల్ కమిటీని పార్టీ అధిష్టానం నియమించింది. మండల బీసీ సెల్ అధ్యక్షునిగా వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వేముల లింగయ్యను నియమించారు. ఉపాధ్యక్షులుగా లక్ష్మీపురం గ్రామం రజక సామాజిక వర్గానికి చెందిన నడికోట చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా మిరియాల గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన మేకల అమరయ్యను నియమించారు. తమ నియామకానికి కృషి చేసిన పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి, వైసీపీ సంయుక్త కార్యదర్శి కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, కారంపూడి మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన బీసీ సెల్ కమిటీకి కారంపూడి మండల బూత్ కమిటీ అధ్యక్షులు కోట శివారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



## చిన్నగార్లపాడు పవన్‌కుమార్‌రెడ్డికి సమాజసేవా రత్న అవార్డు

కారంపూడి, జులై 26 ప్రభాతవార్త: కారంపూడి మండలం చిన్నగార్లపాడు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి పవన్‌కుమార్‌రెడ్డికి సమాజ సేవారత్న అవార్డు లభించింది. శనివారం ఢిల్లీ పబ్లిక్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకున్నారు. అన్నపురెడ్డి పవన్‌కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు దక్కిందని తెలుస్తుంది. ఎప్పుడూ సమాజ సేవలో ముందుండే పవన్‌కుమార్‌రెడ్డికి ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణం అని చిన్నగార్లపాడు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. అవార్డు అందుకున్న పవన్‌కుమార్‌రెడ్డిని కారంపూడి మండల ప్రజాప్రతినిధులు, చినగార్లపాడు గ్రామస్థులు అభినందిస్తున్నారు. ప్రస్తుతం పవన్‌కుమార్‌రెడ్డి లండన్‌లో ఉన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్‌దివాస్

సత్తెనపల్లి, జులై 26 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం కార్గిల్ విజయ్‌దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మేరా యువభారత్ సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ భారత సైనిక చరిత్రలో జులై 26 అత్యంత ముఖ్యమైన రోజు అన్నారు. 500 మందికి పైగా భారతీయ సైనికులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆర్మీలో పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సత్కారం చేశారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

## మాచర్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

మాచర్ల, జులై 26 ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ కార్యక్రమాన్ని పట్టణంలోని చెంచుకాలనీ కమ్యూనిటీ హాలులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు డాక్టర్ రామకోటయ్య మాట్లాడుతూ గర్భిణులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలో వివరించారు. డాక్టర్ దశరథ్ చిన్నపిల్లలకి ఎలాంటి పౌష్టికాహారం అందించాలి, వర్షాకాలంలో అంటువ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్, కార్యదర్శి ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి యనమదల వెంకటరామయ్య, రోటరీ క్లబ్ సభ్యులు పఠాన్ నాగూర్‌వలి, చెరుకూరి నరసింహారావు, పోలూరి శ్రీనివాసరావు, సిద్ధంరాజు, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను స్వీకరించిన మెట్టు గోవిందరెడ్డికి రోటరీక్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# సెప్టెంబర్ నుంచి 'స్పిరిట్' షూటింగ్

వరుస పాన్‌ఇండియా హిట్స్ అందించిన తర్వాత రెబల్ స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తన తదుపరి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ స్పిరిట్‌లోకి ఎంటరవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. హైఆక్టేన్ పాన్‌వరల్డ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం సంచలనం క్రియేట్ చేసే పవర్ ఫుల్ కొలాబరేషన్‌ని చూస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడిగా త్రిప్తి దిమ్రి కనిపించనుంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన యానిమల్‌లో తన అద్భుతమైన నటనతో పేరుతెచ్చుకున్న త్రిప్తి ఫస్ట్ టైమ్ ప్రభాస్ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్ చివరి నుండి ప్రారంభం కానుందని టీం అధికారికంగా తెలియజేసింది. ఇది గ్రాండ్ సినిమాటిక్ జర్నీకి ప్రారంభాన్ని సూచిస్తుంది. స్పిరిట్ గ్లోబల్ మూవీగా రూపొందుతోంది. దీనిని తొమ్మిది భాషలలో విడుదల చేయడానికి ప్లాన్స్ సిద్ధం చేస్తున్నారు. ఇంటర్నేషనల్ స్కేల్, యూనివర్సల్ అప్పీల్‌తో ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా అలరించబోతోంది. ప్రణయ్‌రెడ్డివంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టిసిరీస్ ఫిల్మ్స్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. మ్యాసీవ్ స్కేల్, ఫ్రెష్ లీడ్ పెయిర్, బ్లాక్ బస్టర్ దర్శకుడితో స్పిరిట్ ఇండియన్ సినిమాలో ఒక ల్యాండ్ మార్క్‌గా మారనుంది.



# 'మిరాయ్' ఫస్ట్ సింగిల్

హనుమాన్ సంచలన విజయంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న సూపర్ హీరో తేజ సజ్జా, ఇప్పుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ మిరాయ్‌లో సూపర్ యోధగా అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్లింప్స్, టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. మొదటి సింగిల్ వైబ్ ఉంది ప్రోమో సంచలనం సృష్టించింది. ఉత్సాహాన్ని రేకెత్తించింది. ఇప్పుడు, టీం సాంగ్ పూర్తి లిరికల్ వీడియోను విడుదల చేసింది. వైబ్



ఉంది తుఫానులా మిమ్మల్ని తాకే మ్యూజికల్ వైబ్, పవర్ ఫుల్ కంపో జిషన్‌తో సాంగ్ అదిరి పోయింది. ఈ ట్రాక్‌లో అకార్డియన్లు, సాక్సోఫోన్లు, పవర్ ఫుల్ డ్రమ్స్ హైఆక్టేన్ ఎనర్జీని క్రియేట్ చేశాయి. కృష్ణకాంత్ లిరిక్స్ తెలుగు, ఇంగ్లీషులను నేచురల్‌గా బ్లెండ్ చేసి హీరో ఎమోషన్‌ని, హీరోయిన్ అందాన్ని అద్భుతంగా హైలైట్ చేశాయి. తేజా సజ్జా ప్రతి ఫ్రేమ్‌లో ఎనర్జీ, ఛార్మ్, డాన్స్ స్టెప్స్‌తో అదరగొట్టాడు. డ్యాన్స్ మూమెంట్స్‌లో అతని గ్రేస్ మెస్మరైజ్ చేసింది. అర్మాన్ మాలిక్ మాజిక్ వోకల్స్‌తో ఆకట్టుకున్నాడు. సాఫ్ట్‌గా, అలాగే హై బీట్‌కి తగ్గట్టే పవర్ఫుల్‌గా పాడాడు. విజువల్‌గా పాట నెక్స్ట్ లెవెల్‌లో వుంది. అర్బన్ సెట్టింగ్‌లో, స్టైలిష్ షాట్స్, లైటింగ్, డిజైన్ చూస్తుంటే అద్భుతం అనిపించింది. తేజరితికా నాయక్ కెమిస్ట్రీ, డాన్స్ మూమెంట్స్ అలరించారు. తేజ స్టైల్ గ్రేస్ టాప్ గేర్‌లో ఉంది. రుతికా గ్లామరస్‌గా కిల్లింగ్ లుక్‌లో మెరిసిపోతుంది. మొత్తానికి ట్రెండీ టచ్‌తో పాటు చిన్న క్లాసికల్ హింట్స్‌తో వైబ్ ఉంది పాట మాస్‌ని, క్లాస్‌ని రెండిటినీ కనెక్ట్ చేస్తోంది. వైబ్ ఉంది అన్ని మ్యూజిక్ చార్ట్స్‌తో టాప్‌లో ఉండబోతోంది. మనోజ్ మంచు ఈ సినిమాలో పవర్ ఫుల్ విలన్‌గా కనిపించబోతున్నారు.



# సాయి కుమార్ బర్త్‌డే స్పెషల్

విలక్షణ నటుడు సాయి కుమార్ పేరు వింటే ఎన్నో అద్భుతమైన డైలాగ్‌లు మన కళ్ల ముందు మెదులు తాయి. హీరోగా, విలన్‌గా, కారెక్టర్ ఆర్టిస్ట్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టుగా ఎన్నో అద్భుతమైన చిత్రాలతో దక్షిణాది సినీ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. నేడు (జూలై 27) ఆయన 65వ పుట్టిన రోజు. ఇక ఈ ఏడాదితోనే ఆయనకు నటుడిగా 50 ఏళ్లు నిండాయి. ఈ 50ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో గొప్ప చిత్రాలతో మెప్పించిన సాయి కుమార్ ఈ ఏడాది బ్లాక్ బస్టర్ ప్రాజెక్టులతో బాక్సాఫీస్ వద్ద సందడి చేశారు. ఇలాంటి అద్వితీయ నటుడి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కథనం మీకోసం. 1975 జనవరి 9న దేవుడు చేసిన పెళ్లి చిత్రంతో నటుడిగా అరంగేట్రం చేశారు. ఆ చిత్రం కూడా సంక్రాంతికి విడుదలై అప్పట్లో సంచలనం సృష్టించింది. నటుడిగా 50వ ఏటలోకి అడుగు పెట్టిన సాయి కుమార్ ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం అనే చిత్రంలో నటించి మెప్పించారు. ఆ సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇక ఇదే ఏడాది సాయి కుమార్ ప్రధాన పాత్రను పోషించిన కోర్ట్ మూవీ కూడా భారీ విజయాన్ని సాధించింది. కొత్త తరం ఆర్టిస్టులు వస్తున్నా, గట్టి పోటీ ఏర్పడినా.. నటుడిగా 50 ఏళ్లు గడిచినా కూడా సాయి కుమార్ ఇప్పటికీ చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉంటూ.. ప్రతీ సినిమాతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు. కుమార్ కేవలం తెలుగు ప్రాజెక్టులతోనే కాకుండా కన్నడ, తమిళ చిత్రాలతోనూ సందడి చేస్తున్నారు.

# 'అతడు' రీ రిలీజ్



సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన అతడు క్లాసిక్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. అతడు చిత్రం క్రేజ్ ఇప్పటికీ ఎప్పటికీ చెక్కు చెదరకుండా అలానే నిలిచింది. జయభేరి ఆర్ట్స్ బ్యానర్ మీద మురళీ మోహన్ నిర్మించిన ఈ చిత్రాన్ని మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఆగస్ట్ 9న రీ రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో శనివారం నాడు రీ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, మురళీ మోహన్ మాట్లాడుతూ, మా బ్యానర్‌లో 2005 ఆగస్ట్ 10న అతడు సినిమాను రిలీజ్ చేశాం. ఇప్పుడు ఆగస్ట్ 9న మహేష్ బాబు బర్త్ డే సందర్భంగా రీ రిలీజ్ చేస్తున్నాం. టెక్నాలజీ పరంగా అప్ గ్రేడ్ చేసి ఈ మూవీని మళ్లీ విడుదల చేస్తున్నాం. ఈ క్రమంలో మాకు ప్రసాద్ అండ్ టీం సహకరించింది. రైటర్‌గా త్రివిక్రమ్ మంచి సక్సెస్‌లో ఉన్నప్పుడు మా బ్యానర్‌లో దర్శకుడిగా పరిచయం చేసి, ఆయనతో మొదటి సినిమా చేయాలని అనుకున్నాం. ఆ టైంలో కథ చెప్పమని ఆయన్ను పిలిపించాం. స్రవంతి కిషోర్‌కి మాటిచ్చాను.. వారి బ్యానర్‌లో సినిమా చేసిన తరువాత మీ వద్దకు వస్తానని త్రివిక్రమ్ అన్నారు. ఆ తరువాత మా వద్దకు వచ్చి మూడు గంటల పాటుగా ఈ 'అతడు' కథను కళ్లకు కట్టినట్టుగా చెప్పారు. హీరో అంటే సుగుణాభిరాముడు అని అంతా అనుకునేలా పాత చిత్రాలు వస్తుండేవి. కానీ ఇందులో హీరో పాత్ర కాస్త నెగెటివ్ ధోరణిలో ఉంది కదా? అని అంటే.. ఇప్పుడు అదే ట్రెండ్ అని త్రివిక్రమ్ అన్నారు. సరే అని అంతా ఆయన మీదే భారం వేశాం. ఓ ఇంటి సెట్‌ను వేస్తే అందరూ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. దాదాపు 90 శాతం సీన్లు అదే సెట్‌లో షూటింగ్ చేశాం. ఆ తరువాత ఆ సెట్‌ను చాలా మంది వాడుకున్నారు. అయితే ఆ తరువాతి కాలంలో ఓఆర్ఆర్ రావడంతో ఆ సెట్ వెళ్లిపోయింది. లేదంటే అక్కడే ఓ స్టూడియో కూడా కట్టేవాళ్లం. అతడు మూవీ కోసం మహేష్ బాబు చాలా సహకరించారు. ఎంత ఆలస్యమైనా సరే, ఎన్ని డేట్లు అయినా సరే మహేష్ బాబు ఇచ్చారు. క్లైమాక్స్ ఫైట్ కోసం చాలా కష్టపడ్డారు. సినిమాకు చాలా మంచి పేరు వచ్చింది. బుల్లితెరపై అతడు కొత్త చరిత్రను సృష్టించింది. ఈ చిత్రం మా సంస్థకు మంచి గౌరవాన్ని తీసుకు వచ్చింది. నా సోదరుడు కిషోర్ తనయ ప్రియాంక ఈ మూవీని టెక్నికల్‌గా అప్ గ్రేడ్ చేసి అందరి ముందుకు తీసుకు వస్తున్నారు. ఇక ముందు ప్రియాంక ఆధ్వర్యంలో జయ భేరి ఆర్ట్స్ నుంచి సినిమాలు వస్తూనే ఉంటాయి. థియేట్రికల్ పరంగా మేం అనుకున్నంత రేంజ్‌లో ఆడలేదు. కానీ బుల్లితెరపై మాత్రం రికార్డులు క్రియేట్ చేసింది. ఈ మూవీ కోసం వేసిన సెట్‌ను ఇతర ప్రొడక్షన్ కంపెనీలు కూడా వాడుకున్నాయి. వాటి ద్వారా కూడా చాలా డబ్బులు వచ్చాయి. కమర్షియల్‌గా అతడు పట్ల మేం సంతృప్తిగానే ఉన్నాం. మేం తీసిన అన్ని చిత్రాలు ఒకెత్తు.. అతడు ఇంకో ఎత్తు. అప్పటికే అధునాతన సాంకేతికతో అతడు మూవీని తీశాం. అద్భుతమైన డైలాగ్స్‌తో త్రివిక్రమ్ అందరినీ మెప్పించారు. అందుకే త్రివిక్రమ్ మాటల మాంత్రికుడు అయ్యారు. నాకు ఈ చిత్రంలో త్రివిక్రమ్ వేషం ఇవ్వలేదు. నాకు వేషం ఇవ్వండి అని ఎవ్వరినీ అడగొద్దు అంటూ మా ఆవిడ నాకొక కండీషన్ పెట్టారు. అందుకే ఇంత వరకు ఎవ్వరినీ నేను వేషం అడగలేదు. మహేష్ బాబు, త్రివిక్రమ్ డేట్లు ఇస్తే అతడు సీక్వెల్‌ను మా బ్యానర్ నిర్మిస్తుంది. అతడు మూవీకి మొదట్లో డివైడ్ టాక్ వచ్చింది. కానీ బుల్లితెరపై వచ్చాక అతడు గొప్పదనాన్ని అందరూ తెలుసుకున్నారు. అందుకే ఈ రీ రిలీజ్‌కు ఇంత క్రేజ్ ఏర్పడింది. ఒకప్పుడు థియేటర్లో మాత్రమే సినిమాలు చూస్తుండేవారు. ఆ తరువాత టీవీలు వచ్చాయి.

# కార్తి ఖైదీ 2.. టార్గెట్ ఫిక్స్..!

ఖైదీలో సూర్య రోలెక్స్ రోల్ ఉంటుందన్న టాక్ వినిపిస్తుంది. విక్రం సినిమాలో చివర్లో సూర్య రోలెక్స్ రోల్ అదరగొట్టాడు. సినిమా మొత్తం ఒక లెక్క చివర రోలెక్స్ రోల్ వచ్చి చేసిన హంగామా ఒక లెక్క అనిపించింది. కార్తి ఖైదీ2లో ఢిల్లీతో పాటు రోలెక్స్ పాత్ర కూడా ఉంటే మాత్రం సినిమా రేంజ్ వేరే లెవెల్ అని చెప్పొచ్చు. కార్తి ఖైదీ 2 కోసం రఫ్ లుక్‌తో కనిపిస్తాడట. ఆగష్టులో కూలీ సినిమా రిలీజ్ అవ్వడమే ఆలస్యం. లోకేష్ ఖైదీ 2ని సెట్స్ మీదకు తీసుకెళ్తాడని తెలుస్తుంది. ఖైదీ 2ని పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో అంతా సెటప్ చేస్తున్నారట. సినిమాలో కార్తి క్యారెక్టర్ రైజేషన్ ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని టాక్. ఖైదీ2 కథ కూడా బాగా వచ్చిందని తెలుస్తుంది. ఐతే అక్టోబర్‌లో సెట్స్ మీదకు వెళ్లబోతున్న ఖైదీ 2ని నెక్స్ట్ ఇయర్ అంటే 2026 సెకండ్ హాఫ్ మళ్లీ దసరా, దీపావళికి రిలీజ్ చేసేలా ప్లానింగ్ ఉందట. ఖైదీ 2లో ఇంకా సర్ ప్రైజింగ్ రోల్స్ కూడా లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ క్రేజ్‌ని మరింత పెంచే ప్రయత్నం చేస్తాయని అంటున్నారు. కార్తి మాత్రం ఎప్పుడెప్పుడు ఖైదీ 2 సెట్స్‌లో జాయిన్ అవ్వాలా అన్న ఆసక్తితో ఉన్నాడు. కార్తి ఖైదీ 2 తప్పకుండా అంచనాలకు తగినట్టుగానే ఉండే ఛాన్స్ కనిపిస్తుంది. కార్తి సర్దార్ 2, వాతియా, మార్షల్ సినిమాలు లైన్‌లో ఉన్నాయి. వీటితో పాటు తెలుగులో హిట్ 4కి కూడా సైన్ చేశాడని తెలుస్తుంది. ఐతే వీటిలో ఖైదీ 2 మీద మాత్రం భారీ హైప్ ఉందని తెలిసిందే.





ప్రియాంక జవాల్కర్ నయా లుక్

# బుచ్చిబాబుతో జాన్వీ ఫోటో వైరల్

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకున్న శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఇప్పుడు తెలుగు సినిమాల మీద పూర్తిగా ఫోకస్ పెట్టింది. మొదటి సినిమానే ఎన్టీఆర్‌తో దేవర, ఆ తర్వాత రెండో సినిమాగా రామ్ చరణ్ పెద్ది మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇలా టాలీవుడ్‌లో వరుసగా అవకాశాలు అందుకుంటూ సౌత్ ఆడియన్స్‌కి కూడా దగ్గరైపోతుంది. జాన్వీ గ్లామర్‌తో పాటు తన కొత్త లుక్స్‌తో యూత్‌ను ఆకట్టుకుంటోంది. ఇప్పుడు హైదరాబాద్‌లో పెద్ది సినిమాకు సంబంధించిన పాట చిత్రీకరణ కోసం జాన్వీ కపూర్ టీమ్‌తో కలిసి ఉందని వార్తలు వస్తున్నాయి. ఇటీవలే దర్శకుడు బుచ్చిబాబు సనా, జాన్వీ కపూర్‌తో కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో జాన్వీ సింపుల్ పింక్ జాకెట్, బ్లాక్ జీన్స్‌లో కనిపించింది. సింపుల్ గ్లామర్ లుక్‌లో కూడా ఎంత క్యూట్‌గా, ఎట్రాక్టివ్‌గా ఉందనే కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.



దర్శకుడు బుచ్చిబాబుతో కలిసి సినిమా థియేటర్‌లో కనిపించడంతో, ఏ సినిమా చూసారోనని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటో క్లిక్ అయిన ప్రదేశం హైదరాబాద్లోని ఏఎంబీ సినిమాస్. జాన్వీ, బుచ్చిబాబు అక్కడ కనిపించడం విశేషం. అయితే ఆ సమయంలో థియేటర్లో ఏ సినిమా ప్రివ్యూకు వెళ్లారో స్పష్టత లేదు. కొందరు ఫ్యాన్స్ మాత్రం హరి హర వీరమల్లు చూసారని అంటుండగా, మరికొందరు వేరే మూవీ అని అభిప్రాయపడుతున్నారు. ఏదైనా జాన్వీ కపూర్ క్యాజువల్ లుక్‌లో కనిపించడం మోడ్రన్ యూత్‌ను ఎంతగానో ఆకర్షించింది. ఇప్పుడు పెద్ది సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంటోంది. ముఖ్యంగా కీలక సాంగ్ షూట్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారు. సారీ చెప్పాల్సిందే.. లేకుంటే కింగ్డమ్‌ను అడ్డుకుంటాం రామ్ చరణ్, జాన్వీ కపూర్ జోడీగా కనిపించనుండటంతో, ఈ కాంబోలో వస్తున్న సినిమాపై ఇప్పటికే భారీ బజ్ ఏర్పడింది. మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తుండటంతో పాటలకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడుతోంది. దివ్యేందూ శర్మ, శివ రాజ్ కుమార్, జగపతిబాబు వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పెద్ది సినిమాపై మేకర్స్ కూడా భారీ ఆశలు పెట్టుకున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో రూరల్ మాస్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. జాన్వీ కపూర్ తక్కువ కాలంలోనే తెలుగులో రెండు బిగ్ ప్రాజెక్ట్స్ పట్టేసింది. పైగా ఇప్పుడు పారితోషికం కూడా ఒక్కో చిత్రానికి పెంచేస్తుండటంతో ఇండస్ట్రీలో బజ్‌కు కారణమవుతోంది. మరి అమ్మడి సెకండ్ మూవీ ఏ స్థాయిలో సక్సెస్ అవుతుందో చూడాలి.

# కింగ్ డమ్..హీరోయిన్ లవ్లీ డెడికేషన్

జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై విడుదలకు ముందే భారీ బజ్ నెలకొంది. టీజర్, పాటలు, ప్రమోషన్లతో సినిమాకు మంచి హైప్ వచ్చింది. ఇందులో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, ఆమె పాత్ర గురించి ప్రత్యేకంగా చర్చ జరుగుతోంది. రీసెంట్‌గా చిత్ర బృందం ప్రమోషన్‌లో మరింత ఊపునిచ్చేలా ప్లాన్స్ స్టార్ట్ చేసింది. ఇక మరోవైపు భాగ్యశ్రీ బోర్సే చేసిన పని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా త్వరలోనే విడుదల కానుండటంతో, భాగ్యశ్రీ తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేసింది. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా షేర్ చేయగా, అభిమానులు ఎంతో ఎగ్జైట్ అయ్యారు. గర్ల్‌ఫ్రెండ్ నధివే.. రష్మిక మాయతో నెంబర్ వన్ ట్రెండింగ్ కేవలం నటనలోనే కాదు, తనే సొంతంగా డబ్బింగ్ చెప్పడం ద్వారా భాగ్యశ్రీ తన పాత్ర పట్ల ప్రేమను చూపించింది. చాలా మంది నాయికలు భాషా పరంగా ఇబ్బంది పడుతూ డబ్బింగ్ ఆర్టిస్టులను ఉపయోగిస్తుంటారు. కానీ భాగ్యశ్రీ మాత్రం పూర్తి తెలుగు డైలాగ్స్‌కి స్వయంగా డబ్బింగ్ చెప్పడం స్పెషల్ హైలైట్ అయింది. కొత్త హీరోయిన్‌గా ఇండస్ట్రీకి వచ్చి, ఇంత డెడికేషన్ చూపించడం పై సినీ జనాల్లో కూడా ప్రశంసలు వినిపిస్తున్నాయి. నటనతో పాటు డైలాగ్స్‌లో ఎమోషన్‌ను అద్భుతంగా ప్రెజెంట్ చేయడమే కాకుండా, తెలుగు డైలాగ్స్‌ను కూడా కంటెంట్‌కు తగ్గట్టుగా చెప్పినట్లు తెలుస్తోంది. భగ్యశ్రీ మాట్లాడుతూ, ఒక సినిమాకు డబ్బింగ్ అనేది కేవలం లైన్స్ చెప్పడం కాదు. ప్రతి మాటలో భావాన్ని చూపించడం ముఖ్యం. తెలుగు భాషలో సొంతంగా వాయిస్ ఇవ్వడం నా లక్ష్యం. పాత్రలో జీవం పోసే అవకాశం డబ్బింగ్‌తో వచ్చింది అని తెలిపింది. ఆమె మాటల్లోనూ, ప్రయత్నంలోనూ తెలుగు పట్ల ఉన్న ప్రేమ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాణ ముప్పు ఉందంటున్న అలనాటి స్టార్ హీరోయిన్ ఈ డెడికేషన్ వల్ల కింగ్‌డమ్ సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోయాయి. ప్రేక్షకులు భగ్యశ్రీ నటనతో పాటు ఆమె వాయిస్‌వినడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా విడుదల తర్వాత ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావొచ్చన్న అభిప్రాయం ఫిలిం వర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఓ నార్త్ ఇండియన్ హీరోయిన్ తెలుగులో ఇంత ప్రాముఖ్యత ఇవ్వడాన్ని సినీ ప్రియులు ప్రశంసించారు. కింగ్‌డమ్‌లో భగ్యశ్రీ బోర్సే ప్రదర్శన ఎలా ఉండబోతోందో తెలుసుకోవాలంటే ఇంకొన్ని రోజులు వేచిచూడాల్సిందే.



ప్రస్తుతం వెండితెర మీద సందడి చేస్తున్న హరి హర వీరమల్లు సినిమాతో నిధి మళ్లీ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. నాలుగేళ్ల క్రితం చేసిన సినిమా ఎప్పుడో తన పోర్షన్ పూర్తైనా కూడా రిలీజ్ టైంలో నిధి ఆ సినిమాకు అందించిన కోపరేషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే వీరమల్లు రిలీజ్ ఈవెంట్‌లో పవన్ కళ్యాణ్ కూడా నిధి గురించి చాలా బాగా మాట్లాడారు. ఆమె సింగిల్ హ్యాండ్‌గా ప్రమోట్ చేసింది ఆమెను చూసి నేను కూడా ప్రమోషన్స్‌లోకి దిగా అన్నారు. మండలా మర్డర్స్ టాక్ ఏంటి..? సినిమా పట్ల నిధికి ఉన్న కమిట్మెంట్ చూసి అందరు సూపర్ అనేస్తున్నారు. ఐతే వీరమల్లు సినిమాతో నిధి మంచి పాపులారిటీ సంపాదించింది. ఇది రాబోతున్న ప్రభాస్ రాజా సాబ్‌కి కచ్చితంగా కలిసి వచ్చే అంశమే. ప్రభాస్ రాజా సాబ్‌లో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ఇద్దరు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. నిధి అగర్వాల్ వీరమల్లుతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించింది. అమ్మడి కెరీర్‌లోకి ఒకసారి తొంగి చూస్తే మిస్టర్ మజ్ను, సవ్యసాచి సినిమాలు చేసినా క్రేజ్ రాలేదు. ఆ సినిమాల ఫలితాలు నిరాశపరిచాయి. ఐతే పూరీ జగన్నాథ్‌తో చేసిన ఇస్మార్ట్ శంకర్‌తో కమర్షియల్ సక్సెస్ అందుకుంది నిధి అగర్వాల్. ఆ సినిమా ఇచ్చిన బూస్టింగ్ తో వరుస సినిమాలు చేస్తుంది అనుకుంటే గల్లా అశోక్‌తో హీరో సినిమా చేసి ఆ తర్వాత కోలీవుడ్ షిఫ్ట్ అయ్యింది. అక్కడ మంచి పాపులారిటీ తెచ్చుకున్నా ఎందుకో మళ్లీ అమ్మడికి ఛాన్సులు రాలేదు. ఐతే వీరమల్లు సినిమాపై చాలా హోప్స్ పెట్టుకున్న నిధి కరెక్ట్ టైంలో మంచి ప్రమోషన్

# రాజాసాబ్‌తో 'నిధి'కి మళ్లీ క్రేజ్!

సపోర్ట్ చేసింది. పవర్ స్టార్ ఫ్యాన్స్ అయితే నిధి అగర్వాల్‌ని బాగా ఎంకరేజ్ చేస్తున్నారు. ఐతే వీరమల్లుకి చేసినట్టుగానే నిధి అగర్వాల్ రాజా సాబ్‌కి డ్యూటీ చేస్తే మాత్రం తప్పకుండా అమ్మడికి మరింత క్రేజ్ వస్తుంది. ప్రభాస్ రాజా సాబ్ సినిమాను మారుతి డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమా ఈ ఇయర్ డిసెంబర్‌లో రిలీజ్ లాక్ చేశారు. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా టీజర్‌తోనే సంథింగ్ స్పెషల్ అనిపించారు. మరి రాజా సాబ్ నిధి క్రేజ్ కొనసాగింపు చేలా చేస్తుందా లేదా అన్నది చూడాలి. వీరమల్లు క్రేజ్‌తోనే నిధికి ఒకటి రెండు ఆఫర్లు వచ్చే ఊపు కనబడుతుంది. ఇక రాజా సాబ్ కూడా వస్తే కచ్చితంగా టాలీవుడ్‌లో మళ్లీ నిధి హవా మొదలయ్యే ఛాన్స్ ఉంది.



27-7Pg5.qxd:27-7Pg5.qxd 01/01/01 7:27 AM Page 1



# న్యాయవ్యవస్థకు వికేంద్రీకరణ అవశ్యం

### చీఫ్ జస్టిస్ బిఆర్‌గవాయి

**అమ్రావతి,జూలై 26:** న్యాయాన్ని ప్రజల ముంగిటకు చేర్చాలంటే న్యాయ వ్యవస్థను వికేంద్రీకరించడం అత్యవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గవాయ్ స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా దర్యాపూర్‌లో నూతన కోర్టు భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయ మౌలిక సదుపాయాల కమిటీ అధిపతిగా తాను కొత్త తాలూకా, జిల్లా స్థాయి కోర్టుల ఏర్పాటుకు ఒక నమూనాను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనపై పని జరుగుతోందని, కానీ ఎప్పటిలాగే కోర్టులు, ప్రభుత్వంలో ఆలస్యం పరంపరం కొనసాగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు అంతకుముందు పనిచేసిన సీఎంలు కూడా మహారాష్ట్రలో న్యాయ మౌలిక సదుపాయాల పనులకు సానుకూలంగా ఉన్నారని, తగిన నిధులు కూడా సమకూరుస్తున్నారని సీజేఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా



జూనియర్ లాయర్లకు సీజేఐ కీలక సూచనలు చేశారు. కెరీర్‌లో ముందడుగు వేసే ముందు అప్రెంటిస్‌షిప్ చేయాలని సూచించారు. ఆ తర్వాతే సొంత ప్రాక్టీస్ మొదలు పెట్టాలన్నారు. అనుభవం లేకుండా కోర్టులో వాదించి, ఆరు నెలల్లో ఖరీదైన కార్లు కొనాలనుకుంటే సరికాదన్నారు. ఆ ఆలోచనను పునరాలోచించుకోవాలని సూచించారు. న్యాయవాద వృత్తితో వచ్చే స్థాయి, ప్రతిష్ఠ తలకెక్కకూడదని హితవు పలికారు. జూనియర్ లాయర్లు సీనియర్లకు సీటు ఇవ్వకపోవడం తాను చూసినట్లు గుర్తు చేసుకున్నారు. అలాగే, ఒక జూనియర్ న్యాయవాదిని న్యాయమూర్తి మందలించినప్పుడు అతను కోర్టులో స్పృహ తప్పి పడిపోయిన సందర్భాన్ని కూడా చూసినట్లు చెప్పారు. న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఇద్దరూ సమాన భాగస్వాములని పేర్కొన్నారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు ప్రజల పట్ల సేవభావంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. అనంతరం దర్యాపూర్‌లో జరిగిన తన తండ్రి ఆర్.ఎస్. గవాయ్ 10వ వర్ధంతిలో సీజేఐ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కాకుండా, స్థానిక జిల్లా నివాసిగా హాజరైనట్లు సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. ఆయన తండ్రి, కేరళ, బిహార్ గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఏడాది మేలో సీజేఐ పదవిని చేపట్టిన గవాయ్ అప్పటి నుంచి న్యాయవ్యవస్థ వికేంద్రీకరణ ద్వారానే ప్రజలకు సులభంగా న్యాయం అందుతుందని చెబుతూ వస్తున్నారు.

# జస్టిస్ వర్మ అభిశంసనకు అన్నీ సిద్ధం

### కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు

**న్యూఢిల్లీ,జూలై 26:** అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించేందుకు సిద్ధం చేసిన ప్రతిపాదనను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. న్యాయవ్యవస్థలో జరుగుతున్న అవినీతిపై పోరాడేందుకు అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చేందుకు అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు. ఈ తీర్మానానికి మద్దతుగా అధికారంలోని కూటమి, ప్రతిపక్ష పార్టీలకు చెందిన 150 మందికి పైగా ఎంపీలు సంతకాలు చేశారని తెలిపారు. ఎటువంటి సందేహం లేకుండా ఉండండి. జస్టిస్ యశ్వంత్ వర్మను తొలగించే ప్రక్రియ లోక్‌సభలో జరుగుతుందని కిరణ్ రిజిజు అన్నారు. మరోవైపు యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తునకు స్పీకర్, ఓం బిర్లా ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రాజ్యసభలో ఇటువంటి తీర్మానం



కోసం ప్రతిపక్షాలు సమర్పించిన నోటీసును ఎగువ సభ ఆమోదించలేదని, దిగువ సభలో ఈ ప్రక్రియను ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన కరెన్సీ కట్టలు బయటపడటంతో వివాదం మొదలైంది. దీనిపై అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నోట్ల కట్టలు దొరికింది నిజమేనని పేర్కొంది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సూచించారు. అయినా తన పదవికి రాజీనామా చేయడానికి వర్మ నిరాకరించారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి అభిశంసనకు సిఫారసు చేస్తూ ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. యశ్వంత్ వర్మను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయసభల్లో ఎంపీలు అభిశంసన తీర్మానాన్ని ఇచ్చారు. తన వాదన వినకుండానే చర్యలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ జస్టిస్ వర్మ తాజాగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. వర్మ పిటిషన్ నుంచి తప్పుకుంటున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. విచారణ కమిటీలో తాను ఉన్నందున దాన్ని మరో బెంచ్‌కు బదిలీ చేస్తామని పేర్కొన్నారు.

# స్కాట్లాండ్ పర్యటన సొంత గోల్ఫ్ రిసార్టుల ప్రచారం కోసమే

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై విమర్శలు

**వాషింగ్టన్, జులై 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గోల్ఫ్ అంటే ఎంతో ఇష్టం. వీలైనప్పుడల్లా గోల్ఫ్ ఆడుతుంటాడు. అయితే తాజాగా ఆయన స్కాట్లాండ్ పర్యటన విమర్శలకు కారణమైంది. అక్కడ ఆయనకున్న సొంత గోల్ఫ్ రిసార్టుల ప్రచారం కోసమే ఈ పర్యటన చేస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. అయిదు రోజుల పర్యటన కోసం మిలియన్ డాలర్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయనున్నట్లు పలు నివేదికలు అంచనావేశాయి. ఆయన వినియోగించే విమానం 'ఎయిర్‌ఫోర్స్ వన్' ప్రయాణానికి గంటకు 2,73,063 డాలర్లు ఖర్చు అవుతుందట. ఇంత మొత్తం వ్యయంతో ఆయన చేపట్టిన స్కాట్లాండ్ పర్యటన విమర్శలకు కేంద్రంగా మారింది. వాస్తవానికి ట్రంప్ బ్రిటన్ పర్యటన సెప్టెంబర్‌లో ఉంది. కానీ అంతకంటే ముందుగానే అయిదురోజుల పర్యటన కోసం స్కాట్లాండ్ చేరుకోవడం గమనార్హం. అక్కడే ఉన్న సొంత గోల్ఫ్ కోర్సు 'టర్న్‌బెరీ'లో ఆటను కూడా మొదలుపెట్టారు. ఇదే సమయంలో అబెర్డీన్ సమీపంలో కొత్తగా ఓ గోల్ఫ్‌కోర్సును ప్రారంభించనున్నారు. దీంతో సొంత వ్యాపారం ప్రమోషన్ కోసమే ట్రంప్ ఈ పర్యటన చేపట్టారని విమర్శలు మొదలయ్యాయి. అయితే



ఇది అధికారిక పర్యటన అని, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌తోనూ భేటీ అవుతారని అధికారులు చెబుతున్నారు. ఓవల్ ఆఫీస్ ట్రంప్ అనుబంధ సంస్థగా మారిందని, ఆయన బిల్లులను అమెరికా పన్ను చెల్లింపుదారులు కట్టాల్సి వస్తోందని సిఆర్ఇడబ్ల్యు అనే ఓ స్వచ్ఛంద సంస్థ కార్యకర్త జోర్డాన్ లిబోవిట్జ్ ఆరోపించారు. సొంత గోల్ఫ్ కోర్సుల మార్కెటింగ్ కోసం అధికారాన్ని ఉపయోగించుకుంటున్నారని వైట్‌హౌస్ మాజీ ఉద్యోగి, న్యాయవాది రిచర్డ్ పెయింటర్ మండిపడ్డారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌తో పాటు మెరైన్ వన్, వాహనాలను తరలించడంతో కలిపి ఇలా మొత్తంగా స్కాట్లాండ్ ట్రిప్‌కు 3.8 మిలియన్ డాలర్లు ఖర్చు కానున్నట్లు హఫింగ్టన్ పోస్టు కథనం అంచనా వేసింది. రెండోసారి అధికారం చేపట్టిన ట్రంప్ ఈ ఆరు నెలల్లో అనేకసార్లు గోల్ఫ్ ఆట కోసం తన సమయాన్ని కేటాయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే కనీసం 52 మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టినట్లు అంచనా. గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో మొత్తంగా 152 మిలియన్ డాలర్ల ప్రజాధనం గోల్ఫ్ ఆడేందుకు ఖర్చు చేశారనే విమర్శలు ఉన్నాయి.

# ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై భారీ ప్రమాదం

## ఢీకొన్న 20 వాహనాలు.. ఒకరు మృతి, 16 మందికి గాయాలు



**ముంబై, జూలై 26:** వాహనాల రద్దీ విపరీతంగా ఉండే ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై పెద్ద ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 20 వాహనాలు ఢీకొనగా, ఒకరు మరణించారు. దాదాపు 16 మందికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని పుణే జిల్లాలో ఈ ప్రమాద ఘటన జరిగింది. శనివారం సాయంత్రి ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేలోని సొరంగం ప్రవేశద్వారం వద్ద పెద్దప్రమాదం సంభవించింది. హైవేలోని లోనావాలా-ఖండాల ఘాట్ వద్ద కంటెయినర్ వాహనం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. నియంత్రణ కోల్పోయిన ఆ కంటెయినర్ ముందున్న ఒక వాహనాన్ని బలంగా ఢీకొన్నది. దీంతో ముందున్న పలు వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. పలు కార్లతోపాటు సుమారు 20 వాహనాలు దెబ్బతిన్నాయి. కాగా, ఈ భారీ ప్రమాదంలో ఒకరు మరణించగా సుమారు 16 మంది గాయపడ్డారు. వారిని వెంటనే అంబులెన్స్‌లలో ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ ఎక్స్‌ప్రెస్‌వేపై పలు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. 5 కిమీ మేర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మరోవైపు పోలీసులు, ఎమర్జెన్సీ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ధ్వంసమైన వాహనాలను రోడ్డుపక్కకు తొలగించారు. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు చాలా శ్రమించారు. వాహనాల రద్దీ తగ్గించడానికి ఇతరమార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించారు. కాగా, ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన భారీ ప్రమాదానికి సంబంధించిన విడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# అంబులెన్స్‌లో రోగిపై సామూహిక లైంగికదాడి

**పాట్నా,జూలై 26:** హోంగార్డు సెలక్షన్ కోసం హాజరైన మహిళ భౌతిక పరీక్షలో స్పృహ కోల్పోయింది. ఆమెను హాస్పిటల్‌కు తరలిస్తుండగా కదులుతున్న అంబులెన్స్‌లో నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఎన్డీయే అధికారంలో ఉన్న బీహార్‌లో ఈ దారుణం జరిగింది. జూలై 24న బోధ్ గయలోని బీహార్ మిలిటరీ పోలీస్ గ్రౌండ్‌లో హోంగార్డుల నియామకం కోసం ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో పాల్గొన్న 26 ఏళ్ల మహిళ స్పృహ కోల్పోయింది. వెంటనే స్పందించిన అధికారులు అక్కడున్న అంబులెన్స్‌లో ఆమెను హాస్పిటల్‌కు తరలించారు. కాగా, స్పృహ కోల్పోయిన ఆ మహిళపై కదులుతున్న అంబులెన్స్‌లో నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. హాస్పిటల్‌కు తరలించిన తర్వాత వైద్య సిబ్బంది, పోలీసులకు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. ఆమె స్టేట్‌మెంట్ ఆధారంగా బోధ్ గయ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేశారు. ఆధారాల సేకరణకు ఫోరెన్సిక్ బృందాన్ని నియమించారు. మరోవైపు అంబులెన్స్ కదలికలు, హాస్పిటల్‌కు చేరుకున్న సమయానికి సంబంధిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. కదులుతున్న అంబులెన్స్‌లో అపస్మారక స్థితిలో ఉన్న ఆ మహిళపై గ్యాంగ్‌రేప్



జరిగినట్లు నిర్ధారించారు. అంబులెన్స్ డ్రైవర్ వినయ్ కుమార్, టెక్నీషియన్ అజిత్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. పోలీస్ కస్టడీలో ఉన్న వారిద్దరిని ప్రశ్నిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.



# సన్వాలియాసేఠ్‌కు వెండి రివాల్వర్, బుల్లెట్లు కానుకలు

**చిత్తోర్‌ఘర్,జూలై 26:** దేవుళ్లకు బంగారు కిరీటాలు, ఆభరణాలు, డబ్బులు, విలువైన వస్తువులు కానుకలు రావడం సహజం అయితే భగవంతుడికి ఏకంగా వెండి రివాల్వర్, బుల్లెట్ కానుకగా సమర్పించాడు. ఇదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రాజస్థాన్, చిత్తోర్‌గఢ్ జిల్లాలో ప్రసిద్ధ శ్రీ సన్వాలియా సేఠ్ ఆలయం ఉంది. ఇక్కడ శ్రీకృష్ణుడు ప్రధాన దైవం. ఈ ఆలయంలో ఏమైనా కోరుకుంటే, ఆ కోరికలు కచ్చితంగా నెలవేరుతాయని భక్తుల నమ్మకం. ఇలా కోరికలు నెరవేరిన వారు ఈ ఆలయంలో తమ శక్తికొలది కానుకల సమర్పిస్తూ ఉంటారు. అయితే తాజాగా ఓ అజ్ఞాత భక్తుడు దేవునికి వెండి రివాల్వర్, బులెట్ కానుకగా సమర్పించాడు. దీనితో ఇది స్థానికంగా హాట్ టాపిక్ అయ్యింది. దేవునికి ఒక ఆయుధాన్ని సమర్పించడం ఇదే మొదటిసారిని ఆలయ అర్చకులు చెబుతున్నారు. అజ్ఞాత భక్తుడు ఇచ్చిన వెండి రివాల్వర్ దాదాపు 300 గ్రాములు, బుల్లెట్ దాదాపు 190 గ్రాములు ఉంది.ఈ భక్తుడు రెండు వెండి వెల్లుల్లి రెబ్బలను కూడా సమర్పించాడని ఆలయ ఛైర్మన్ జానకీ దాస్ అలియాస్ హజారీ దాస్ వైష్ణవ్ చెప్పారు. దేవునికి కానుకగా సమర్పించిన వెండి రివాల్వర్, బుల్లెట్ ఇదే ఫస్ట్ టైమ్ ఇప్పటి వరకు దేవునికి కానుక ఇచ్చిన వెండి విమానం, ట్రాక్టర్, చేతి సంకెళ్లు వంటి అనేక ప్రత్యేక వస్తువులను చూశాను. కానీ ఒక ఆయుధాన్ని దేవునికి సమర్పించడం ఇదే మొదటిసారి. దీంతో రెండు వెండి వెల్లుల్లి రెబ్బలు కూడా ఇచ్చాడు. దీనిని బట్టి అతను వ్యాపారవేత్తగానీ, రైతు గానీ అయ్యుండవచ్చని భావిస్తున్నా అని ఆలయ పూజారి ఒకరు చెప్పారు. ఎందుకంటే గతేడాది రాజస్థాన్ లో వెల్లుల్లి ధర భారీగా పెరిగింది. బహుశా ఒక రైతు వెల్లుల్లి పండించి, భారీ లాభాలు ఆర్జించి ఉండవచ్చు. అందుకే ఆయన స్వామివారికి వెండి ఆయుధం సమర్పించి ఉండవచ్చని స్థానికులు ఊహిస్తున్నారు. శ్రీ సన్వాలియా సేఠ్ ఆలయానికి వచ్చే భక్తులు వెరైటీ కానుకలు సమర్పించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో భక్తులు వెండితో చేసిన ఇల్లు, పెట్రోల్ పంపు, చేతి సంకెళ్లు, విమానం, ట్రాక్టర్, పది తలల రావణుడి విగ్రహం, ల్యాప్‌టాప్, ఐఫోన్‌లు సమర్పించిన సందర్భాలు ఉన్నాయి. కొందరు భక్తులైతే ఏకంగా పండిన పంటనంతా దేవునికి సమర్పించారు. వెండి పెట్రోల్ పంపు చిత్తోర్‌గఢ్ నుంచి 40 కి.మీ దూరంలోని మాండ్‌ఫియా గ్రామంలో సన్వాలియా సేఠ్ ఆలయం ఉంది. ఇక్కడ నల్లని రంగులో శ్రీకృష్ణుడు కొలువై ఉన్నాడు. ఇక్కడ శ్రీకృష్ణుడిని సేఠ్ అంటే సంపదకు అధిపతిగా పూజిస్తారు. ఈ ఆలయంలో నిజమైన భక్తితో ప్రార్థిస్తే, కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం. అందుకే పూర్ణిమ, ఏకాదశి, జన్మాష్టమి పండుగ సమయాల్లో ఇక్కడకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. సావన్ మాసంలో అయితే భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుంది.

### యుద్ధ విమానానికి ఎదురుగా వెళ్లిన మరో విమానం

## త్రుటిలో తప్పిన పెనుముప్పు

**వాషింగ్టన్, జూలై 26:** సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. లాస్‌ఏంజెలెస్‌లోని హాలీవుడ్ బర్‌బ్యాంక్ విమానాశ్రయం నుంచి శుక్రవారం బయల్దేరిన సౌత్‌వెస్ట్ విమానం గగనతలంలో ప్రయాణిస్తున్న సమయంలో హాకర్ హంటర్ యుద్ధ విమానానికి ఎదురుగా వెళ్లింది. యుద్ధ విమానం రాకను గమనించిన పైలట్లు అకస్మాత్తుగా తమ విమానాన్ని 500 అడుగుల మేర కిందికి దించడంతో ప్రమాదం తప్పింది. అయితే విమానాన్ని కిందకు దించడంలో వచ్చిన కుదుపుల వల్ల విమానంలోని ఇద్దరు సహాయకులకు గాయాలైనట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన




రాడార్ విడియోను ప్రముఖ విమాన ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ 24 సోషల్ మీడియాలో షేర్ చేసింది. విడియోలో యుద్ధ విమానం ఎదురుగా వస్తుండడాన్ని గమనించిన పైలట్లు కేవలం సెకన్ల వ్యవధిలో విమానాన్ని 14,100 అడుగుల నుంచి 13,625 అడుగుల మేర కిందకు దించినట్లు చూపిస్తోంది. రెండు విమానాలు ఒకదానికొకటి దగ్గరగా వచ్చినప్పుడు ఎయిర్ ట్రాఫిక్ అలర్ట్, కొలిషన్ అవాయిడెన్స్ సిస్టమ్ (టిసిఎఎస్) ద్వారా హెచ్చరికను జారీ చేయడంతో పైలట్లు వేగంగా స్పందించగలిగినట్లు అధికారులు పేర్కొన్నారు. తర్వాత విమానాన్ని తన గమ్యస్థానంలో సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇటీవల ఇలాగే మిన్నియాపొలిస్ నుంచి మైనట్‌కు వెళ్తున్న డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం, బి-52 బాంబర్ యుద్ధ విమానాన్ని ఢీకొనబోయింది. వెంటనే స్పందించిన పైలట్లు విమానాన్ని వేగంగా మరోవైపునకు తిప్పడంతో ప్రమాదం తప్పింది. అయితే యుద్ధ విమానం తమకు ఎదు రుగా వస్తున్నట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదని డెల్టా విమాన పైలట్ పేర్కొన్నారు.

# యుఎస్ వీసా, పౌరసత్వ పరీక్షలు మరింత కఠినతరం




**వాషింగ్టన్, జూలై 26:** అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసల అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. వీసా, పౌరసత్వ విధానాలు మరింత కఠినతరం చేసేదిశగా కొత్త ఆలోచనలు చేస్తూనే ఉన్నారు. తమ ప్రభుత్వం నైపుణ్యం కలిగిన కార్మికుల కోసం వీసా వ్యవస్థలో మార్పులు చేయనుందని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ నూతన అధ్యక్షుడు జోసెఫ్ ఎడ్లో ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అమెరికా పౌరసత్వం కోసం నిర్వహించే పరీక్షలు మరింత క్లిష్టంగా మార్చాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు. 'ప్రస్తుతం నిర్వహిస్తోన్న పరీక్షలు ఏమంత కఠినంగా లేవు. టెస్టుల్లో బట్టీపట్టి అప్పగించే సమాధానాలు ఉంటున్నాయి. యుఎస్ ఆర్థిక వ్యవస్థ కోసం హెచ్-1బి వీసాను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై పునరాలోచన చేస్తున్నాం' అని ఎడ్లో పేర్కొన్నారు. ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే దీన్ని సంస్కరించే ప్రయత్నాలు చేపట్టారు. అయితే తర్వాత అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జోబైడెన్ ఆ నిర్ణయాన్ని ఉపసంహరించారు. అమెరికాలో కొత్త ప్రభుత్వం వలసదారులపై కఠినవైఖరి అనుసరిస్తోంది. వీసాల జారీ కోసం 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని హెచ్చరించింది.

# కాల్పుల విరమణకు కంబోడియా పిలుపు

## కంబోడియాలో 13 మంది, థాయ్‌లాండ్‌లో 15 మంది మృతి

### ఐక్యరాజ్య సమితిలో వాడివేడిగా చర్చ

**బ్యాంకాక్, జూలై 26:** థాయ్‌లాండ్- కంబోడియా మధ్య సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో మృతుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ నేపథ్యంలో కంబోడియా తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిచ్చింది. కంబోడియా తక్షణ, బేషరతు కాల్పుల విరమణను కోరుతోందని, దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం చూస్తోందని ఆ దేశ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘర్షణలు ప్రాథమికంగా ప్రియో విహార్, ప్రసాత్ తా, మ్యూన్ థామ్ దేవాలయాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ఇరు దేశాలు పరస్పరం రాకెట్లు, ఫిరంగి దాడులు చేసుకున్నాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఈ ఘర్షణలపై చర్చ జరగ్గా.. కంబోడియా విచక్షణారహిత, అమానవీయ దాడులు చేసిందని థాయ్‌లాండ్ ఆరోపించింది. అయితే, కంబోడియా



రాయబారి థాయ్‌లాండ్ వాదనను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. తాము సంయమనం పాటిస్తున్నామని, దౌత్య మార్గాల ద్వారానే సమస్య పరిష్కారం కావాలి కోరుకుంటున్నామని నొక్కి చెప్పారు. ఘర్షణల కారణంగా కంబోడియాలో ఎనిమిది మంది సైనికులుసహా కనీసం 13 మంది మరణించారు. 35,000 మందికిపైగా ప్రజలు తమ ఇళ్లను వదిలి వెళ్లవలసి వచ్చింది. థాయ్‌లాండ్‌లో 15 మంది మరణించారు. 46 మంది గాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల నుంచి 1,38,000 మందికిపైగా ప్రజలను తరలించారు.

# భారీ వర్షాలతో చార్‌ధామ్ యాత్రకు బ్రేక్



**డెహ్రాడూన్,జూలై 26:** ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. అనేక జిల్లాల్లో జనజీవనం స్తంభించిపోయింది. ఈ వర్షాలు, వరదల కారణంగా చార్‌ధామ్ యాత్రకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగిపడటంతో కేదార్‌నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. రుద్రప్రయాగలో శనివారం తెల్లవారుజామున 3:30గంటల ప్రాంతంలో గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్‌కు వెళ్లే మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి దీంతో అధికారులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. దీంతో కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్‌పడింది. ఆ మార్గంలో రహదారిని క్లియర్ చేసే పనులు కొనసాగుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున నుంచి కొండచరియలు విరిగిపడటం వల్ల ఈ ప్రాంతంలో తొమ్మిది రోడ్లు మూసుకు పోయాయి.

## సంక్షిప్తంగా..

# డబ్లిన్‌లో భారతీయునిపై జాత్యహంకార దాడి

**డబ్లిన్,జూలై 26:** ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లోని టాలాట్ ప్రాంతంలో ఈ నెల 19న సాయంత్రం జరిగిన జాత్యహంకార దాడి అక్కడి భారతీయ సమాజంలో తీవ్ర భయాందోళనలను రేకెత్తించింది. అమెజాన్ ఉద్యోగి అయిన ఒక భారతీయుడి(40)పై టీనేజర్ల గుంపు కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసింది. ఈ ఘటన తర్వాత దక్ష్ అనే భారతీయుడు సోషల్ మీడియాలో 'ఐర్లాండ్ ఇక సురక్షితం కాదు, ఇక్కడికి రాకండి' అని హెచ్చరిస్తూ చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఈ నెల 19న సాయంత్రం 6 గంటల సమయంలో టాలాట్‌లోని పార్క్‌హిల్ రోడ్డులో ఈ దాడి జరిగింది. బాధితుడు ఐర్లాండ్‌కు వచ్చి కేవలం మూడు వారాలు మాత్రమే అవుతోంది.



ఈ దాడిలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావంతో రోడ్డుపై పడి వున్న అతడిని చూసిన స్థానిక మహిళ జెన్నిఫర్ మ్రే అంబులెన్స్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇది కచ్చితంగా జాత్యహంకార దాడేనని మ్రే పేర్కొన్నారు. బాధితుడు టాలాట్ యూనివర్సిటీ ఆసుపత్రిలో చికిత్స పొంది, ఆది వారం ఉదయం డిశ్చార్జ్ అయ్యాడు. ఈ ఘటనను గార్డా (ఐరిష్ పోలీసులు) హేట్ క్రైమ్‌గా దర్యాప్తు చేస్తోంది.

# బాలివుడ్ నిర్మాతపై సీరియల్ నటి దాడి



**ముంబయి,జూలై 26:** బాలీవుడ్ నిర్మాత కరణ్ సింగ్ చౌహాన్ పై సీరియల్ నటి రుచి గుజ్జర్ దాడి చేసింది. కరణ్ సింగ్ నిర్మించిన 'సో లాంగ్ వ్యాలీ'చిత్రం స్క్రీనింగ్ సమయంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. మీడియా ప్రతినిధుల సమక్షంలో రుచి గుజ్జర్ ఆయనపైకి చెప్పు విసిరింది. తనను మోసం చేశాడని, సహ నిర్మాతగా తీసుకుంటానని రూ.24లక్షలు కాజేశాడని రుచి ఆరోపించింది. దీనికి సంబంధించి చౌహాన్ పై మోసం, నమ్మకద్రోహం, బెదిరింపుల కేసు పెట్టానని తెలిపింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రుచి గుజ్జర్ తెలిపిన వివరాల ప్రకారం కరణ్ సింగ్ చౌహాన్ ఓ టీవీ సీరియల్ నిర్మిద్దామని ప్రతిపాదించగా తాను రూ.24 లక్షలు ఇచ్చానని చెప్పింది. అయితే, రోజులు గడుస్తున్నా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కకపోవడంతో తాను కరణ్‌ను నిలదీయగా సాకులు చెప్పి తప్పించుకున్నాడని ఆరోపించింది. దీంతో తన డబ్బు తిరిగివ్వాలని కోరగా బెదిరింపులకు దిగాడని రుచి తెలిపింది. ఈ క్రమంలోనే 'సో లాంగ్ వ్యాలీ' మూవీ స్క్రీనింగ్ సమయంలో నిరసన తెలిపేందుకు వచ్చినట్లు రుచి గుజ్జర్ వివరించింది. ఈ వివాదం నేపథ్యంలో పోలీసులు కల్పించుకుని రుచి గుజ్జర్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారు. కరణ్ సింగ్‌పై నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కార్గిల్ అమరవీరులకు ప్రధాని, రాష్ట్రపతి సంతాపం

**న్యూఢిల్లీ,జూలై 26:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, యుద్ధంలో ధైర్యసాహసాలతో పోరాడిన జవాన్ల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అదే సమయంలో భారత వాయుసేన ఘనంగా నివాళులర్పించింది. కార్గిల్ యుద్ధం నాటి చిత్రాలతో ప్రత్యేక వీడియోను రూపొందించి విడుదల చేసింది. అమరవీరుల ధైర్యం, త్యాగం, దేశ ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందంటూ రాసుకొచ్చింది. జవాన్లు చేసిన త్యాగాలు ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని మోదీ తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. మన దేశాన్ని రక్షించడం కోసం అత్యంత కఠినమైన భూభాగాల్లో అసాధారణ



ధైర్యం, దృఢ సంకల్పంతో పోరాడి ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులర్పిస్తున్నా. కార్గిల్ యుద్ధంలో వారి త్యాగం మన సాయుధ దళాల సంకల్పానికి నిదర్శనం. వారికి ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని పోస్ట్ చేశారు. కార్గిల్‌లో మాతృభూమిని ధైర్యంగా రక్షించిన అమరవీరుల త్యాగానికి నమస్కరిస్తున్నట్లు మల్లికార్జున ఖర్గే పోస్టుచేశారు. త్రివిధదళాలకు, కార్గిల్ అమరవీరుల కుటుంబసభ్యులకు కార్గిల్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. అయితే 1999 మేజులైలో భారత్, పాకిస్థాన్ మధ్య కార్గిల్ యుద్ధం జరిగింది.

27-7Pg6exHMNWJQE.qxd:27-7Pg6exHMNWJQE.qxd 01/01/01 8:12 AM Page 1



# శ్రీసిటీని సందర్శించిన తైవాన్ వ్యాపార ప్రతినిధి బృందం




**సత్యవేడు, జూలై 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్ దేశానికి చెందిన 14 మంది వ్యాపార ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీ దారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మార్క్స్ లిన్ నేతృత్వంలో విచ్చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మార్మట్, శ్రీసిటీ తరపు సీనియర్‌వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. పారిశ్రామిక పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా శ్రీసిటీ ప్రత్యేకతలను వివరిస్తూ శివశంకర్ సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. శ్రీసిటీ వ్యూహాత్మక స్థానం, వివిధ రంగాలపరిశ్రమలు, అత్యుత్తమ సామాజిక మౌలిక సదుపాయాలు, రాష్ట్ర కేంద్రప్రభుత్వాల పారిశ్రామిక అనుకూల విధానాలను హైలైట్ చేశారు. అంతర్జాతీయ తయారీరంగ పరిశ్రమలకు గమ్య స్థానంగా శ్రీసిటీ ప్రాధాన్యతను విశదీకరించారు. తైవాన్‌కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్‌తో కలసి ప్లాంటు సందర్శించారు.

# సిఎం, డిప్యూటి సీఎంల ఓఎస్‌డిల ఘర్షణ

**న్యూఢిల్లీ,జూలై 26:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య నెలకొన్న విభేదాలు మరో మలుపు తిరిగాయి. ఇరువురి సహాయక అధికారుల మధ్య ఘర్షణ జరిగింది. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో వారిద్దరూ భౌతికంగా కొట్టుకునే పరిస్థితికి ఉద్రిక్తతలు దారి తీశాయి. అసిస్టెంట్ రెసిడెంట్ కమిషనర్, సీఎం సిద్ధరామయ్య స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ (ఎస్డీవో) సీ మోహన్ కుమార్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఎస్డీవో హెచ్ ఆంజనేయ మధ్య నెలకొన్న వివాదం తీవ్రమైంది. ఈనెల 22న కర్ణాటక భవన్‌లోని పరిపాలన బ్లాక్‌లో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో షూ తీసి కొడతానని మోహన్ కుమార్ తనను బెదిరించినట్లు ఆంజనేయ ఆరోపించారు. మిగతా అధికారుల ముందు తన పట్ల అసభ్యత, అవమానకరంగా ప్రవర్తించినట్లు విమర్శించారు. కర్ణాటక భవన్ రెసిడెంట్ కమిషనర్ ఇమ్‌కాంగ్లా జమీర్, కర్ణాటక ప్రధాన కార్యదర్శి షాలిని రజనీష్‌కు ఆంజనేయ అధికారికంగా ఫిర్యాదు చేశారు. మోహన్ కుమార్ తనను వేధించడంతోపాటు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, విధులకు పదే పదే అడ్డంకులు సృష్టించారని ఆయన ఆరోపించారు. తనకు ఏదైనా జరిగితే దానికి మోహన్ కుమార్ బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కర్ణాటక ప్రధాన కార్యదర్శి రజనీష్ అధికారిక విచారణకు ఆదేశించారు. రెసిడెంట్ కమిషనర్ నుంచి నివేదిక కోరారు. మరోవైపు డీకే శివకుమార్ ఎస్డీవో హెచ్ ఆంజనేయ తనపై చేసిన ఆరోపణలను సీఎం సిద్ధరామయ్య ఎస్డీవో సీ మోహన్ కుమార్ తిరస్కరించారు. క్రమశిక్షణారాహిత్యం, దుష్ప్రవర్తనకు ఆంజనేయ పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఆంజనేయపై ఇతర సిబ్బంది చేసిన అనేక ఫిర్యాదులను మోహన్ కుమార్ ఉదాహరించారు. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో క్రమశిక్షణను అమలు చేసే ప్రయత్నంగా తన ప్రవర్తనను ఆయన సమర్థించుకున్నట్లు తెలిసింది.

# గత ప్రభుత్వం పోలీసులకు కనీస వెసులుబాట్లు కల్పించలేదు : మంత్రి అనిత

**శ్రీకాళహస్తి,జూలై 26 ప్రభాతవార్త** ఐదేళ్ళు రాష్ట్రాన్ని పరిపాలించిన వైకాపా పాలనలో పోలీసులకు కనీస వెసులుబాట్లు కల్పించలేదని రెండేళ్ళుగా ఆ పాపాలకు పరిహారంగా పరిష్కరించుకుంటున్నామని రాష్ట్ర హోం విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం ఆమె కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. తరువాత జ్ఞాన ప్రసూనాంబ అతిథి గృహం వద్ద మీడియాతో మాట్లాడుతూ పోలీసు శాఖలో సమస్యలున్నాయని అయితే దశల వారిగా పరిష్కరించుకుంటూ వ్యవస్థను చక్కదిద్దుతున్నామని మంత్రి వివరించారు. సిబ్బంది కొరత వాస్తవమే అన్నారు.
దేవాలయాలకు పెరుగుతున్న భక్తులు: తిరుపతిజిల్లాలో ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారని మంత్రి వివరించారు.తిరుమలకు వచ్చే భక్తుల్లో చాలా వరకు తిరుచానూరు,శ్రీకాళహస్తికి వస్తున్నారని మంత్రి చెబుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి శివరాత్రికి ముందు ఇక్కడ సమీక్ష జరిపానని అయితే ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుటకు ప్రణాళికా బద్ధంగా పోలీసులు శాంతి భద్రతలు పరిరక్షణకు చర్యలు తీసుకున్నామన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. పోలీసు వ్యవస్థను ప్రక్షాళన గావించుకుంటూ సదుపాయాలు కల్పిస్తు వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి అనిత వివరించారు.రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దుష్టశక్తుల దృష్టి మన రాష్ట్రం మీద పడకూడదని వెంకటేశ్వరస్వామి, అలివేలుమ ంగమ్మ,శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నామని మంత్రి తెలిపారు.ఉత్సవాల విజయవంతగా నిర్వహించుట భాద్యత అన్నారు. పోలీసు వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి పోలీసు స్టేషన్లో సి సి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని అలాగే డ్రోన్లు ఏర్పాటు చేస్తూ నేర నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అనిత వివరించారు. రాష్ట్రంలో బాధ్యతా యుతమైన పోలీసు వ్యవస్థను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులు చెంచయ్యనాయుడు,విజయకుమార్‌నాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి కాసరం రమేష్, దుర్గా ప్రసాద్, అయ్యప్ప,సుమతిలు పాల్గొన్నారు.

# అవయవదానంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపాలి

## - వైద్య ఉద్యోగుల సంఘ నేత జివివి.ప్రసాద్

**.విజయవాడ,జూలై26,ప్రభాతవార్తప్రతినిది:** "అమ్మ ద్వారా జననం.. అవయవదానం ద్వారా పునర్జన్మం!" ఈ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవయవదానం పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్ అభిప్రాయపడ్డారు. శనివారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయమై తాను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ను స్వయంగా కలవనున్నానని వెల్లడించారు. తనువు మట్టిలో కలిసినా తన అవయవాలతో మరొకరికి జన్మ నివ్వడమే అవయవదానమని, ఈ సత్కార్యంపై ప్రజలకు అవగాహన కల్పించి, అపోహలను తొలగిస్తే కొన ఊపిరితో వున్నా ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనివ్వచ్చన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పక్కా ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అవయవదాన ప్రచార కార్యక్రమం కోసం జిల్లా కేంద్రాల్లో కో ఆర్డినేటర్ లను నియమించి, వారి పర్యవేక్షణలో అన్ని మండల కేంద్రాలు, ముఖ్యప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా, రాష్ట్రం నలుమూలలా స్వచ్ఛంధ సేవా సంస్థలు పుష్కళంగా వున్నాయని, ప్రాణధానమైన అవయవదానంపై ప్రచారానికి ముందుక ంరావాలని ప్రభుత్వం స్వచంధస ంస్థలకు ఒక్క పిలుపునిస్తే మంచి స్పందన వస్తుందని, సేవాభావంతో పనిచేసేందుకు ఎన్నో సంస్థలు తప్పకుండ ముందుకొస్తాయని ప్రసాద్ అన్నారు. ఎంతో పెద్ద మనస్సుతో అవయవదానానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చే ప్రాణదాతలు మరింతగా పెరగాలంటే ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని అవయవదాత ప్రసాద్ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే విషయమై తాను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రిని కలిసి తనకున్న మరిన్ని ఆలోచనలను పంచుకుంటానన్నారు. అదే సందర్భంలో అవయవదాన ప్రచారకర్తగా తాను మంత్రి సమక్షంలో స్వచ్ఛందంగా బాధ్యతలు స్వీకరిస్తానని ప్రసాద్ వెల్లడించారు. ఆగస్టు 13 ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నుంచి ఆరోజు ఈ సత్కార్యం గురించిన స్పష్టమైన ప్రకటన వచ్చేలా ప్రయత్నం చేస్తానని ప్రసాద్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణం

**పెంచలకోన (రాపూరు, నెల్లూరు), జూలై 26, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి వారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు పోటేత్తిపోయారు. శ్రావణ మాసంలో వచ్చిన తోలి శనివారం కావడంతో స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకోంది. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛ రణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి నిర్వహించారు.

# వెంకటేశ్వరస్వామి ఆలయ అష్టబంధన మహాసంప్రోక్షణకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

**వి జ య ా ం ఎ ా డ ా , జూలై 26,ప్ర భాత వార్త ప్ర తినిధి :** విజయవాడ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో అష్టబంధన జీర్ణోద్ధారణ మహాసంప్రోక్షణకు శనివారం సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు మృత్సంగ్రహణము, శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. టీటీడీ అనుబంధ ఆలయాలలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి అష్టబంధన మహా సంప్రోక్షణ చేపట్టడం ఆచారంగా వస్తోంది.ఇందులో భాగంగా జూలై 27వ తేదీ ఉదయం 9 నుండి 12 గంటల వరకు అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం 6.30 గంటలకు కళాపకర్షణ, ఉక్త హోమములు చేపడతారు. జూలై 28న ఉదయం 9 గం.లకు నవగ్రహారాధన, ప్రధాన హోమములు, సాయంత్రం 6.30 గంటలకు ఉక్త హోమములు, కుంభ రాధనలు, అభి మంత్రణము నిర్వహిస్తారు. జూలై 29వ తేదీన ఉదయం 9 గంటలకు సర్వ శాంతి హోమములు, సాయంత్రం 6.30 సర్వ దోషాపశమనార్ధము సహస్రాహుతి హోమములు నిర్వహించనున్నారు.జూలై 30వ తేదీ ఉదయం 9 గంటలకు అష్టబంధన ద్రవ్యా రాధనము, మహా శాంతి హోమాలు, ఉష్ణ బంధనము, అష్టబంధ ప్రయోగము, సాయంత్రం 4 గంటలకు సర్వ దోషప్రాయశ్చిత్త శాంతి హోమాలు, రాత్రి 7 గంటలకు మహా శాంతి తిరుమంజనము, ధాన్యా ధివాసము, సర్వ దైవత్య హోమము నిర్వహిస్తారు.జూలై 31వ తేదీ ఉదయం 7.30 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహించనున్నారు. అనంతరం చిత్త నక్షత్రం, తులాలగ్నంలో ఉదయం 11.25 నుండి మధ్యాహ్నం 12.24 గంటల వరకు కళావాహనం, ప్రథమ కాలార్చన, మహా సంప్రోక్షణ, అక్షతారోహణ, బ్రహ్మ ఘోష తదితర కార్యక్రమాలు జరుగనున్నాయి.



ఈ కార్యక్రమంలో టీటీడీ కంకణభట్టార్ మురళి కృష్ణ స్వామి అయ్యంగార్, రుత్విక్కులుగా వేదాంతం వేంకట శశి కిరణ్ , అర్చకులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం, సూపరింటెండెంట్ ఎమ్.మల్లికార్జున, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీమతి లలిత రమాదేవి పాల్గొన్నారు.

# చర్చల విషయంలో భారత్ తుది నిర్ణయం తీసుకోవాలి, వారి స్పందనకోసం ఎదురుచూస్తున్నాం:పాక్

**న్యూఢిల్లీ, జులై 26:** ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కాళ్లబేరానికి వచ్చిన పాకిస్తాన్‌కు తలబిరుసు మాత్రం తగ్గడంలేదు. ఒకవైపు సీమాంతర ఉగ్రవాదానికి కాలుదువ్వుతూనే భారత్‌తో చర్చలకు సిద్ధమంటూ అంతర్జాతీయ వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలిస్తోంది. తాజాగా పాక్ ఉపప్రధాని, విదేశాంగశాఖ మంత్రి ఇషబ్‌దార్ అదే తరహా వ్యాఖ్యలు చేశారు. చర్చల విషయంలో న్యూఢిల్లీ తుది నిర్ణయం తీసుకోవాలని, ఆ దేశ అధికారిక స్పందన కోసం తాము ఎదురు చూస్తున్నామని వెల్లడించారు. 'వాణిజ్యం, ఆర్థిక సహకారం, ఉగ్రవాదంపై పోరాటం ఇలా ప్రతి అంశంలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు పాక్ సిద్ధంగా ఉంది. ఆ చర్చలు అర్థవంతంగా ఉం డాలి' అని మాట్లాడారు. అయితే కశ్మీర్ అంశం, సరిహద్దు భద్రత, ఆర్థిక సంబంధాల్లో ఉన్న ఆందోళనలపై గతంలోని విధివిధానాల ఆధారం గానే చర్చలు ఉండాలని నిబంధనలు పెట్టడం గమనార్హం. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ తదితర పరిణామాలతో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని హెహబాజ్ షరీఫ్ గతంలో భారత్‌తో శాంతి చర్చల విషయాన్ని ప్రస్తావించారు. చర్చలకు సిద్ధమంటూనే కశ్మీర్, ఉగ్రవాదం, వాణిజ్యం, జలవివాదం సహా అన్ని సమస్యలపై ఇరు దేశాలు చర్చించాలంటూ షరతు విధించారు. పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'ను అమెరికా ఇటీవల ఉగ్రసంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై కూడా ఇషబ్‌దార్ మా ట్లాడుతూ 'టిఆర్‌ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించే అధికారం అమెరికాకు ఉంది. దీనిపై మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. వారి ప్రమే యం ఉందనే ఆధారాలు ఉంటే అలా చేయొచ్చు.



# రైతులకు ఎరువుల కొరత రానివ్వొద్దు: సిఎస్ కె.విజయానంద్

## - కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు

**విజయవాడ, జూలై 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రైతులకు ఎక్కడా యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఆందోళనకు గురిచేస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే డీఏపీ విక్రయిస్తామని పలు ప్రాంతాల్లో వ్యాపారులు నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అటువంటి వారిపై ఈసీ, పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులతో సీఎస్ విజయానంద్ శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో యూరియా లభ్యత, వర్షాల నేపథ్యంలో చెరువులు, కాలువ గట్లకు గండ్లు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి నిర్వహణపై కలెక్టర్లు, అధికారులకు సీఎస్ పలు సూచనలు చేశారు. రైతులు పంటల అవసరానికి మించి యూరియా అధికంగా వాడుతున్నారని, దీనివల్ల భూమి నిస్సారమవుతుందనే అవగాహనను రైతులకు కల్పించాలని సీఎస్ విజయానంద్ సూచించారు. "రసాయన ఎరువులు ఎక్కువ వినియోగించడం వల్ల భూసారం తగ్గి పంట ఉత్తత్తులపై ప్రభావం పడుతుంది. ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలి. రైతులకు అవసరమైన మేర యూరియా అందిస్తాం. భూసారం ప్రకారం శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే రైతులు ఎరువుల వినియోగించేలా చూడాలి. అలాగని యూరియా కొరత ఉందనే అనుమానం రైతుల్లో రేకెత్తకుండా చూడండి. రైతులకు అవసరమైన మేర ఎరువులు అందుబాటులో ఉన్నాయి. యూరియా కొరత ఉందని కొన్ని మాధ్యమాలు, సామాజిక మాద్యమాల్లో అసత్య ప్రచారం జరుగుతోంది. ఇటువంటి కథనాలు వచ్చినచోటు కలెక్టర్లు వెంటనే స్పందించి వాస్తవాలను తెలియజేయాలి. తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రతిరోజూ రైతులకు ఎంత సరఫరా చేశాం, ఎంత నిల్వలు ఉన్నాయనే సమాచారాన్ని మీడియా సమావేశం ద్వారా వివరించాలి. గోడౌన్లు, ఎరువుల దుకాణాలను తరచూ కలెక్టర్లు తనిఖీలు చేయాలి. రైతులతో కలెక్టర్లు, అధికారులు మాట్లాడాలి. ప్రతీ రైతు సేవా కేంద్రానికి అవసరమైన మేర స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలి. నానో యూరియా వాడకంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలి. పీజీఆర్ఎస్ పోర్టల్ నుంచి రైతుల సమస్యలను స్వీకరించాలి" అని సీఎస్ విజయానంద్ అధికారులకు ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సమృద్ధిగా కురుస్తున్న వర్షాలు, ప్రాజెక్టులకు ఎగువ నుంచి వస్తున్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని సీఎస్ విజయానంద్ అధికారులకు సూచించారు. ఉత్తమ నీటి నిర్వహణ విధానాలను అధికారులు తప్పకుండా అమలు చేయాలని అన్నారు. "కోస్తా ప్రాంతంలో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. వచ్చిన వరదనీటిని వచ్చినట్లుగానే ముందుగా దిగువకు విడుదల చేయకుండా సాగునీటి కాల్వలకు మళ్లించాలి. సముద్రంలోకి వృధాగా పోకుండా సాధ్యమైనంత వరకు అన్ని ప్రాజెక్టుల్ని నింపాలి. అన్ని సమ్మర్ స్టోరేజ్ చెరువులను నీళ్లతో నింపుకోవాలి. ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్లు నిరంతరం సమన్వయంతో ఉండాలి. నరేగా అధికారులతో సమన్వయం చేసుకుని చెరువుగట్లు, కాల్వల గట్లకు గండ్ల పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి నిర్వహణ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకునే అవకాశం ఉంది. తుంగభద్ర ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలతో పాటు, రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పరిధిలో ఉండే ముంపు ప్రాంత ప్రజలను సమస్య తీవ్రతను బట్టి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి.

# దుర్గమ్మ సేవకు రిజిస్ట్రేషన్‌లు



దసరా ఉత్సవాలకు సన్నదమవుదాం: ఇఓ వికె శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి, జూలై 26, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో ఈ ఏడాది లో జరగబోయే దసరా ఉత్సవాలకు సన్నదమవుదామని ఇఓ వికె శీనా నాయక్ అధికారుల సమావేశంలో అన్నారు. శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత దసరా ఉత్సవాల తీరుతెన్నులు, భక్తులకు ఏర్పాట్లు, భక్తుల సంతృప్తి గురించి చర్చించారు. ఈ సమావేశంలో ఇఇలు, ఎఇఓలు, అసిస్టెంట్ కమీషనర్. తదితరులు పాల్గొన్నారు. - దుర్గమ్మవారి సేవకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం: శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో సేవ చేయడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఆరంభించినట్లు ఆలయ ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. కనకదుర్గమ్మవారి సన్నిధిలో నిస్వార్థంగా ఉచిత సేవ సేవకులు, భక్తబృందాలకు అధిక ప్రాథాన్యత ఇచ్చి భక్తుల సేవలో వినియోగిస్తామన్నారు. భక్తులకు తాగునీరు అందించడం, ప్రసాద వితరణ, ఉచిత ప్రసాద వితరణ, దర్శనం, క్యూలైన్ల నిర్వహణ, క్లోక్‌రూం, చెప్పులస్టాండ్, మొబైల్ భద్రపరిచే ప్రదేశం, భక్తుల ఫీడ్‌బ్యాక్ కౌంటర్, లిఫ్ట్‌క్యూ వద్ద, దేవస్థానం బస్‌క్యూ వద్ద, పార్కింగ్, టోల్‌గేట్ వద్ద వాహనాల క్రమబద్ధీకరణ తదితర చోట్ల సేవకులు భక్తబృందాల సేవలు అందించేందుకు వినియోగిస్తామన్నారు. సేవ చేయడానికి వచ్చేసేవకులు దేవస్థానం వెబ్‌సైట్ డబ్ల్యు.డబ్ల్యు.కనకదుర్గమ్మ.ఓఆర్‌జిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.. సేవకులు ఎని ్న రోజులు సేవ చేయాలనే అంశం, వసతి, అన్నప్రసాదం, లాకర్ సౌకర్యం, తాత్కాలిక గుర్తింపుకార్డు, వసతి నుండి దేవస్థానంకు రవాణా సదుపాయం వివరాలు మెసేజ్ ద్వారా అందించేలా పారదర్శకంగా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తిభావంతో అర్హత కలిగిన వ్యక్తులను సేవకు వినియోగిస్తామని ఈఓ తెలిపారు. - నిత్యాన్నదా

నానికి విరాళం: దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,56,000 ల విరాళాని ్న గిద్దలూరుకు చెందిన ఏదూరి శ్రీనివాసరెడ్డి శనివారం అందించారు. దాతలకు, వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# 'మనల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం, మహారాష్ట్ర నుంచి ఐటి పార్క్ వెళ్లిపోతోంది.. డిప్యూటీ సిఎం అజిత్ పవార్

**ముంబయి, జులై 26:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. నిర్వహణ లోపం వల్లే హింజెవాడిలోని ఐటి పార్క్ హైదరాబాద్, బెంగళూరుకు తరలిపోతోందంటూ ఆయన మాట్లాడిన మాటలు వైరల్‌గా మారాయి. అజిత్ పవార్ శనివారం ఉదయం పుణె సమీపంలోని పింప్రీ చించ్వాడ్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానికంగా జరుగుతోన్న పనులను గమనించారు. అక్రమ నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో అజిత్‌తో స్థానిక సర్పంచి గణేశ్ బంబూల్కర్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై మీడియా ఎదుటే ప్రశ్నించడంతో డిప్యూటి సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మనల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. హింజెవాడి నుండి ఐటి పార్క్ వెళ్లిపోతోంది. మహారాష్ట్ర నుంచి బెంగళూరు, హైదరాబాద్ తరలిపోతోంది. కానీ మీకు ఏ పట్టింపు లేదు. ఇంత ఉదయం నేను ఇక్కడికి రావాల్సిన అవసరం ఏముంది? ఇక నాకు ప్రత్యామ్నాయం ఏమీ లేదు. కఠినచర్యలు తీసుకోవడం ఒక్కటే మిగిలిఉంది. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కెమెరాలను ఆపండి అంటూ మరోవైపు మీడియా వాళ్లకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంలో భాగమైన ఆయన వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వం: మంత్రి కొల్లు రవీంద్ర



గుండేరు డ్రైన్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూలై 26,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, గుండేరు డ్రైన్ వలన పంట పొలాలు మునిగిపోకుండా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం మంత్రివర్యులు మచిలీపట్నం మండలంలోని చిన్నాపురం గ్రామంలోని గుండేరు డ్రైన్ లో జెసిబి తో గుర్రపు డెక్క తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నాపురం గ్రామ రైతులు మంత్రి వద్దకు వచ్చి మాట్లాడుతూ గుండేరు డ్రైన్ పై ఉన్న పాత వంతెనను పూర్తిగా తొలగించ లేదని, కొత్త వంతెన కింద క్రాస్ బండలు అలాగే ఉన్నాయని, గుర్రపు డెక్క తొలగించకపోవడం వలన పై నుండి వచ్చే వరద నీరు సరిగా ప్రవహించడం లేదని, గతంలో వరదలు వచ్చి చుట్టుపక్కల గల పంట పొలాలు మునిగిపోయి నష్టపోయామని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం మంత్రివర్యులు వెంటనే స్పందించి మాట్లాడుతూ రైతులు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని, పాత మంతెనను తొలగించేందుకు 25 లక్షల రూపాయలు ఇదివరకే మంజూరు చేశామని, ఆ నిధులతో దానిని తొలగించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే క్రేన్ వచ్చి వెళ్లిందని రైతులకు వివరించారు. ప్రధాన వంతెన కింద ఉన్న క్రాస్ బండలు కూడా తొలగించేందుకు ఎంత ఖర్చువుతుందో అంచనాలు రూపొందించాలని మంత్రి డ్రైనేజీ ఇంజనీర్లకు సూచించారు ఆ క్రాస్ బండలు తొలగించేందుకు దాదాపు 10 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ఇంజనీర్లు మంత్రికి వివరించారు. గుండు పాలెం, చిన్నాపురం, చిన్న యాదర పెద్ద యాదర గ్రామాల్లో ఉన్న డ్రైన్ లలో ఈ సంవత్సరం రెండుసార్లు పూడికలు, గుర్రపుడెక్కలు తొలగించేందుకు ప్రభుత్వం 42 లక్షల రూపాయలను మంజూరు చేసిందని, ప్రస్తుతం 9 లక్షల రూపాయల వ్యయంతో చిన్నాపురం గుండేరు డ్రైన్ లో పూడికలు, గుర్రపు డెక్కలు తొలగింపు కార్యక్రమం చేపట్టామణి డ్రైనేజీ ఇంజనీర్ మంత్రికి వివరించారు. తదనంతరం మంత్రివర్యులు గుండేరు డ్రైన్ పై ఉన్న కొత్త వంతెన కింద ఉన్న క్రాస్ బండలు తొలగింపుకు తక్షణమే అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని తన వద్దకు రావాలని ఇంజనీర్లకు సూచించారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జలవనరుల శాఖ కేసి డివిజన్ ఈఈ రవికిరణ్, డి ఈ అపర్ణ, డ్రైనేజీ డిఈ జె.బి. నాయక్, ఏఈలు నజ్మారాణి, హరీష్ మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, కోన నీటి సంఘం అధ్యక్షులు కేశన రమేష్ బాబు, చిన్నాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు పినిశెట్టి నిరంజన్ రావు పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బిసి బిల్లు ప్రవేశపెట్టిందే బిజెపి

## మోడీ కేబినెట్‌లో 27 మంది మంత్రులు వారే

## కాంగ్రెస్ హయాంలో బిసి ముఖ్యమంత్రులెందరు?

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 26, ప్రభాతవార్త:** కులగణన ఒక బూటకమని బిజెపి రాష్ట్ర అధ్య క్షుడు ఎన్ రామచందర్‌రావు ఆరోపించారు. మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళ నంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ కులగణన చేపట్టి 46శాతం బీసీలు ఉన్నారని తేల్చారని, 42శాతం బీసీలకు రిజర్వే షన్ ప్రకటించి అందులో 10శాతం ముస్లింలుక ఇస్తే బీసీలకే మిగిలింది 32 శాతమేనని కులగణన ఒక బూటకమని విమర్శిం చారు. రేవంత్‌రెడ్డి అధికా రంలోకి వచ్చి 19నెలలు కావస్తున్నా నెట్టెంపాడు, జూరాల ప్రాజెక్టు లను పూర్తి చేయలేదని, పాల మూరు రంగారెడ్డి ఎత్తి పోతల ప్రాజెక్టును పట్టిం చుకోవడం లేదని పేర్కొ న్నారు. పాలమూరు తనకు రాజకీయ బిక్ష పెట్టిందని తన ఆత్మ పాల మూరు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎంత మందిని బిసి ముఖ్య మంత్రులు చేశారో చెప్పాలని, మోడీ కేబినెట్లో 27 మంది బీసీ మంత్రులు ఉన్నారని స్పష్టం చేశారు. రేవంత్ కేబినెట్లో కేవలం ఇద్దరు బీసీమంత్రులుకు మాత్రమే అవకాశం కల్పించారని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ హాస్టల్‌లో పిల్లలు చనిపోతున్నా పట్టించు కోవడం లేదని, పురుగుల అన్నం తిని ఆస్పత్రి పాలవుతున్న వారిని అడిగేదిక్కు లేకుండా పోయిం దని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టులను పట్టించు కోకుండా అవార్డుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్తున్నారని ఆరోపించారు. అంతకుముందు పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పార్టీ భారతీయ జనతా పార్టీ జైశ్రీరామ్ అంటూనే గత పార్లమెంటు ఎన్నికల్లో తన ఓటమి కోసం పార్టీలోని కొందరు పనిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని అందుకు సంబంధించిన ఆధారాలన్నీ పార్టీ అధిష్టానానికి ఇవ్వడం జరిగిందన్నారు. అంతకముందు డీకే అరుణ వర్సెస్ బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ కార్యకర్తల మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకున్నది. కార్య క్రమంలో జాతీయ శాంతికుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ కార్య కర్తలు నినాదాలు చేశారు.

# రాష్ట్రంలో పదేళ్లపాటు స్వేచ్ఛాజీవితాన్ని కోల్పోయాం



ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జ్ఞాపికను అందజేస్తున్న ఒయు విసి ప్రొ కుమార్ మొలుగరం, ప్రొ కాశీం తదితరులు

## ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

## వర్సిటీల్లో అధ్యాపకుల నియామకం చేపడతాం

## ఘనంగా ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవాలు

**హైదరాబాద్ (తార్నాక), జూలై 26 ప్రభాతవార్త :** సాధించుకున్న తెలంగాణలో పదేళ్లలో స్వేచ్ఛాజీవితాన్ని కోల్పోయామని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవాల్లో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పాల్గొని మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రారంభం నుంచి ఉన్నతమైన చరిత్రను కలిగి ఉందని, ఇది తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తుందన్నారు. ఉన్నతవిద్యను స్కిల్‌బేస్డ్ నాలెడ్జ్ సెంటర్‌గా ప్రభుత్వ విశ్వవిద్యాల యాలను తయారుచేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. స్కిల్ యూని వర్సిటీని ఏర్పాటు చేశామని అన్నారు. అడ్వాన్స్ ట్రైనింగ్ సంస్థల ద్వారా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి యువతను ఉద్యో గులుగా తీర్చి దిద్దుతున్నామని అన్నారు. విశ్వ విద్యాలయాలల్లో అధ్యాపకుల నియావకం చేయబోతున్నామని అన్నారు. ప్రతి బిడ్డకు ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ భాషగా ఉన్న ఇంగ్లీష్ భాషలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ప్రపంచంతో పోటీపడేవిధంగా విద్యా వ్యవస్థను తీర్చి దిద్దుతున్నామని అన్నారు.

పేద బతుకులు మారాలంటే విద్యను నిర్లక్ష్యం చేయవద్దని, బాగా చదివి తెలంగాణ, దేశ అభివృద్ధిలో భాగం అవ్వాలని సూచించారు. ప్రభుత్వం విద్య, వైద్యంపై దృష్టిసారించిందన్నారు. రాష్ట్రంలో 104 యంగ్ ఇండియా స్పోర్ట్స్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలను ప్రారంభిస్తున్నామని అన్నారు. వీటి వల్ల తెలంగాణ ముఖ చిత్రం మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

పబ్లిక్ యూనివర్సిటీలలో ఉన్న అన్ని బకాయిలను చెల్లిస్తున్నట్లు ప్రకటించారు. ఆడిటోరియం నిర్మాణం కోసం అవసరమైన చర్యల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రకటించారు.

కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్ గా వ్యవహరించిన ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం మాట్లాడుతూ ఓ.యూ ఆర్ట్స్ కళాశాల చాలా చైతన్యవంతంగా పనిచేస్తుం దన్నారు. నిరంతరం విద్యార్థులతో అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలతో నిండుగా కొనసాగుతుందని అన్నారు. గత ఎనిమిది నెలల్లో కళాశాలలో గుర్తించదగ్గ మార్పులు వచ్చాయని, దీనికి కారణమైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం, సిబ్బంది అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ కళాశాల వార్షిక రిపోర్టును ప్రవేశపెట్టారు. ఆర్ట్స్ కాలేజీలో ప్రతిభావంతమైన విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వం నిర్వహించే అనేక ఉద్యోగ నోటిఫికేషన్లలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులే ఎక్కువగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓ ఎస్ డి ప్రొ. ఎస్. జితేందర్ నాయక్, యూజిసి డీన్ ప్రొ. బి. లావణ్య, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొ. సయద్ తలాత్ సుల్తాన, వైస్ ప్రిన్సిపాల్స్ డా. కొండా నాగేశ్వరరావు, డా. బాలు నాయక్, డా. పి. స్వాతి, డా. సి. ఎస్. స్వాతిలతో పాటు వివిధ శాఖల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద యెత్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసారు.

వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి. టీచింగ్ అండ్ నాట్ టీచింగ్ స్టాఫ్ చేసిన అంత్యాక్షరి కార్యక్రమం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

# జిల్లాకు రూ.కోటి చొప్పన రూ.33 కోట్లు విడుదల

## వర్షాలు, వరదలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూలై 26:** రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా ప్రతి జిల్లాకు రూ.కోటి చొప్పన నిధులను కేటాయించింది. తాజాగా ఆ నిధులను విడుదల చేస్తూ జిఓ జారీ చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు జిల్లాకు ఒక కోటి రూపాయల చొప్పున రూ.33 కోట్లను విడుదల చేసింది. ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించేందుకే ఈ తక్షణ నిధులు అవసరపడుతాయని ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా విపత్కర సమయాల్లో వాడుకునేందుకు కలెక్టర్లకు అత్యవసర నిధిని కేటాయిస్తామని జిల్లా కలెక్టర్లతో సిఎం సమీక్షలో ఇటీవల హామీనిచ్చారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని సిఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేయాలని సిఎం రేవంత్ ఇప్పటికే ఆదేశించారు.



మంద కృష్ణమాదిగను శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

# అలయ్ బలయ్ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జూలై 26, ప్రభాతవార్త:** కూకట్‌పల్లిలోని బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్‌లో మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన యస్.సి., యస్.టి., బి.సి., మైనారిటీల అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దళిత, బహుజన, పీడిత వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న దళిత నాయకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగకి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని, మంద కృష్ణ మాదిగని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ మంద కృష్ణ దశాబ్దాలుగా దళితుల వర్గీకరణ, హక్కుల కోసం చేపట్టిన ఉద్యమాలు తెలుగు రాష్ట్రాల్లో చరిత్రలో నిలిచిపోతాయని, రాష్ట్రపతి చేతులు మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకోవడం చాలా గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

# తక్కువ ఖర్చుతో చతుర్వేద జలవివాదాన్ని పరిష్కారించుకోవచ్చు: మర్రి శశిధర్‌రెడ్డి

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 26. ప్రభాతవార్త:** అతి తక్కువ ఖర్చుతో విశ్రాంత చీఫ్ ఇంజనీర్ హనుమంతరావు రూపొందించిన చతుర్వేద జల వివాదాన్ని అనుసరిస్తే వివాధాలు పరిష్కారం అవుతాయని, మూడు పంట లకు సాగునీటి సౌకర్యం రైతులకు కల్పించవచ్చునని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'రివర్ వాటర్ డిస్టిబ్యూటర్ ్ర ప్యాక్ట్స్' అనే అంశంపై నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. తాగు, సాగు నీటి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టు పూర్తి కావడానికి లక్షా 20 కోట్ల ఖర్చు అవుతుందని, చతుర్వేద విధానం ద్వారా ఈ ఖర్చును తగ్గించి ప్రాజెక్టును నిర్మించవచ్చునని, ఈ విషయంపై తాను ఎపి సిఎం ఎన్.చంద్రబాబునాయుడికి లేఖ రాస్తానని తెలిపారు. ఆదే విధంగా కోడంగల్ లిఫ్ట్ పథకంపై సిఎం రేవంత్‌రెడ్డికి కూడా లేఖ రాస్తానన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్టుకు ఎపి ప్రభుత్వం 81 వేల 1000 కోట్ల రూపాయల అంచనా వేసిందని, ఆది పూర్తి అయ్యేనాటికి లక్షా 20 కోట్లకు పెరుగుతుందన్నారు. దీనికోసం 54 వేల ఎకరాల భూసేకరణ, అందులో 15 వేల 300 ఎకరాలు అటవీ ప్రాంతం ఉందన్నారు. 30 లక్షల ఎకరాలకు నీరు అందించడానికిగాను ఎకరానికి లక్ష రూపాయల ఖర్చుతో ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని, అయితే చతుర్వేద జల విధానం ద్వారా కేవలం 4 వేల రూపాయల ఖర్చుతో ఈ ప్రాజెక్టును నిర్మించవచ్చునన్నారు. చతుర్వేద విధానాన్ని రాజస్తాన్ ప్రభుత్వం అనుసరించి మంచి మంచి ఫలితాలను సాధించిందని, వర్షపు నీరు ఒక్క చుక్క కూడా వృదా కాకుండా రైతులు పంటలు పండించుకుంటున్నారని, ఈ విధానాన్ని తెలుగు రాష్ట్రాలు అనుసరిస్తే రైతులకు మేలు జరుగుతందని మర్రి శశిధర్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్‌ఆలీ, రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగఢ కోటయ్య జయంతి వేడుకలు

తాడేపల్లి,జూలై 26,ప్రభాతవార్త : వైసీపి మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ప్రగఢ కోటయ్య 110వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.శనివారం ఉదయం మంగళగిరి బైపాస్ రోడ్డులోని మంగళగిరి నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ప్రముఖ జాతీయ ఉద్యమ నాయకుడు,చేనేత పరిశ్రమ రక్షణ కోసం పోరాటం చేసిన యోధుడు ప్రగడ కోటయ్య 110వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.కార్యక్రమానికి



ముఖ్యఅతిధులుగా శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు,మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత ముద్దుబిడ్డ,గొప్ప వ్యక్తి అయిన ప్రగఢ కోటయ్య జయంతి వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని,ఆయన జీవితం మొత్తం చేనేత పరిశ్రమకోసం,చేనేతల కోసం ఎంతో శ్రమించారన్నారు.ఇన్‌చార్జి వేమారెడ్డి మాట్లాడుతూ ప్రగఢ కోటయ్య చేనేత రంగానికి తన జీవితాన్ని ధార పోశారు.అప్పట్లో ప్రభుత్వాలు కూడా చేనేతలకు,చేనేత రంగానికి ఎలా సహకరించాలో,ఎలా ఆదుకోవాలని సలహాలు ఇచ్చిన మహా మేధావి ఆయన,దేశంలో వ్యవసాయ రంగం తరా ్వత అంతపెద్ద స్థాయిలో ఆధారపడి జీవనం సాగిస్తున్న రంగం చేనేత రంగం,చేనేత రంగం చేనేత శ్రామికులు ఇవాళ కొన్ని ఫలాలు అనుభవిస్తున్నారంటే అది ప్రగఢ కోటయ్య కృషి పోరాటం మాత్రమే.కార్యక్రమంలో వైసీపీ నాయకులు,పట్టణ గౌరవాధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు,మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్,గుంటూరు జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఊట్ల పాల శ్రీనివాసరావు,రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి గంజి షణ్ముక్,మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ గౌస్ మొహిద్దీన్,మంగళగిరి మండల ఉపాధ్యక్షులు షేక్ గౌస్,మంగళగిరి మండలం ప్రధాన కార్యదర్శి ఆర్దల చిన్నారి యాదవ్,మంగళగిరి నియోజకవర్గ ఇంటలెకు ్చవల్ విభాగా అధ్యక్షులు జంగా నాగిరెడ్డి,మంగళగిరి నియోజకవర్గ సోషల్ మీడియా విభాగ అధ్యక్షులు భీమిరెడ్డి శరన్ కుమార్‌రెడ్డి,తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రైనేజీల్లో పూడికలు తీత పనులు

**గుంటూరు తూర్పు, జులై 26 (ప్రభాతవార్త) :** మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా ముందుకెళ్ళుతున్నాయి. కార్పోరేటర్ షేక్ ఖాజా మొయినుద్దీన్ చిష్టి గత 35సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సిసి రోడ్డులు, సిసి డ్రైన్‌లు ఒక ప్రణాళిక బద్ధంగా పూర్తి చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని లోతట్టు రోడ్లు,



చిన్న వర్షం వస్తే మోకాళ్ళలోతులో వర్షపు నీరు నిలిచి డివిజన్ ప్రజలకు స్కూలుకి వెళ్ళే విద్యార్ధులకు ఆటంకంగా మారుతున్న నేపధ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు పాత గుంటూరు ప్రాంతం జలమయం అవటంతో మహిళలు, స్కూల్‌కు వెళ్ళి విద్యార్ధులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీల్లో పూడికలు పేరుకుపోవడంతో డ్రైనేజీలోని బురద రోడ్ల మీదకి చేరి విపరీతమైన దుర్గంధం ఏర్పడుతుంది. శనివారం వర్షం లేకపోవడంతో డివిజన్ కార్పోరేటర్ ఖాజా మొయినుద్దీన్ చిష్టి కార్పోరేషన్ పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజి పూడికలను దగ్గరుండి తీపించారు. గుంటూరు లాలాపేట, నూకాలమ్మ, టెంపుల్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సెయింట్ పాట్రిక్ స్కూల్, హెచ్‌పి పెట్రోల్ బంక్‌లైన, ఇక్బాల్ మసీద్‌లైన్ మూర్తి ఫ్యాషన్ లైన్ వరకు భారీ ఎత్తున సిసి రోడ్డు సిసి డ్రైన్ నూతనంగా నిర్మాణం పూర్తయినది. దీనికి సహాయ సహకారాలు అందించిన ఎంపి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు కమీషనర్ పులి శ్రీనివాసులు అందరి సహాయ సహకారాలోత 12వ డివిజన్లో పనులు వేగ వంతంగా జరుగుతున్నాయని కార్పోరేటర్ షేక్ ఖాజా మొయినుద్దీన్ చిష్టి తెలిపారు. 12వ డివిజన్ పరిధిలో ఎన్నో ఏళ్ళుగా పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు, కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధుల అందరి సహకారంతో త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.

# ఇందిరా రికార్డును అధిగమించిన మోడీ

## పొలిటికల్ సైంటిస్ట్ హనుమంతుయాదవ్

పిడుగురాళ్ల, జూలై 26 ప్రభాతవార్తః దేశంలో వరుసగా ప్రధాని పదవిని చేపట్టి ఎలాంటి విరామం లేకుండా సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న రెండో నేతగా ఇందిరాగాంధీ పేరిట ఉన్న రికార్డును ప్రధాని మోదీ అధిగమించారని పొలిటికల్ సైంటిస్ట్ హనుమంతుయాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2014లో తొలిసారి ప్రధాని అయిన మోదీ శుక్రవారంతో 4078 రోజులు పూర్తి చేసుకున్నారన్నారు. దివంగత ఇందిరాగాంధీ తరువాత ఎక్కువ రోజులు ప్రధానిగా ఉన్నారన్నారు. దేశ తొలి ప్రధాని నరేంద్రమోదీ మొదట ఈ రికార్డు సాధించారన్నారు.

# గర్భిణీలు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలి

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి

**మంగళగిరి, జులై 26, ప్రభాతవార్త :** గర్భిణీలు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. నగర పరిధిలోని ఇందిరా నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మాతృ శిశు ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 డిజిగ్నేటెడ్ డే సందర్భంగా 40 మంది గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ సప్లిమెంట్లు, తాజా పండ్లను




పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కే విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భధారణ సమయంలో ప్రోటీన్ సప్లిమెంట్లు, తాజా పండ్లు తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరికీ అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ప్రోటీన్ సప్లిమెంట్లు శిశువు పెరుగుదలకు, కండరాల వృద్ధితో పాటు బరువు పెరిగేందుకు సహాయపడతాయని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ... తాజా పండ్లు విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ ను అందిస్తాయన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచడం ద్వారా తల్లి ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించడం సాధ్యపడుతుందని, తద్వారా భవిష్యత్తులో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చునన్నారు. చీరాల రోటరీ క్లబ్ ప్రతినిధి కరణం శ్రీనివాస బాబు మాట్లాడుతూ... గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, కావున తాజా పండ్లు, ప్రోటీన్ సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్యకరమైన బరువు పెరగడానికి సహాయపడుతుందన్నారు. యూపీ హెచ్ సీ వైద్యాధికారిణి డాక్టర్ పరుచూరి అనూష మాట్లాడుతూ... ప్రోటీన్ సప్లిమెంట్లు శిశువు కణజాలం అవయవాల అభివృద్ధికి దోహదపడుతాయని, కావున గర్భిణీలు బలవర్ధకమైన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రోటరీ క్లబ్ కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, కోశాధికారి కెవిఎస్ ప్రకాశరావు, డైరెక్టర్ సర్వీస్ ప్రాజెక్ట్ చనుమోలు గోపాల్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, త్రిపుర మల్లు సతీష్ లతో పాటు పలువురు యూపీహెచ్ సీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో ప్రత్యక్ష శస్త్రచికిత్స ప్రదర్శన

మంగళగిరి, జూలై 26, ప్రభాతవార్త : టిసిటి ఇండియా 2025 సదస్సులో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ తన వైద్య నైపుణ్యాన్ని, అత్యాధునిక సాంకేతికతను ప్రదర్శిస్తూ అత్యంత సంక్లిష్టమైన హృదయ శస్త్రచికిత్సను ప్రత్యక్షంగా నిర్వహించింది. ఈ మేరకు వివరాలను శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు.73 ఏళ్ల వయస్సు గల రోగి మీద ఈ శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ఇతనికి తీవ్రమైన క్యాల్సిఫైడ్ కొరోనరీ లెషన్లు (సున్నితపడిన హృదయ ధమని అవరోధాలు) ఏర్పడగా ఈ చికిత్సను నిర్వహించినట్లు తెలిపారు. ఈ చికిత్సలో లెషన్ సిద్ధీకరణకు ఆర్బిటల్ అథెరెక్టమీ.... (orbital atherectomy) స్టెంట్ ఖచ్చితంగా ఉంచడానికి ఆల్ట్రియాన్ 2.0 వీదిగి.... (Optical Coherence Tomography) సాంకేతికత ఉపయోగించినట్లు చెప్పారు. ఈ అత్యుత్తమ చికిత్స ఎన్టీఆర్ వైద్య సేవ పథకం క్రింద ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. వనరులు లేని రోగులకు ప్రపంచ తరహా వైద్యం అందించాలన్న ఈ సంస్థ యొక్క నిబద్ధతను ఇది మళ్లీ నిరూపించిందనీ చెప్పారు. ఈ అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులను, వైద్య బృందాన్ని అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు ప్రశంసించారు. డా. జాన్ సతీష్, డా. అవుల సురేంద్ర ల పర్యవేక్షణ లో శస్త్రచికిత్స బృందం లో డా. కృష్ణ ప్రసాద్, డా. సుభాష్, డా. రఘునందన్, డా. రవితేజ లు పాల్గొన్నారు.



# మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల, జూలై 26 ప్రభాతవార్తః** ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కాపు కళ్యాణ మండపానికి స్థలం, రూ. 50 లక్షల నగదు మంజూరు చేయించారు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఈ మేరకు కాపు సంఘ నేతలు శనివారం ఎమ్మెల్యే యరపతినేనిని కలిసి దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. మాటలు చెప్పే నేతలు చాలా మంది ఉన్నారు గానీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తి ఎమ్మెల్యే యరపతినేని అంటూ కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని, కళ్యాణ మండపం కొరకు అవసరమైతే భవిష్యత్‌లో కూడా నిధులు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు నేతలు ఆకుల నాంచారయ్య, సుధాబాలకోటేశ్వరరావు, గుబ్బా విజయసారధి మాష్టారు, కొమ్మ మహేష్, మల్లెంశెట్టి లక్ష్మణరావు, కామిశెట్టి రంగా, బస్వల ఆజాద్, ఆముదాల చిన గంగయ్య, గుర్రం కోటేశ్వరరావు, భవిరిశెట్టి శ్రీను, బేతంచర్ల ప్రసాద్, గాజుల మల్లి, తిప్పనబోయిన వెంకట్రావు, సూరి, బేతంచర్ల నాగేశ్వరరావు, ప్రసాద్, చింతా వెంకటశివరావు, మెండు సుబ్రహ్మణ్యం, చిందుకూరి నాగేంద్ర, మణికంఠ స్టూడియో రాము, రామిశెట్టి శేఖర్, బేతంచర్ల వెంకటేశ్వర్లు, కొమ్మ లక్ష్మీనారాయణ, గోపిశెట్టి సాయి, నూతి అరుంధతి, వీఎస్ఎన్ ప్రసాద్, యలమల నాగేశ్వరరావు, జువ్వెనబోయిన రామారావు, నెకరికంటి శివ, కామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక సందేశం

**నరసరావుపేట, జూలై 26 ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు శనివారం ఆధ్యాత్మిక సందేశం అందించారు. వేదాంత బేరీ ప్రవచనం కార్యక్రమాన్ని స్థానిక పట్టాభిరామస్వామి దేవస్థానంలో నాగసరపు



రామారావు ట్రస్ట్, ఆధ్యాత్మిక తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత వారికి శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా కుటుంబసభ్యులతో కలిసి స్వాగతం పలికి సత్కరించారు. నరసింహారావు తన ప్రవచనంలో ఆధ్యాత్మిక సందేశాలతో ఉదాహరణలతో భక్తులను ఉత్తేజపరిచారు. వేదాంత సూత్రాలు, జీవన విలువలు, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సరళంగా వివరించారు. రామాయణం, భాగవతం వంటి గ్రంథాల నుండి ఉదాహరణలతో ఆయన చేసిన ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది.

# ఐడిపిఎస్ పాఠశాలలో కార్గిల్ విజయ్‌దివాస్

**రొంపిచర్ల, జూలై 26 ప్రభాతవార్త :** ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం కార్గిల్ విజయ్‌దివాస్‌ను నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. దేశభక్తి గేయాలు పాడుతూ జాతీయ జెండాను ఎగురవేశారు. ఛైర్మన్ నాగోతు ప్రకాష్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన వీరజవాన్‌లకు నివాళులర్పించారు. దేశం మొత్తం వారి త్యాగాలను గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

# బోధి పాఠశాలలో కార్గిల్ దివాస్ వేడుకలు

పిడుగురాళ్ల, జూలై 26 ప్రభాతవార్తః బోధి పాఠశాలలో శనివారం కార్గిల్ దివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎయిర్‌ఫోర్స్ రంగంలో ప్రఖ్యాతి గాంచిన ఎన్ఎస్ భాస్కరరెడ్డి విచ్చేశరు. ఈయన ఎయిర్‌ఫోర్స్ టెక్నికలన కాలేజీ ఫర్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్‌లో 2 నవంబరు 1982లో చేరి తదుపరి గాలోయిర్ రష్యన్ ఎయిర్ క్రాఫ్ట్ మిగ్ మిర్రజ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా, ఎలక్ట్రానిక్స్ వార్ఫేర్‌గా, హైదరాబాద్ హకింపేట్‌లో కాలిబ్రేషన్ ఆఫీసర్‌గా, కార్గిల్ వార్‌లో లేజర్ బాంబ్ టీం వాలింటీర్‌గా పలు సంస్థలలో పనిచేసి దేశానికి ఎనలేని సేవలందించి 30 నవంబరు 2002లో వాలంటరీ రిటైర్డ్ అయ్యారు. అటువంటి వ్యక్తి పాఠశాలకు విచ్చేయడం గర్వకారణమని కరస్పాండెంట్ సునీతారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి ఎయిర్‌ఫోర్స్, కార్గిల్ వార్‌లో తన అనుభవాలను తెలియజేశారు. దేశభక్తి, యువత బాధ్యతలు, ధైర్య నైపుణ్యాలపై విద్యార్థులకు సందేశానిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం భాస్కర్‌రెడ్డిని దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# అంజిరెడ్డి వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం

**రొంపిచర్ల, జూలై 26 ప్రభాతవార్త :** నరసరావుపేట అంజిరెడ్డి హాస్పిటల్స్‌లో 28న సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం కోరారు. రూ.10వేల విలువ చేసే అన్ని రకాల వైద్య పరీక్షలు పూర్తి ఉచితంగా చేయటం జరుగుతుందన్నారు. సిబిపి, ఆర్‌బిఎస్, ఈసీజీ, 2డి ఎకో, ఎక్స్‌రే, యూరిన్ టెస్ట్, నాజల్‌ఎండోస్కోపి టెస్టులు పూర్తి ఉచితంగా చేయటం జరుగుతుందన్నారు. అదే విధంగా గ్యాస్ట్రబుల్, కడుపులో నొప్పి,మంట, లివర్ వాపులతో పాటు గుండె సంబంధిత వ్యాధులు, బిపి, షుగర్, థైరాయిడ్, విషజ్వరాలు వంటి జనరల్ వ్యాధులు, చెవి, ముక్కు ఆరోగ్య సమస్యలు, ఎముకలు, కీళ్ల వ్యాధులు, మోకాళ్ళ నొప్పులుకు, అపెండిక్స్, మొలలు, ఫైల్స్, పిత్తాశయంలో రాళ్ళకు సంబంధించి ఉచిత వైద్యసేవలు శిబిరంలో అందిస్తామన్నారు. పాత రిపోర్టులు, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు.

# కౌలు కార్డు తప్పనిసరిగా పొందాలి : ఏవో సంధ్యారాణి

పిడుగురాళ్ల, జూలై 26 ప్రభాతవార్తః ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున పొలం కౌలుకు సాగు చేసుకునే రైతులు తప్పనిసరిగా కౌలు కార్డు పొందాలని ఏవో సంధ్యారాణి అన్నారు. శనివారం కౌలు కార్డు పొందిన రైతులకు కలిగే ప్రయోజనాలు, పంట నమోదు, రాయితీపై విత్తనాలు, పంట నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, ప్రభుత్వం ద్వారా పంట మద్దతు దరకు అమ్ముకునేందుకు, సున్నా వడ్డీ పంట రుణాలుపై రైతులకు వివరించారు. కౌలు రైతు కార్డు కోసం యజమాని పొలం పాస్ బుక్, కౌలు రైతు ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు, పాస్‌పోటోతో వీఆర్వోను సంప్రదించాలన్నారు. కౌలు కార్డు పొందిన తరువాత గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలన్నారు.

# చంద్రబాబునాయుడు కాలనీలో పౌష్టికాహారం పంపిణీ

ఫిరంగిపురం, జూలై 26 ప్రభాతవార్త : పట్టణంలోని చంద్రబాబునాయుడులో పౌష్టికాహారం పంపిణీని శనివారం నిర్వహించారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కమ్యూనిటీహాల్లో నిర్వహించారు. గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ మేకల సునీత ముఖ్యఅతిథిగా హాజరై పౌష్టికాహారాన్ని అందజేశారు. రోటరీక్లబ్ అధ్యక్షులు షేక్ కరీమ్ మొహిద్దీన్, మాజీ గవర్నర్ తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, సుమిత్రకుమార్, ఎస్.కె.జిలానీమాలిక్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డాక్టర్ మేకల సునీత మాట్లాడుతూ పౌష్టికాహారం తగినంత తీసుకోవడంతో పాటు విశ్రాంతి కూడా తీసుకోవాలన్నారు. బాలింతలు ప్రసవం తర్వాత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బిడ్డ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. పాలు, గుడ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు ఎంతో విలువైన విటమిన్‌లను శరీరానికి అందిస్తాయని తెలియజేశారు.

27-7pg10.qxd:27-7pg10.qxd 01/01/01 7:26 AM Page 1



## ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో..
# భారత్ యువ షటర్లు తన్వి, వెన్నెల జోరు

**న్యూఢిల్లీ:** ఇండోనేషియాలోని సోలోలో జరిగిన బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్స్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్-2025లో భారత యువ షట్లర్లు తన్వి శర్మ మరియు హైదరాబాద్‌కు చెందిన కలగోట్ల వెన్నల జోరు చూపుతున్నారు. ఈ టోర్నమెంట్‌లో తమ అద్భుతమైన పరుగును కొనసాగించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ తన్వి తన ఆధిపత్య ఫామ్‌ను కొనసాగించింది, 35 నిమిషాల వేగవంతమైన పోరాటంలో ఇండోనేషియాకు చెందిన ఐదవ సీడ్ థలితా రామధాని విర్యావన్‌ను 21-19, 21-14 తేడాతో ఓడించింది. టోర్నమెంట్ అంతటా తన్వి అద్భుతమైన ప్రదర్శనతో ఇప్పటివరకు వరుస గేమ్‌లలో అన్ని విజయాలను సాధించింది. ఇక చివరి నాలుగు స్థానాల్లో కలగోట్ల వెన్నల కూడా చేరింది, ఆమె 58 నిమిషాల పాటు జరిగిన పోటీలో థాయిలాండ్‌కు చెందిన జన్యపోర్న్ మీపాంతోంగ్ నుండి బలమైన సవాలును



ఎదుర్కొంది. వెన్నల పదునైన ర్యాలీలతో ప్రారంభ గేమ్‌ను 21-18తో గెలుచుకుంది, కానీ జన్యపోర్న్ రెండవ గేమ్‌ను 21-17తో ఆధిక్యంలోకి నెట్టి, మ్యాచ్‌ను నిర్ణయాత్మకంగా మార్చింది. చివరి గేమ్‌లో వెన్నల ఎట్టకేలకు 21-18, 17-21, 21-17 తేడాతో విజయం సాధించి తన సెమీఫైనల్ బెర్తును సంపాదించుకుంది. ఇక పురుషుల డబుల్స్‌లో టాప్ సీడ్లు భార్గవ్ రామ్ మరియు విశ్వ తేజ్ 21-15, 21-15 తేడాతో జపాన్‌కు చెందిన హరు మసుదా మరియు షోగో మియాషితను ఓడించి రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో రౌనక్ చౌహాన్ 25-23, 21-18 తేడాతో థాయిలాండ్‌కు చెందిన ఉచ్చున్ రుయాసాప్‌ను ఓడించగా, అన్ష్ నేగి 21-14, 21-16 తేడాతో వియత్నాంకు చెందిన లే మిన్ సన్‌ను ఓడించి, ఇద్దరూ రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నారు.



## టాంపరే ఓపెన్‌లో..
# సెమీస్‌కు సుమిత్

**న్యూఢిల్లీ:** టాంపెరే ఓపెన్-2025లో భారత్ ప్లేయర్ సుమిత్ నాగల్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. క్వాలిఫైయర్ నికోలస్ కిక్కర్‌పై వరుస సెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత, ఫిన్లాండ్‌లో జరిగిన టాంపేర్ ఎటిపి ఛాలెంజర్ ఈవెంట్‌లో సుమిత్ సింగిల్స్ సెమీఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. 306వ ర్యాంక్‌లో ఉన్న నాగల్, సింగిల్స్ ఎటిపి చార్టులో 361వ ర్యాంక్‌లో ఉన్న కిక్కర్‌పై 6-4, 6-3 తేడాతో విజయం సాధించాడు. ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇది మూడో మ్యాచ్. నాగల్ ఇప్పుడు హెడ్ టుహెడ్ రికార్డులో 2-1తో ఆధిక్యంలో ఉన్నాడు. వీరిద్దరూ చివరిసారిగా 2022లో తలపడగా, అందులో కిక్కర్ గుయాక్విల్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచాడు. 28 ఏళ్ల ఈ భారతీయుడు తన ప్రత్యర్థిపై 67 పాయింట్లకు 51 పాయింట్లు సాధించాడు. క్రమంగా ఫామ్‌లోకి తిరిగి వస్తున్న నాగల్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ముగింపును సాధించాడు. నాగల్ 10 ఫైనల్స్ నుండి ఆరు ఛాలెంజర్ సింగిల్స్ టైటిళ్లను గెలుచుకున్నాడు. ఇక అమెరికాలో జరిగిన క్రాన్‌బ్రూక్ టెన్నిస్ క్లాసిక్‌లో పోటీ పడుతున్న భారత రెండవ సీడ్ జంట అనిరుధ్ చంద్రశేఖర్-రామ్‌కుమార్ రామనాథన్ 6-4 4-6 7-10 తేడాతో స్థానిక వైల్డ్‌కార్డ్‌లు స్టీఫన్ దోస్తానిక్ మరియు బెంజమిన్ కిట్టే చేతిలో ఓడి క్వార్టర్ ఫైనల్ నుండి నిష్క్రమించారు.

## ఆస్ట్రేలియాదే టి20 సిరీస్
# 3-0తో వెస్టిండీస్ ఓటమి



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ సొంతగడ్డపై ఆస్ట్రేలియా జైత్ర యాత్ర కొనసాగుతోంది. సెయింట్స్ కిట్స్ వేదికగా శనివారం వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించిది. తద్వారా 5 టీ20ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో కంగారులు సొంతం చేసుకున్నారు. ఈ మూడో టీ20 మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కరేబియన్ జట్టు 4 వికెట్లు నష్టానికి 214 పరుగుల భారీ స్కోర్ సాధించింది. విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (102) అజేయ శతకంతో కదం దొక్కగా, బ్రాండెన్ కింగ్ (62) రాణించాడు. ఆసిస్ బౌలర్లలో మిచెల్ ఓవెన్, ఎల్లీస్, జంపా తలా వికెట్ సాధించారు. అనంతరం 215 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 16.1 ఓవర్లలో చేధించింది. ఈ లక్ష్య సాధనలో ఆసిస్ ప్లేయర్ టిమ్ డేవిడ్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. కేవలం 37 బంతుల్లో 6 ఫోర్లు, 11 సిక్సర్ల సాయంతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

ఆస్ట్రేలియా తరపున టీ10ల్లో ఫాసెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా డేవిడ్ రికార్డులకెక్కాడు. డేవిడ్‌తో పాటు, మిచెల్ ఓవెన్ (36), మార్ష్ (22), మాక్స్‌వెల్ (20) రాణించారు. విండీస్ బౌలర్లలో షెఫర్డ్ 2 వికెట్లు పడగొట్టగా, హోల్డర్ ఒక వికెట్ సాధించాడు. మరో వికెట్ రనౌట్ రూపంలో లభించింది.

# టీమిండియా క్లిష్ట పరిస్థితి
## బౌలర్ల ఘోర తప్పిదాలు.. ఇంగ్లండ్ టూర్‌లో లోపించిన స్థిరత్వం






**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా బౌలర్ల ప్రదర్శన ఒక పట్టాన అర్థం కావట్లేదు. మొదటి టెస్ట్ నుంచి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. అందుకే నాలుగో టెస్ట్ ప్రారంభానికి ముందే భారత్ సిరీస్‌లో వెనుకబడిపోయింది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో నాలుగో మ్యాచ్‌లో టీమిండియా బౌలింగ్ అత్యంత బలహీనంగా కనిపించింది. భారత బౌలర్లు బంతిని వేసే విధానంలో స్థిరత్వం లేకపోవడం ఒక సమస్య అయితే, ప్రతీ మ్యాచ్‌లో ఒకేలా చేసిన మరో తప్పు క్రమశిక్షణ లేకపోవడం. మొదటి మ్యాచ్ నుంచే భారత బౌలర్లు తమ పరిమితులను అతిక్రమిస్తున్నారు. మాంచెస్టర్‌లో జరుగుతున్న నాల్గో టెస్ట్‌లో కూడా ఇందులో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఈ విషయంలో టీమ్ స్టార్ పేస్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా అందరికంటే ముందు ఉన్నాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో బుమ్రా, మహ్మద్ సిరాజ్ తో సహా ఏ భారత బౌలర్ కూడా ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్‌లను స్థిరంగా ఇబ్బంది పెట్టలేకపోయారు. దీని ప్రభావం వల్ల మూడో రోజు ముగిసేసరికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు పైగా ఆధిక్యాన్ని సంపాదించింది. భారత బౌలర్లలో పదును, వేగం కంటే క్రమశిక్షణ లోపమే ఎక్కువగా కనిపించింది. ఈ మ్యాచ్‌లో రెండో రోజు ఇంగ్లండ్ బ్యాటింగ్‌లో మొదటి ఓవర్ నుంచే భారత పేస్ బౌలర్లు బంతిపై సరైన నియంత్రణ సాధించలేకపోయారు. ఇది మూడో రోజు ఆట ముగిసే వరకు కొనసాగింది. ఈ సమయంలో భారత బౌలర్లు తమ పరిమితిని, అంటే బౌలింగ్ క్రీజ్‌ను చాలాసార్లు దాటారు. దీనివల్ల ఇంగ్లండ్‌కు అదనపు పరుగులు వచ్చాయి. మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా మొత్తం 136 ఓవర్లు బౌలింగ్ చేసింది. ఇందులో మొత్తం 13 నోబాల్స్ ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 5 నోబాల్స్‌ను టీమ్‌లో అత్యంత సీనియర్ పేస్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా వేశాడు. కేవలం బుమ్రా మాత్రమే కాదు, ఇతర బౌలర్లు కూడా ఈ విషయంలో వెనుకబడలేదు. మాంచెస్టర్ టెస్ట్‌తో అరంగేట్రం చేస్తున్న యువ పేస్ బౌలర్ అన్షుల్ కంబోజ్ 18 ఓవర్లలోనే 4 సార్లు నోబాల్ వేశాడు. ఇక స్పిన్నర్ అయినప్పటికీ నోబాల్స్ వేయడంలో పేరుగాంచిన రవీంద్ర జడేజా కూడా ఇక్కడ ఆగలేదు. 33 ఓవర్లలో ఆయన ఖాతాలో 3 నోబాల్స్ చేరాయి. శార్దూల్ ఠాకూర్ కూడా 1 నోబాల్ వేశాడు. ఈ విషయంలో మహమ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్ మాత్రం క్రమశిక్షణ చూపించారు.

## వరల్డ్ టేబుల్ టెన్నిస్‌లో..
# రన్నరప్‌గా మిక్స్‌డ్ జోడీ బైస్య, ఆకాష్
## మహిళల సింగిల్స్‌లో సెమీస్‌కు శ్రీజ

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ కాంటెండర్-2025, మిక్స్‌డ్ డబుల్స్‌లో బైస్య-ఆకాష్ జోడీ రన్నరప్‌గా నిలిచింది. అలాగే మహిళల సింగిల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి అకుల శ్రీజ సెమీఫైనల్‌కు చేరుకోగా, ఆకాష్ సథియన్ పురుషుల డబుల్స్‌లో ఫైనల్‌కు చేరుకున్నారు. లాగోస్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ పోయ్‌మంటీ బైస్య మరియు ఆకాష్ పాల్ రన్నరప్‌తో సరిపెట్టింది. క్వాలిఫికేషన్ రౌండ్లలో ఫ్రాన్స్‌కు చెందిన జుల్స్ రోలాండ్-ప్రితికా పావాడే చేతిలో టాప్ సీడ్ జోడీ బైస్య-పాల్ 10-12, 5-11, 11-6, 7-11 తేడాతో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రస్తుత జాతీయ ఛాంపియన్‌లైన బైస్య-పాల్, మొదటిసారి కలిసి ఆడుతున్న ఫ్రెంచ్ జంట చేతిలో కేవలం 27 నిమిషాల్లోనే పూర్తిగా ఓడిపోయారు. లాగోస్‌లో భారత జట్టు మొదటి రౌండ్,





క్వార్టర్ ఫైనల్స్‌లో వరుసగా రెండు గేమ్‌ల విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత సెమీఫైనల్లో ఇటలీకి చెందిన జాన్‌ఓయెబోడ్, గయా మోన్‌ఫార్డిని‌ని 3-1 తేడాతో ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించారు. అలాగే సత్యన్ జ్ఞానశేఖరన్‌తో కలిసి పురుషుల డబుల్స్ ఫైనల్‌కు చేరుకున్నాడు. అన్‌సీడెడ్ సాథియన్-పాల్ జంట ఘనాకు చెందిన జేమ్స్ మార్ఫో-ఇమ్మాన్యుయేల్ కామీలను 11-3, 11-3, 11-4 తేడాతో ఓడించి సెమీఫైనల్‌ను సాధించారు. మహిళల డబుల్స్‌లో భారత జంట బైస్య-కృత్వికా రాయ్ సెమీఫైనల్లో టాప్ సీడ్ కిమ్ నయోంగ్-ర్యు హన్నా చేతిలో 8-11, 2-11, 14-12, 8-11 తేడాతో ఓడిపోయారు. ఇక అంతకు ముందు మహిళల సింగిల్స్‌లో శ్రీజ సెమీఫైనల్స్‌కు చేరుకుంది.

# పొదుపే కాదు.. ఖర్చు కూడా చేయాలి: రాధికా గుప్తా సూచనలు

**ముంబై, జూలై 26:** జీవితం అంటే పొదుపు చేయడమే కాదు.. ఖర్చు పెట్టడమూ అవసరమే అంటున్నారు ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా. వ్యక్తిగత ఆర్థిక క్రమశిక్షణ అత్యవసరమే అయినప్పటికీ కొన్నిసార్లు చిన్న చిన్న ఆనందాల కోసం వెచ్చించాలని చెప్పారు. అప్పుడే జీవన ప్రయాణానికి నిజమైన అర్థం లభిస్తుందన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. నా కలను సాకారం చేసుకునేందుకు ప్రయాణం ప్రారంభించాను. ఇప్పుడు నా హృదయం ఆనందంతో నిండిపోయింది. కష్టపడటంలో ఉండే మాధుర్యమే ప్రత్యేకం. సిప్‌లు చేయండి అని చెప్పడం నా వృత్తే కాదనను.. కానీ, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ నేనో విషయం చెబుతాను. కష్టపడటం వల్ల మీకు అందిన ఫలాలను ఆస్వాదించడానికి సమయం కేటాయించుకోండి. పొదుపు చేయడం ముఖ్యమే.. కానీ ఖర్చు చేయడమూ అవసరమే. మీకు సంతోషానిచ్చే వాటిపై వెచ్చించినప్పుడే జీవిత ప్రయాణానికి అర్థం ఉంటుంది. పరిపూర్ణమైన జీవితం



అనేది ఎవరు ఎక్కువ ఆస్తులు సంపాదించారని లెక్కగట్టే రేస్ కాదు. ఎవరు ఎంత ఆనందంగా జీవించారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వివేకం, వ్యక్తిగత ఆనందం మధ్య సమతుల్య ప్రయాణం ఎప్పటికీ మంచిదే అని రాధికా గుప్తా తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఆర్థిక వ్యవహారాలపై యువతకు సలహాలు, సూచనలు ఇచ్చే రాధిక గుప్తా.. అప్పుడప్పుడు సామాజిక అంశాల పైనా తన అభిప్రాయాలను వెల్లడిస్తుంటారు. ఈ మధ్య ఒబెసిటీ సమస్య గురించి మాట్లాడుతూ, రెస్టరంట్లు హాఫ్ ప్లేట్ ఐడియాను పాటిస్తే మంచిదన్నారు. దానివల్ల ఆహారం, డబ్బువృథాకాకుండా.. కొంచెం తినే అవకాశం లభించినట్లవుతుందని తెలిపారు. ఇక, అంతకుముందు పని గంటల చర్చ పైనా స్పందించారు. సుదీర్ఘ పని గంటలు ఉన్నంత మాత్రాన ఉత్పాదకత ఏమీ ఉండదన్నారు. అంతేగాక, కుటుంబం, మానసిక ఆరోగ్యం కూడా ప్రతీ వ్యక్తికి ముఖ్య మేనని గుర్తు చేశారు.

# వోల్వో కార్లకు డబ్బులు చెల్లించని నార్త్ కొరియా
## వెయ్యి కార్లు కొనుగోలు చేసి 50యేళ్లు..

**న్యూఢిల్లీ, జూలై 26:** ప్రపంచం మొత్తం ఒకవైపు ఉంటే ఉత్తర కొరియా మాత్రం మరోవైపు ఉంటుంది. ప్రజలను ఇప్పటికీ పాతకాలంలోనే బతికేలా చేస్తుంటుంది. నియంతృత్వ పోకడలతో ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రజలను నియంత్రిస్తుంటాడనే విషయం ప్రపంచం మొత్తానికీ తెలుసు. అలాంటి ఉత్తర కొరియాతో స్వీడన్ కంపెనీలు ఓ బిజినెస్ డీలింగ్ కుదుర్చుకున్నాయి. 1,000 వోల్వో కార్లను సప్లై చేసేందుకు అంగీకరించాయి. ఇది 1974 నాటి మాట. అప్పట్లో ఈ ఒప్పందాన్ని స్వీడన్ కంపెనీ చాలా గొప్పగా భావించింది. ఉత్తర కొరియాలో ఇక తమ కంపెనీ వేగంగా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఒప్పందం ప్రకారం వెయ్యి కార్లను అనతికాలంలోనే ఎగుమతి చేసింది. అయితే, ఆ కార్లకు సంబంధించి పైసా కూడా ఉత్తర కొరియా చెల్లించలేదు. ఈ కార్ల విలువ అప్పట్లోనే 73 మిలియన్ డాలర్లు. రేపో మాపో చెల్లిస్తుందని ఆ కంపెనీ ఈ రోజుకూ ఎదురుచూస్తూనే ఉంది కానీ 50 ఏళ్లు గడిచినా నేటికీ ఉత్తర కొరియా నుంచి ఒక్క డాలరు కూడా ముట్టలేదు. స్వీడన్ కంపెనీ పలుమార్లు లేఖలు రాసినా ఉపయోగం లేకుండా పోయింది. నాడు 73 మిలియన్ డాలర్లుగా ఉన్న మొత్తం ప్రస్తుతం వడ్డీతో కలిసి సుమారు 330 మిలియన్ డాలర్లకు చేరింది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. 50 ఏళ్ల నాటి వోల్వో కార్లను ఉత్తర కొరియా నేటికీ ఉపయోగిస్తూనే ఉంది. విదేశీ ప్రతినిధులు, జర్నలిస్టులు తమ దేశానికి వచ్చినపుడు వారిని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఈ వోల్వో కార్లనే ఉపయోగిస్తుండడం విశేషం.




# ఆగస్టు 1 నుంచి యుపిఐ కొత్త రూల్స్..

**ముంబై, జూలై 26:** డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూపీఐకి సంబంధించి పలు మార్పులు రాబోతున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ఆగస్టు 1 నుంచి కొత్త రూల్స్ తీసుకొస్తోంది.ఒకప్పుడు బ్యాంకు ఖాతాలో ఎంత నగదు ఉందో తెలుసు కోవడం చాలా కష్టంగా ఉండేది. యూపీఐ అందుబాటులోకి వచ్చాక ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే వంటి యాప్స్ సాయంతో ఒక్క క్షణంలో తెలుసుకునే వీలు ఏర్పడింది. బ్యాంకు శాఖ/ఏటీఎం కేంద్రానికి వెళ్లే అవసరం తప్పింది. ఇలా చెక్ చేసుకునే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి పరిమితీ లేదు. ఇకపై రోజులో 50సార్లు మాత్రమే బ్యాలెన్స్ తనిఖీ చేసుకునేందుకు అనుమతిస్తారు. అలాగే, ఒక మొబైల్‌నంబర్‌పై ఎన్ని బ్యాంకు ఖాతాలు లింక్ అయ్యాయో 25 సార్లకు మించి చూసుకోలేరు. నెట్‌వర్క్‌పై భారం తగ్గించడం ద్వారా.. వినియోగదారులకు మరింత మెరుగైన, అంత రాయంలేని సేవలు అందించడమే లక్ష్యంగా బ్యాంకులు, యూపీఐ సేవల సంస్థలకు ఎన్‌పీసీఐ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఆటో పేమెంట్ లావాదేవీల విషయంలోనూ ఎన్‌పీసీఐ నిబంధనల్లో మార్పులు చేసింది. సబ్‌స్క్రిప్షన్లు, యుటిలిటీ బిల్లులు, ఈఎంఐలు వంటి ఆటో పేమెంట్‌లను రద్దీ లేని సమయంలో మాత్రమే నిర్వహించాలి. ఆటోపేమెంట్ రిక్వెస్ట్ పెట్టే సంస్థలు రద్దీ లేని సమయంలోనే యూపీఐ కలెక్షన్‌రిక్వెస్ట్‌ను షెడ్యూల్ చేయాలి. యూజర్లు చేసే చెల్లింపులకు ఈ నిబంధన వర్తించదు. యూపీఐ ద్వారా నెలకు దాదాపు రూ.1800 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మే నెలల్లో పలుమార్లు యూపీఐ సేవలకు అంతరాయం ఏర్పడింది. అనవసర ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేసెస్ కాల్స్) వల్ల ఈ పరిస్థితి నెలకొందని ఎన్‌పీసీఐ గుర్తించింది. అంటే పదేపదే బ్యాలెన్స్ తనిఖీ చేయడం, పేమెంట్ స్టేటస్ చెక్ చేయడం వంటివి ఇందుకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 1 నుంచి తాజా మార్పులకు శ్రీకారం చుట్టింది. వీటివల్ల సాధారణ వినియోగదారులపై పెద్దగా ప్రభావం ఉండదు. ఎందుకంటే రోజులో ఎక్కువసార్లు ఎవరూ బ్యాలెన్స్ తనిఖీ చేపట్టరు. ఒకవేళ ఆ పరిమితికి మించి చేసినప్పుడే అంతరాయాన్ని గుర్తిస్తారు. పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే వాడేవారందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి.




# అమెరికన్ల చేతిలో భారత్ ఫోన్లు..

**న్యూఢిల్లీ, జూలై 26:** స్మార్ట్‌ఫోన్ల తయారీలో భారత్ దూసుకెళుతోంది. పీఎల్‌ఐ స్కీమ్ కారణంగా దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ నేడు మేడిన్ ఇండియాఫోన్లు పెద్దఎత్తున దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఐదు నెలల కాలానికి ఆ దేశ స్మార్ట్‌ఫోన్ల దిగుమతుల్లో మన వాటా 36 శాతానికి చేరింది. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరి వద్ద దేశీయంగా తయారైన ఫోన్లు ఉంటున్నాయన్నమాట. గతేడాది ఈ వాటా 11 శాతంగా ఉంది. అదే సమయంలో 82 శాతంగా ఉన్న చైనా మార్కెట్ వాటా 49 శాతానికి తగ్గింది. ఆ మేర డ్రాగన్ ఆధిపత్యానికి గండిపడింది. అమెరికా ఇంటర్నేష నల్ ట్రేడ్ కమిషన్ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి-మే నెల మధ్యకాలంలో 21.3మిలియన్ యూనిట్ల స్మార్ట్‌ఫోన్లను భారత్ అమెరికాకు ఎగుమతి చేసింది. 9.35 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను అగ్రరాజ్యా నికి భారత్ ఎగుమతి చేసింది. మన దేశం నుంచి ఎగుమతి చేసిన వస్తువుల్లో విలువ పరంగా స్మార్ట్‌ఫోన్లదే అగ్రస్థానం కావడం విశేషం. అమెరికాకు ఇప్పటికీ అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేస్తున్నది చైనానే అయినప్పటికీ, ఆదేశ దిగుమతులు క్రమంగా క్షీణిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి-మే మధ్య 29.4 మిలియన్ యూనిట్లను ఆ దేశం అమెరికాకు ఎగుమతి చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 27 శాతం తగ్గడం గమనార్హం. మొత్తంగా 10 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. ప్రస్తుతం చైనా 49 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉండగా, భారత్ 36 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. వియత్నాం 14 శాతం మార్కెట్‌వాటాతో మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు ఎగుమతి అవుతున్న స్మార్ట్ ఫోన్లలో అత్యధికం యాపిల్‌వే. 2020 వరకు స్మార్ట్ ఫోన్ల ఉత్పత్తి విషయంలో చైనా పైనే




అధికంగా ఆధారపడిన యాపిల్, ఆ తర్వాత తన పంథాను మార్చుకుంది. భారత్ తయారీని ప్రారంభించింది. ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. తొలుత కేవలం పాత మోడళ్లు మాత్రమే ఉత్పత్తి చేసే యాపిల్.. ఇప్పుడు ప్రో మోడళ్ల తయారీనీ దేశంలోనే చేపడుతోంది.

# వాణిజ్యం

**వాషింగ్టన్, జూలై 26:** ఈ రోజుల్లో చాట్‌జీపీటీకి ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు. ముఖ్యంగా యువత అయితే ప్రతి చిన్న సందేహాన్నీ ఈ చాట్‌బాట్‌లోనే అడిగి తెలుసుకుంటున్నారు. దాన్నో ఫ్రెండ్‌లా భావించి మనసు విప్పి మాట్లాడుకుంటున్నారు. అయితే, ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలంటున్నారు చాట్‌జీటీపీ సృష్టికర్త, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్. ఈ చాట్‌బాట్‌తో యూజర్లు పంచుకునే విషయాలు రహస్యంగా ఉండవని చెప్పారు. న్యాయస్థానాలు ఉత్తర్వులు ఇస్తే తాము ఏ విషయాన్నైనా వెల్లడి చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఓ కమెడియన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, శామ్ ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య చాలా మంది యూజర్లు తమ జీవితాల్లో జరిగే వ్యక్తిగత విషయాలను చాట్‌జీపీటీకి చెప్పేస్తున్నారు. ముఖ్యంగా యువత దీన్ని ఓ థెరపిస్ట్‌గా, లైఫ్ కోచ్‌గా భావిస్తున్నారు. కానీ, యూజర్లతో జరిపే వ్యక్తిగత సంభాషణలను భద్రంగా ఉంచే ఎఐ రంగం ఇంకా పురోగతి సాధించాల్సి ఉంది. ఓ డాక్టర్‌తోనో, న్యాయవాది లేదా థెరపిస్ట్‌తో జరిపిన సంభాషణకు ఉన్నంత గోప్యత ఎఐ చాట్‌లలో ఉండదు. చాట్‌జీపీటీలో విశ్వసనీయత ఉంటుందని మీరు భావించొద్దు. ఒక్కోసారి న్యాయపరమైన సమస్యలు వచ్చినప్పుడు కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా మేం వ్యవహరించాల్సి ఉంటుంద్ది అని ఓపెన్‌ఏఐ సీఈఓ వెల్లడించారు.

## చాట్‌జిపిటితో సీక్రెట్లు చెబితే అంతే..: శామ్ ఆల్ట్‌మన్ అలర్ట్




ప్రస్తుతం చాట్‌జీపీటీ ఫ్రీ, ప్లస్, ప్రో అకౌంట్లలో డిలీట్ చేసిన చాట్‌లను 30 రోజుల్లోపు సిస్టమ్స్ నుంచి పూర్తిగా తొలగిస్తున్నారు. అయితే, న్యాయపరమైన సమస్యలు ఎదురైతే మాత్రం వాటిని అలాగే ఉంచుతామని ఆల్ట్‌మన్ తెలిపారు. కేసుకు సంబంధించి కోర్టు ఉత్తర్వులు ఇచ్చినప్పుడు మాత్రం.. తమ వద్ద ఉన్న మొత్తం సమాచారాన్ని బయటపెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల చాట్‌జీపీటీతో వ్యక్తిగత వివరాలు పంచుకునే విషయంలో పునరాలోచన చేయాలని సూచించారు.

# టెక్నాలజీ అందుబాటులోకి తేవడమే మా ధ్యేయం

**న్యూఢిల్లీ, జూలై 26:** రిలయన్స్ రిటైల్ ఇటీవల ఎలక్ట్రోలక్స్ గ్రూప్ క్జ్వామర్ డ్యూరబుల్స్ బ్రాండ్ కెల్వినేటర్ కొనుగోలు డీల్‌పై కంపెనీ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌విఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ స్పందించారు. కంపెనీ ఉత్పత్తుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి వినియోగదారుడి విభిన్న అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 'కెల్వినేటర్ కొనుగోలు కంపెనీ అభివృద్ధికి ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది భారతీయ వినియోగదారులకు నమ్మకమైన ప్రపంచ ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావడానికి వీలు కల్పిస్తుంది. దానికి కంపెనీ మార్కెట్ లీడింగ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఎంతో తోడ్పడుతుంది' అని ఇషా చెప్పారు. ఈ డీల్ విలువ సుమారు రూ.160 కోట్లు. దేశీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రీమియం గృహోపకరణాల విభాగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించేందుకు రిలయన్స్ రిటైల్‌కి ఇది ఉపయోగపడనుంది. రిలయన్స్ రిటైల్ గతంలో కెల్వినేటర్ బ్రాండ్‌కి లైసెన్సు తీసుకుని ఉపయోగించుకుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14